www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం



సంపుటి : 68 | సంచిక : 189 | మంగళవారం 01-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ





● నిరుద్యోగులకు న్యూ ఇయర్ గిఫ్ట్

జాబుల జాతర

- 1386 పోస్టుల భర్తీకి షెడ్యూలు
- గ్రూప్1-169, గ్రూప్2-446
- పాలిటెక్నిక్ లెక్చరర్లు-405, డిగ్రీ లెక్చరర్లు-308
- గ్రూప్-2లో అత్యధిక పోస్టులు
- మే 2న గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ : ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్

ఏపీపీఎస్సీ ఏడు నోటిఫికేషన్లు



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి :
నిరుద్యోగ యువతకు కొత్త సంవత్సర కానుకంగా ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 1386 పోస్టులకు భర్తీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్ సోమవారం ఏడు నోటిఫికేషన్లు విడుదల చేశారు. ఇందులో గ్రూప్1 కేడర్ పోస్టులు–169, గ్రూప్2–446, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లు–405, ఫిషరీస్ డవలప్‌మెంటు ఆఫీసర్లు–43, డిగ్రీ కళాశాల లెక్చరర్లు–308, ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు–10, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు–5 ఉన్నాయి. తాజా నోటిఫికేషన్లలో అత్యధికంగా గ్రూప్–2

- మిగతా 2 లో

న్యూ ఇయర్ జోష్



ఉల్లాసం.. ఉద్విగ్నం...

- అమరావతికి హైకోర్టు జడ్జీలు, సిబ్బంది
- న్యాయమూర్తుల ప్రమాణం నేడు
- నేటి నుంచి కార్యకలాపాలు

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్ :
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు ప్రక్రియ మొదలైంది. 10 ప్రత్యేక బస్సుల్లో సిబ్బందిని, ఫైళ్లను అమరావతికి తరలించారు. మంగళవారం నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతిలో ఉనికిలోకి వస్తుండటంతో హైదరాబాద్ నుంచి తరలింపు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు న్యాయమూర్తులు, లాయర్లు తరలిపోతుండటంతో ఉమ్మడి హైకోర్టు వద్ద హడావిడి నెలకొంది. ఏపీకి వెళ్తున్న న్యాయమూర్తులకు తెలంగాణ లాయర్లు, న్యాయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఫైళ్లు, సామాగ్రి తరలింపుతో ఒకవైపు హడావిడి, మరోవైపు సహచర సిబ్బంది వెళ్లిపోతుండటంతో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఇన్నేళ్లు వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని సెల్ఫీలు తీసుకుంటూ ఆత్మీయ వీడ్కోలు పలికారు. సుమారు 900 మంది

- మిగతా 2 లో


చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కు సీఎస్ పునేఠ స్వాగతం


విజయవాడలో తాత్కాలిక హైకోర్టు ఇదే



చెప్పడానికే

నీతులా...!

- అందరూ పాటించాలట
- ఆయన మాత్రం నోరు విప్పరట
- సోషల్ మీడియాలో నకిలీలపై అధినేతల తలోమాట
- మన్‌కీబాత్‌లో మోడీ వింత వాదన

న్యూఢిల్లీ :
నీతులు చెప్పడానికే...అనే సూక్తి ప్రధాని నరేంద్రమోడీకి అక్షరాలా వర్తిస్తుంది. 'ప్రతికూల అంశాలను ప్రచారం చేయడం చాలా సులువు. సానుకూల అంశాలను వైరల్ చేయడానికి మనమంతా చేతులు కలుపుదాం!' అంటూ ఆదివారం 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో నరేంద్ర మోడీ దేశ పౌరులకు పిలుపునిచ్చారు. ఇది అందరూ పాటిస్తే మంచిదే. అయితే, ఆయన ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారో తెలియదు గానీ ఆ వ్యాఖ్యల స్ఫూర్తిని ముందుగా అర్థం చేసుకోవాల్సిందీ, పాటించాల్సిందీ బీజేపీ నాయకులు, కార్యకర్తలే. 'ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ తన తండ్రి ములాయం సింగ్ యాదవ్ చెంప పగుల గొట్టాడు' అనే నకిలీ వార్త వైరల్ అయింది. దానిని ఓ బీజేపీ సోషల్ మీడియా కార్యకర్త సృష్టించారు. ఈ విషయాన్ని బీజేపీ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో నరేంద్ర మోడీ కుడిభుజం, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా స్వయంగా

- మిగతా 2 లో



కొత్త వత్సరమా..!

నిన్నటితో చరిత్రగా మారిన 2018కు వీడ్కోలు పలుకుతూ.. నేడు వర్తమాన సింహాసనాన్ని అధిష్ఠించిన 2019ను స్వాగతిద్దాం. కాలమెప్పుడూ నిత్యనూత్నం.. జీవితమెప్పుడూ సత్యకేతనం. కాలం నిరంతర ప్రవాహమే కాదు.. ఒక సవాలు, ఒక జవాబు, ఒక విషాదం, ఒక విజయం. అసహన కేతనాన్ని ఎగరవేసి, జాతి జీవలక్షణమైన బహుళత్వంపై అతి క్రూరంగా విరుచుకుపడి, విద్వేషం, విధ్వంసపు విషాన్ని విరజిమ్మిన నయా ఫాసిస్టు పాలనపై గత ఏడాది కొరడా ఝుళిపించింది. రాజకీయాలతోపాటు విద్య, చరిత్ర, సంస్కృతికి మతం రంగు పులిమే వికృత విన్యాసాలకు జనక్షేత్రంలో తగు గుణపాఠం తప్పదనీ, మత రాజకీయాలకు పరాజయ పరాభవం అనివార్యమని చాటింది. జాతి బహుళత్వంపై ఎవరు ఎప్పుడు దాడికి దిగినా శృంగభంగం తప్పదని మరోమారు నిరూపించింది.. అసహనంపై సమన్వయం, సామరస్యతల విజయంగా ఈ ఏడాది ముగిసింది. అన్నదాతల ఆగ్రహాన్ని చవిచూపిన వత్సరంగా 2018 చరిత్రకెక్కింది. పాలక విధానాలపై ఆత్మహత్యలు కాదు, కన్నెర్ర చేయడమే గమనం, గమ్యం కావాలంటూ దేశ చరిత్రలోనే తొలిసారి సమ్మె అస్త్రం ప్రయోగించి, తమ సత్తా చాటారు.

తెలుగు ప్రజల బాగోగుల కన్నా సెంటిమెంట్ రాజకీయాలు పండించడానికే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. తమ అవసరాల కోసం ఆలింగనం చేసుకోవడం, తమ రాజకీయాల కోసం ప్రజల మధ్య సెంటిమెంట్ చిచ్చు రేపడం ఇద్దరు చంద్రులకు ఆనవాయితీగా మారింది. రెండు రాష్ట్రాలూ కరవు కోరల్లో చిక్కుకున్నా.. ప్రకటనలతో సరిపెట్టడం తప్ప ప్రభుత్వాలు రైతులను ఆదుకొనే సమగ్ర చర్యల ఊసెత్తడంలేదు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీగా ఇచ్చిన ప్రత్యేకహోదా సాధనకు భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమించగా, ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం దాన్నో ఎన్నికల అస్త్రంగా మార్చుకొని తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ఎర్రజెండా అండతో సాగుతున్న ఆందోళన విజయవంతంగా ముందుకు సాగుతూ రేపోమాపో ఫలితాలు దక్కే ఆశను రేకెత్తించింది.

ఏ ఏడాది ముగిసినా తేలని కథలెన్నో.. ఏడాది పొడవునా చూస్తున్నా ఏం జరుగుతుందో అర్థంగాని మిస్టరీలెన్నో.. వచ్చే ఏడాదికి ఎదురెళ్లే సమస్యలెన్నో.. రైతుల వెతలు, నిరుద్యోగుల ఎదురుచూపులు, మధ్యతరగతి ఆశలు ఎప్పటిలానే 2019లోకి తరలివస్తాయి. ప్రజారాశుల ప్రతిఘటనోద్యమాలు, క్రీడాస్ఫూర్తులు, మానవతాదీప్తులు ప్రతి ఏటా పునరావృతమవుతూనే ఉంటాయి. కొత్త వత్సరంలో మరోకొత్త ఆయుధంతో హిందుత్వవాదులు ముందుకువచ్చేందుకు సన్నద్ధమయ్యారు. అయితే ఇప్పటికే అసహనంపై ప్రజల ఆగ్రహాన్ని చవిచూసిన ఆ శక్తులకు ఈ ఏడాది ఓ పీడకలగా మిగిలిపోవాలి. జాతిని మతవాద, మితవాద, మనువాద భావాలతో మధ్యయుగాలకు నెట్టే ప్రయత్నాలు చేస్తున్న హిందుత్వవాదులను తిప్పికొట్టేందుకు 2019 సకల అస్త్రశస్త్రాలతో సన్నద్ధం కావడమే దాని ముందున్న తక్షణ కర్తవ్యం. సమస్యలు, సవాళ్లు, సమాధానాలు.. కాలంలా ఇదో అనంత భ్రమణం.. నిరంతర గమనం.

కొత్త వత్సరమా..
నిజంగానే నిఖిలలోకం
నిండు హర్షం వహిస్తుందా?
మానవాళికి నిజంగానే
మంచికాలం రహిస్తుందా?

ఉత్తమ ఉపాధ్యాయులకు

తీపి కబురు


సర్వీసు మరో ఏడాది పెంచుతూ జీవో

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి :
ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రస్తుతం వారికున్న సర్వీసు మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయాన్ని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధిత్యనాథ్ దాస్ తెలిపారు. ప్రాథమిక విద్యను మరింత బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం

- మిగతా 2 లో

మళ్లీ అవకాశమివ్వండి

- పోలవరం పూర్తిచేసి చరిత్ర సృష్టిస్తాం
- రేపటి నుంచి 'జన్మభూమి-మా ఊరు'
- సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి :
గత విజయాలను సమీక్షించి, నవ సంకల్పాలతో భవిష్యత్తును నిర్మించుకొనేందుకు వచ్చిన శుభ సమయమే కొత్త సంవత్సరమని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. నూతన సంవత్సరం... పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యి నవ్యాంధ్రప్రదేశ్ చరిత్ర గతిని శాసించే సమయం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు

- మిగతా 2 లో

ఇదీ లోకం!





అతివేగానికి నలుగురు విద్యార్థులు బలి

3లో

తగ్గిన గ్యాస్ ధర

సబ్సిడీ గ్యాస్‌పై రూ.5.91, సబ్సిడీయేతర సిలెండర్‌పై రూ. 120.5 తగ్గింపు



11లో

పౌరహక్కుల పరిరక్షణ కోసం

గళమెత్తుదాం

- పోలీసుల చర్యలను ఐక్యంగా తిప్పికొడదాం : రామకృష్ణ, మధు
- రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం: ఓబులేసు, ఉమామహేశ్వరరావు
- రౌండుటేబుల్ సమావేశంలో ప్రభుత్వ వైఖరిపై ప్రజాసంఘాల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి :
పౌరహక్కుల పరిరక్షణ కోసం ప్రజాతంత్ర్య, అభ్యుదయవాదులంతా ఐక్యంగా గళమెత్తాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడ ఎన్జీవో హోమ్‌లో రౌండుటేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి అధ్యక్షవర్గంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు వి.ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్న టీడీపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని చెప్పారు. ప్రభుత్వ కనుసన్నల్లో పోలీసులు పనిచేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ కేంద్రంగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం పలు కార్మిక, ప్రజాసంఘాలు

- మిగతా 2 లో



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన జల్లి విల్సన్, మధు, ఓబులేసు, ఉమామహేశ్వరరావు, గౌతంరెడ్డి, వనజ తదితరులు

ఫిలిప్పీన్స్‌లో ఉస్మాన్ తుపానుతో
68కు చేరిన మృతుల సంఖ్య

మనీలా: సెంట్రల్ ఫిలిప్పీన్స్ ప్రాంతంలో నాలుగురోజులుగా కొనసాగుతున్న ఉస్మాన్ తపాను పెను విధ్వంసం సృష్టిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. బైకోల్ పర్వత ప్రాంతంలో కొండచరియలు విరిగపడటంతో ఇప్పటివరకు 57మంది మరణించినట్లు తెలుస్తోంది. నమార్ దీవుల్లో బలంగా వీస్తున్న గాలులు, వర్షపాతానికి 11మంది మరణించారు. ఎక్కువగా కొండచరియలు ఉన్న ప్రాంతాలు భారీ వర్షాలకు నాని కూలడంతో ప్రాణనష్టంకలిగినట్లు బైకోల్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ క్లాడియో యుకోట్ వెల్లడిస్తున్నారు. ప్రభుత్వం తగిన ముందుజాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఉస్మాన్ తుపాను విధ్వంసానికి పలువురు ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ సందర్భంగా పలువురు పండగ వాతావరణంలో మునిగిఉండగా ముందస్తుగా ఎటువంటి హెచ్చరికలు జారీ చేయకపోవడంతో ప్రాణనష్టం భారీగా జరినట్లు స్థానికులు వెల్లడించారు.

ఉస్మాన్ తుపాను పడమటిదిక్కుకు మరలడంతో ప్రభావితమైన ప్రాంతాల్లో ప్రభుత్వం సురక్షిత చర్యలు చేపడుతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటివకు 40,000 మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లగా 17 మంది తప్పిపోయినట్లు తెలుస్తోంది. ప్రతి ఏడాది ఫిలిప్పీన్స్‌లో కనీసం 20 ప్రకృతి వైపరీత్యాలుసంభవిస్తాయని సివిల్ డిఫెన్స్ అధికారి వెల్లడించారు. కారణంగా వందలాదిమంది మరణిస్తుండగా భారీ సంఖ్యలో పలువురు నిలువునీడలేకుండా మరింత దారిద్ర్యానికి గురవుతన్నారు. 2013లో పెద్ద ఎత్తున సంభవించిన హైయాన్ తుపానువలన సుమారు 7,360 మంది మరణించినట్లు అధికార గణాంకాలు వెల్లడించాయి.



బంగ్లాదేశ్ ఎన్నికల్లో హసీనా విజయభేరి



స్వతంత్రంగా, స్వేచ్ఛగా మళ్లీ ఎన్నికలు జరపాలి : ప్రతిపక్షం

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాం : ఈసీ

ఢాకా : బంగ్లాదేశ ప్రధాని షేక్ హసీనా మిత్రకూటమి విజయభేరి మ్రోగించిందని సోమవారం అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికల ప్రక్రియను ప్రధాన ప్రతిపక్షం వ్యతిరేకించింది. ఈ ఎన్నికల్లో 18 మంది మృతి చెందగా, 200 మందికి గాయాలవ్వడంతో అత్యధిక రక్తపాతం జరిగిన ఎన్నికలుగా చరిత్రకెక్కాయి. 300 పార్లమెంటు సీట్లకు 288 సీట్లను అధికార అవామీ లీగ్ ఆధ్వర్యంలోని మిత్రకూటమి గెలుచుకుందని ఎన్నికల కమిషన్ కార్యదర్శి హోలాలుద్దీన్ అహ్మద్ తెలిపారు. ప్రతిపక్షమైన ఐక్య ఫ్రంట్ నేషనల్ యూనిటీ ఫ్రంట్ (ఎన్‌యూఎఫ్) ఏడు సీట్లను మాత్రమే గెలుచుకోగా వారి మిత్ర పక్షం మరో మూడు సీట్లలో విజయం సాధించింది. ఒకచోట బరిలోని అభ్యర్థి మృతి చెందండంతో ఎన్నికలు వాయిదా వేశామన్నారు. ఫార్సుగా జరిగిన ఈ ఎన్నికలను రద్దు చేసి స్వతంత్రంగా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్‌యూఎఫ్ ఎన్నికల కమిషన్‌ను డిమాండు చేసింది. ఎన్‌యూఎఫ్ చీఫ్, ప్రముఖ లాయర్ కమల్ హోస్సేన్ మాట్లాడుతూ ఎన్నికలు పార్సులా జరిగాయని, అధికారపార్టీ దేశంలోని అన్ని ప్రాంతాల్లో అనేక అవకతవకలకు పాల్పడిందని విమర్శించారు. ఈ ఎన్నికలను తక్షణమే ఈసీ రద్దు చేసి, సరైన పద్ధతిలో మళ్లీ నిర్వహించాలని డిమాండు చేశారు. మాజీ ప్రధాని ఖలీదా జియా జైలు పాలవడంతో ఆమె స్థానంలో బాధ్యతలను చేపట్టిన బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ ఇస్లాం అలాంగిర్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు క్రూరత్వానికి చిహ్నమన్నారు. ఎన్నికలు స్వతంత్రంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలన్నారు. అన్ని బూత్‌ల్లోనూ అక్రమాలు జరిగాయని విమర్శిస్తూ, అందుకే బీఎన్‌పీ ఎన్నికలకు దూరంగా ఉందన్నారు. బీఎన్‌పీ, గానో ఫోరం, జతియా సమజ్తాంత్రిక దళ్ జెఎస్‌డీ , నగోరిక ఐక్య, క్రిషక్ శ్రామిక జనతా లీగ్ కలసి ఎన్‌యూఎఫ్‌గా ఏర్పడ్డాయి.

12 ఏళ్లుగా బీఎన్‌పీ అధికారానికి దూరంగా ఉంది. షేక్ హసీనా వరుసగా మూడో సారి ప్రధాని పదవిని చేపట్టనున్నారు. బంగ్లాదేశ్ చరిత్రలో 11వ పార్లమెంటరీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, స్వతంత్రంగా జరిగాయని ఈసీ ప్రధాన కార్యదర్శి అహ్మద్ మీడియాకు తెలిపారు. అఖండ విజయం సాధించిన అవామీ లీగ్‌కు ఆయన అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా వందలాది ఫిర్యాదుల అందాయని, అనేక చోట్ల హింసాత్మక సంఘటనలు జరిగాయన్నారు.

భద్రతాదళాలకు చెందిన వ్యక్తితోసహా మొత్తం 18 మంది ఈ ఘటనల్లో మృతి చెందగా, మరో 200 మందికి గాయాలయ్యాయన్నారు. అధికారపార్టీకి చెందినవారే ఎక్కువ మంది మృతి చెందారని బీఎన్‌పీకి చెందిన వ్యక్తులు కూడా ఉన్నారన్నారు. 300 పార్లమెంటు స్థానాల్లో 299 నియోజక వర్గాలకు ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలవరకు పోలింగ్ జరిగింది. గోపాల్‌గంజ్‌లో పోటీచేసిన హసీనాకు 2,29,539 ఓట్లు లభించగా ప్రతిపక్ష బీఎన్‌పీ అభ్యర్థికి కేవలం 123 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆరు లక్షల మంది భద్రతాదళాలు, వేలాది సైనికులు, పారా మిలటరీ, సరిహద్దు రక్షణ దళాలు ఈ ఎన్నికల్లో విధులు నిర్వహించాయి. 10.41 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

టీఎన్‌ఏ మద్దతు ఒప్పుకోబోం : రాజపక్సే



కొలంబో : శ్రీలంక ప్రధాని విక్రంసింఘే ప్రభుత్వానికి తమిళ జాతీయ కూటమి (టీఎన్‌ఏ) మద్దతు ఇవ్వడానికి ఒప్పుకోబోమని మాజీ అధ్యక్షుడు రాజపక్సే స్పష్టం చేశారు. ముప్పై ఏళ్ల సుదీర్ఘ పౌరయుద్ధం తర్వాత దేశంలో శాంతిసుహృద్భావాలు వెల్లివిరిశాయని దేశాన్ని విచ్ఛిన్నం కానీబోమన్నారు. దేశంలోని ఉత్తర ప్రాంతం అయిన నొచ్చియగామ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పై విధంగా తెలిపారు. యుద్ధం ద్వారా తమిళులు సాధించలేదనిది రాజ్యాంగం ద్వారా పొందటానికి ఒప్పుకోబోమన్నారు. 50 రోజుల రాజ్యాంగ సంక్షోభం తర్వాత విక్రంసింఘే టీఎన్‌ఏ మద్దతు స్వీకరించి, కొత్త రాజ్యాంగాన్ని అమలు చేస్తారన్న ఉద్దేశ్యంలో రాజపక్సే ముందుగానే ఈ విషయాన్ని ప్రస్తావించారు. దేశ విభజనను ఒప్పుకోబోమని, దేశ సమగ్రతను కాపాడాలన్నారు. దేశాధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన అక్టోబరు 26న విక్రంసింఘేను ప్రధానిగా తొలగించి ఆయన స్థానంలో రాజపక్సేను నియమించి పార్లమెంటును రద్దు చేయడంతో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడింది. అయితే రాజపక్సేకు మెజారిటీ లభించలేదు. పార్లమెంటును రద్దు చేయడంపై ఏడుగురు సభ్యులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం సిరిసేన, రాజపక్సేను తీవ్రంగా తప్పుబట్టింది. దీంతో విక్రంసింఘే మళ్లీ ప్రధానిగా నియమితులయ్యారు. దేశంలో 74 శాతం సింహళీయులు ఉండగా, తమిళ మైనార్టీలకు శ్రీలంకలో ప్రత్యేక దేశం ఉండాలన్న ఎల్‌టీటీఈతో 30 ఏళ్లపాటు అంతర్యుద్ధం జరిగింది. 2015లో సిరిసేన విజయంలో టీఎన్‌ఏ పాలు పంచుకుంది. దీంతో తమిళ మైనార్టీలకు ఉత్తర, తూర్పు ప్రాంతాలను రాజకీయ స్వేచ్ఛను ప్రసాదించడానికి కొత్త రాజ్యాంగం ఒప్పుకుంది. సింహళీలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో కూడా రాజపక్సే వ్యతిరేక పక్షం శ్రీలంక పొదుజన పెరమున (ఎస్‌ఎల్‌పీపీ) స్థానిక ఎన్నికల్లో విజయం సాధించింది. తమిళమెజారిటీ ప్రాంతాల్లో అధికార సంక్రమణం, స్వతంత్రత ఉండాలని టీఎన్‌ఏ కోరుతోంది. ఎల్‌టీటీఈ- శ్రీలంక ప్రభుత్వానికి మధ్య రాజపక్సే హయాంలో జరిగిన పౌర యుద్ధంలో లక్షమంది ప్రాణాలు కోల్పోయారు.

ఫ్రాన్స్‌లో ఉద్యమకారులపై బాష్పవాయువు ప్రయోగం

పారిస్: ఫ్రాన్స్‌లో ప్రభుత్వ విధానాలకు నిరసనగా జరుగుతున్న ఎల్లో జాకెట్ ఉద్యమం మరింత పుంజుకుంది. క్రిస్మస్, నూతనసంవత్సరం వేడుకల సందర్భంగా శెలవులు ప్రకటించినప్పటికీ ఫ్రాన్స్‌లో అమలుచేస్తున్న సామాజిక, ఆర్థిక సంస్కరణలకు, ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా చాంప్స్‌ఎలిసీస్ వద్ద వేలాది మంది ప్రజలు గుమిగూడి తమ నిరసనను ప్రకటించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ రాజీనామా చేయాలని పెద్దఎత్తున నినదించారు. వేలాదిమంది ఎల్లో జాకెట్లను ధరించి నినదించడంతో పోలీసులు ప్రదర్శనకారులపై భాష్పవాయువు ప్రయోగించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ టెలివిజన్ కార్యాలాయలు, ఛానెళ్లు, దినపత్రికల కార్యాలయం బైట ఫేక్ న్యూస్‌కు వ్యతిరకేంగా నినదించడంతో ఆ ప్రాంతమంతా గందరగోల పరిస్థితి నెలకొంది. దక్షిణప్రాంతంలోని మార్సెల్లి, బోర్డియాక్స్, మధ్య కూడలిప్రాంతమైన లియన్ కూడళ్లలో ప్రజలు తమ ప్రదర్శనలను ఉప్పెత్తునకొనసాగించినట్లు ఫ్రాన్స్ మీడియా విలేకరులు వెల్లడించారు. ఈ నెల 31ను ప్రకటించవలసిన విధివిధానాల ఒడంబడికలను ప్రారంభించవలసిందిగా డిమాండ్ చేసారు. నూతన సంవత్సర వేడుకలు కొనసాగించడంతోపాటు తమ ఉద్యమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేదిలేదని తమ డిమాండ్లు అమలుపరచేవరకు విశ్రమించేదిలేదని ప్రదర్శనకారులు ముక్తకంఠంతో వెల్లడించారు. నిత్యావసరాలు, ప్రధానఅవసరాలపై సుంకాల్ని తగ్గించాలని వీరి ప్రధాన డిమాండ్‌గా ఉంది. రాష్ట్రాలకు తగిన వనరులుసమకూర్చాలని, పౌరులు ప్రాతినిధ్యాన్ని పెంచాలని స్థానిక టివి ఇంటర్వ్యూలో పలువురు వెల్లడించారు. నవంబరు 17న ప్రారంభమైన ఎల్లో జాకెట్ల ఉద్యమం మరింత ఊపందుకుంది. ప్రధానంగా పెరుగుతున్న ఇంధన ధరలకు వ్యతిరేకంగా 2,,82వేలమందితో ప్రారంభమైన ఈ ఉద్యమం ఇతర డిమాండ్లతోపాటు మరింత పుంజుకుంది. పర్యవసానంగా, మేక్రాన్ ప్రభుత్వం కనీస వేతనాల్ని 100యూరోస్‌కు పెంచినట్లు ప్రకటించడమైంది. రెండువేల యూరోల లోపు ఉన్న పెన్షన్లను పెంచడంతోపాటు పన్నుల మినహాయింపు, ఓవర్‌టైమ్ పేమెంట్స్ చెల్లింపులు, ఏడాదిచివరన జీతాలతోపటు వాలెంటరీగా మరింత పెంచుతున్నట్లు ప్రకటించడమైంది. ఈ నెల 22న ఉద్యమం మరింతం ఉధృతమైంది.

చైనా తేలికపాటి యుద్ధ ట్యాంకులు



బీజింగ్ : టిబెట్ వంటి పర్వత ప్రాంతాల్లో ఉపయోగించేందుకు తేలికపాటి యుద్ధట్యాంకులను చైనా రూపొందించింది. ఎత్తైన ప్రాంతాల్లో జరిగే యుద్ధం కోసం టైప్ 15ను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రూపొందించింది. ఈ యుద్ధ ట్యాంకులను చైనా 40వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ మ్యూజియంలో ప్రదర్శించారు. యుద్ధ ట్యాంకులను మిలటరీకి అప్పగించామని చైనా మిలటరీ అధికార ప్రతినిధి కల్నల్ వు క్వియాన్ మీడియాకు స్పష్టం చేశారు. దేశవాళీయంగా రూపొందించిన యుద్ధ ట్యాంకు టిబెట్ ప్రాంతంలో యుద్ధానికి సన్నద్ధంగా డొక్లాం ప్రాంతానికి తరలించామన్నారు. భారత ఈశాన్య ప్రాంతంలోని సిక్కిం వద్ద డొక్లాంలో జూన్‌లో 73 రోజులపాటు ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ తేలికపాటి యుద్ధ ట్యాంకుల్లో హైడ్రోన్యూమాటిక్ సస్పెన్షన్ వ్యవస్థ ఉండటంతో పర్వతాలపైకి చేర్చడం సులవని చైనా అధికారులు చెబుతున్నారు. టైప్ 14 యుద్ధట్యాంకుకు 1000 హార్స్‌పవర్ శక్తిగల ఇంజన్‌ను అమర్చడంతో వీటి బరువు 32 నుంచి 35 టన్నులు మాత్రమేనని, టైప్ 99 ట్యాంకులు 54 నుంచి 58 టన్నుల బరువు ఉంటాయన్నారు. చైనా - భారత్ సరిహద్దుల్లోని సున్నిశిత ప్రాంతమైన టిబెట్‌లో వీటిని చేర్చడం సులువుగా ఉంటుందని మిలటరీ విశ్లేషకుడు ఒకరు తెలిపారు. పీఎల్ఏ మెరైన్ పోలీసులు కొన్ని కీలక యుద్ధ పరికరాలను మరింత సౌకర్యవంతంగా పునరుద్ధరించారని బీజింగ్‌లోని మిలటరీ వ్యవహారాల ప్రతినిధి వెల్లడించారు. ప్రస్తుతం టైపు 62 ట్యాంకును ఉపయోగిస్తున్నారని దానికి 500 హార్స్‌పవర్ శక్తి మాత్రమే ఉందన్నారు. దీనికంటే టైప్ 15 ట్యాంక్ మరింత శక్తివంతమైనదని ఆయన వివరించారు.

నీతులా...!

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించారు. అంతవరకే..ఆ చర్యను మాత్రం ఆయన ఖండించలేదు. దీనికిబదులు పరోక్షంగా ప్రోత్సహించినట్లు మాట్లాడారు. ఎవరూ ఇలాంటివి చేయకూడదు అంటూనే...ఇక్కడతను ఓ లక్ష్యంతో ఈ వార్తను సష్టించారని సమర్థించారు. 'ఇది చేయదగ్గ పనే. అయినా చేయకూడదు. మంచైనా, చెడైనా, నిజమైనా, అబద్ధమైనా... ఎలాంటి వార్తలనైనా ప్రజల్లోకి తీసుకెళ్లే సామర్థ్యం మనకు ఉంది. మన వాట్సాప్ గ్రూపుల్లో 32 లక్షల మంది ఉండటం వల్లనే ఇదంతా సాధ్యమైంది. అందుకే ఈ వార్త కూడా వైరల్ అయింది' అని అమిత్ షా చెప్పుకొచ్చారు. నకిలీ వార్తలను సృష్టించడం, ప్రచారం చేయడమే కాకుండా బీజేపీ నాయకులు ప్రతికూల వ్యాఖ్యలు చేసినప్పుడు కూడా అమిత్ షాగానీ, మోడీగానీ ఏనాడు ఖండించలేదు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మత హింసాకాండ జరుగుతోందంటూ '2002, గుజరాత్ అల్లర్ల'కు సంబంధించిన ఫొటోలను. నడిరోడ్డుపై ఓ మహిళను వివస్త్రను చేస్తున్న ముస్లింలు' అంటూ ఓ మరాఠీ సినిమా షూటింగ్ పోస్టర్‌తో బీజేపీ మీడియా సెల్ అధిపతి అమిత్ మాలవియా నకిలీ వార్తలు ప్రసారం చేసినా మోడీ, షా ఖండించలేదు. ఆయన ఇప్పటికీ అదే పదవిలో కొనసాగుతున్నారు. మూక హత్యలకు పాల్పడిన వారు జైలు నుంచి బెయిల్‌పై విడుదలయితే బీజేపీ నాయకులు ఎదురెళ్లి స్వాగతం చెప్పడం, అతిథి మర్యాదలతో సత్కరించారు. దీనిని అపలేదు. యూపీలోని బులంద్‌షహర్‌లో ఆవులను చంపారనడాన్ని తీవ్రంగా ఖండించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ ప్రచారంతో అనంతరం జరిగిన హింసాకాండలో బజరంగ్ దళ్ నాయకుడు ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్‌ను కాల్చి చంపడాన్ని ఓ యాక్సిడెంట్‌గా అభివర్ణించడం దారుణం. ఆ పోలీసు ఇన్‌స్పెక్టరే తనకు తాను కాల్చుకున్నాడని స్థానిక బీజేపీ నాయకులు చెప్పుకొస్తున్నారు. మనిషి ప్రాణంకన్నా ఓ ఆవు ప్రాణం ముఖ్యమైందన్న బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షాను టెర్రరిస్టు అనడం, కాల్చివేయాలనడం ప్రతికూల ప్రచారం కాదా? అంతెందుకు విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌కు వ్యతిరేకంగా నెటిజన్లు విరుచుకుపడుతున్నా ఈ నాయకులు మౌనమే పాటించారు.

ఉల్లాసం.. ఉద్విగ్నం...

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులు అమరావతికి తరలివెళ్లారు. సాయంత్రం ఏపీకి చేరుకోనున్న న్యాయమూర్తులకు విజయవాడలోని ఓ హోటల్లో బస ఏర్పాట్లు చేశారు. ఏపీలో హైకోర్టు కార్యకలాపాల నిర్వహణకూ సర్వం సిద్ధమైంది. ఇప్పటికే హైకోర్టు కార్యకలాపాలకు జడ్జీలు, అధికారుల వసతికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జనవరి 1న హైకోర్టు చీఫ్ జస్టిస్, ఇతర జడ్జీల ప్రమాణ స్వీకారానికి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. హైకోర్టు కార్యాలయం కోసం ఎంజీ రోడ్డులోని ఏపీఏటీ భవనంలో 10,000 చదరపు అడుగులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఇందిరాగాంధీ స్టేడియంలో గవర్నర్ నరసింహన్ ఏపీ హైకోర్టు న్యాయమూర్తులతో ప్రమాణం చేయించనున్నారు. అంతకుముందే, ఉదయం 8.30 గంటలకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులతో గవర్నర్ హైదరాబాద్‌లో ప్రమాణం చేయిస్తారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు హైకోర్టు విభజనను నిలిపివేయాలంటూ ఏపీ న్యాయవాదులు దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారానికి లైన్ క్లియరైంది.



జాబుల జాతర

(మొదటిపేజీ తరువాయి)

పోస్టులు, ఆ తర్వాత పాలిటెక్నికల్ కళాశాల లెక్చరర్లు-405, డిగ్రీ కళాశాల లెక్చరర్లు-308ఉన్నాయి. పోస్టుల కోసం వరుసవారీగా దరఖాస్తుల ప్రక్రియ, ఫీజు చెల్లింపు, పరీక్షల షెడ్యూలను విడుదల చేశారు.

గ్రూప్-2 పోస్టుల వివరాలు:

ఏపీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-2 విభాగంలో మొత్తం 446 పోస్టులున్నాయి. ఇందులో నాన్ ఎగ్జిక్యూటివ్-292, ఎగ్జిక్యూటివ్-154 ఖాళీలకు నోటి ఈ పోస్టులన్నీ పాత పద్ధతిలోనే స్క్రీనింగ్(ప్రిలిమినరీ) టెస్ట్, మెయిన్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సాధారణ పరిపాలన శాఖ-150ఏఎస్‌వో, సీనియర్ అకౌంటెంట్లు-20, ఎక్సైజ్‌శాఖ ఎస్‌ఐలు-50, పంచాయతీరాజ్‌శాఖ-40 ఎక్స్‌టెన్షన్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు-16, ఖజానాశాఖలో సీనియర్ అకౌంటెంట్లు-13 ఉన్నాయి.

గ్రూప్-2లోని అన్ని విభాగాల పోస్టులకు(యూనిఫామ్ మినహా) వయోపరిమితి 42ఏళ్లలోపు వరకూ అవకాశం కల్పించారు. రిజర్వేషన్, పీహెచ్‌సీ అభ్యర్థులకు యథాతథంగా వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. మే5న గ్రూప్-2 ప్రాథమిక పరీక్ష, జూలై 18, 19 తేదీల్లో గ్రూప్-2 మెయిన్ పరీక్షలు నిర్వహిస్తామని చైర్మన్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఇటీవల ఇంటర్మీడియట్ విద్యలో-237 జూనియర్ లెక్చరర్ల(జేఎల్), అగ్రికల్చరల్ ఆఫీసర్ల(ఏవో)-37లకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఏపీ వర్క్స్ అండ్ అకౌంట్స్ సర్వీసులో గ్రేడ్-2 డివిజనల్ అకౌంట్ ఆఫీసర్లు-22, ఏపీ సచివాలయంలో తెలుగు అసిస్టెంట్ ట్రాన్స్‌లేటర్లు-2, బిఅండ్ పీఆర్‌లో ఏపీఆర్‌వోలు-15 ఖాళీల భర్తీ ప్రక్రియకు ఏపీపీఎస్సీ షెడ్యూలు విడుదల చేసింది.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఎండోమెంట్, రవాణాశాఖ తదితర విభాగాల్లోనూ ఖాళీల భర్తీ ప్రక్రియకు ఏపీపీఎస్సీ శ్రీకారం చుట్టింది. గతంలో 2016లో ఏపీపీఎస్సీ నుంచి పలు విభాగాలకు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ఏడాది నుంచి గ్రూప్-1,2 నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్నారు. కొత్తగా విడుదల చేసిన నోటిఫికేషన్లతో అభ్యర్థులు ఊరట చెందుతున్నారు.

నంబరు	పోస్టుల వివరాలు	పోస్టులు	దరఖాస్తుల తేదీ
1	పాలిటెక్నిక్ లెక్చరర్లు	405	6-2-2019 నుంచి 27-2-2019
2.	ఫిషరీస్ డెవలప్‌మెంటు ఆఫీసర్లు	43	17-1-2019 నుంచి 8-2-2019
3.	గ్రూప్-2 సర్వీసెస్	446	10-1-2019 నుంచి 31-1-2019
4.	డిగ్రీ కళాశాలల లెక్చరర్లు	308	5-2-2019 నుంచి 26-2-2019
5.	గ్రూప్-1 సర్వీసెస్	169	7-1-2019 నుంచి 28-1-2019
6.	అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు-ఫిషరీస్	10	18-1-2019 నుంచి 8-2-2019
7.	డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు	05	22-1-2019 నుంచి 12-2-2019

మళ్లీ అవకాశమివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. నాలుగున్నరేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని, ఐదుకోట్ల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఫలితాలను వివరిస్తూ జనవరి 2వ తేదీ నుంచి 6వ విడత 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు రానున్నామని, తమను మరోసారి ఆశీర్వదించాలని చంద్రబాబు కోరారు. పాలనా విజయాలను వివరించే తొమ్మిది శ్వేతపత్రాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మంగళవారం పదో శ్వేతపత్రాన్ని విడుదల చేస్తామని అన్నారు. తనపై విశ్వాసంతో రాజధాని నిర్మాణానికి సమీకరణ కింద రైతులు 33 వేల ఎకరాల భూములిచ్చారని గుర్తుచేసుకున్న ముఖ్యమంత్రి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన రాజధాని నిర్మాణం జరుగుతోందని, ర్యాప్ట్ తరహా ఫౌండేషన్‌తో నూతన సచివాలయానికి ఐదు శిఖర భవనాల నిర్మాణం ప్రారంభించినట్లు చెప్పారు. పోలవరం పనులు 63.57%కు పైగా పూర్తయినట్లు వెల్లడించారు. కేంద్రం కక్షతో నిధులు నిలిపివేసినా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనులు కొనసాగిస్తున్నామన్నారు. కేంద్ర సహకారం లేకున్నా రూ.24వేల500 కోట్ల రుణమాఫీ చేశామని, సంక్షేమానికి రూ.80 వేల కోట్లకు పైగా వెచ్చించామన్నారు. సామాజిక భద్రత కింద 50,50,762 మందికి పెన్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టి నాలుగేళ్లుగా రూ.80 కోట్లకు పైగా ఖర్చు చేశామని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రాన్ని నెంబర్-1గా నిలిపామన్నారు. తిరుపతిలో వెంకన్న సాక్షిగా ఇచ్చిన ప్రత్యేకహోదా, రాజధానికి నిధుల హామీలను మోడీ తుంగలో తొక్కారని, ఆంధ్రప్రదేశ్ ప్రజలను వంచించారని, అందుకే ధర్మపోరాటం చేపట్టామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర పురోభివృద్ధికి, బిడ్డల భవిష్యత్తుకు, రాజధాని నిర్మాణం శరవేగంగా కొనసాగించాలన్నా, పరిశ్రమలు రావాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నా రాజకీయ సుస్థిరత ఎంతో అవసరమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో దుష్టశక్తులను ఓడిస్తామని ప్రజలు సంకల్పించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధిని కొనసాగించేలా తమకు మళ్లీ అవకాశం ఇవ్వాలని చంద్రబాబు కోరారు.

తీపి కబురు

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబర్చి జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సొంతం చేసుకున్న ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని భావిస్తోంది. దీనిలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఉద్యోగ విరమణ నాటికి మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండే వారి సేవలను మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలుల్లోకి వస్తాయని ఆ ప్రకటనలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధిత్యనాథ్ దాస్ తెలిపారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబుకు పీసీసీచీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం చంద్రబాబుకు ఆయన బహిరంగ లేఖ రాశారు. కొంతకాలంగా సహకారరంగ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి కోర్కెలు తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

గళమెత్తుదాం

(మొదటిపేజీ తరువాయి)

నిరసనలు తెలిపేందుకు వస్తున్నాయని చెప్పారు. విజయవాడ నగరంలో సీఎం చంద్రబాబు క్యాంప్ కార్యాలయం ఏర్పాటుచేశాక..అధికంగా పోలీసుల ఆంక్షలు పెరిగాయని పేర్కొన్నారు. సీఎం క్యాంప్ కార్యాలయాన్ని వామపక్ష, కార్మిక సంఘాల నేతృత్వాన ముట్టడించామని గుర్తుచేశారు. ఉద్యమకారులకు అనుమతులిచ్చే సమయంలో పోలీసులు హడావుడి చేస్తున్నారని తెలిపారు. శాంతిభద్రతల పేరుతో పోలీసుల ఆంక్షలు మితిమీరుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యమాల్లో ఉన్న మాజీ ప్రజాప్రతినిధులకు కనీస గౌరవాన్ని పోలీసులు ఇవ్వకుండా, వ్యాన్లలో వారిని బలవంతంగా నెట్టి పడేస్తున్నారని దుయ్యబట్టారు. తాడిపత్రిలో ఒక సీఐపై దాడిచేసి, పోలీసుల వాహనాలను కాల్చిన సంఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు సిగ్గుపడాలని సూచించారు. పోలీసులకే రక్షణ లేకుంటే ప్రభుత్వం ఎక్కడుందని ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ అసోసియేషన్ నేతలు దీక్షల సమయంలోనూ పోలీసులు అత్యుత్సాహం చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందర్నీ ఒక టెర్రరిస్టుల తరహాగా పోలీసులు చూపి, కరెంటు నిలుపుదలచేసి దీక్షా భగ్నానికి ప్రయత్నించడం దారుణమని అన్నారు. సీఎం చంద్రబాబు ఉన్న ప్రజాస్వామ్యాన్నే పరిరక్షించలేకపోతున్నారని, నిరసన తెలియజేసే హక్కులను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని ప్రతిపక్ష కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలన్నీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరముందని చెప్పారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు బహిరంగ సమావేశాలు, నిరసనలు పెట్టుకునేందుకుగాను ప్రభుత్వం రకరకాల సాకులు చూపిస్తోందన్నారు. సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని సైతం పోలీసులతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని వెల్లడికాకుండా సర్కారు అణగదొక్కుతోందన్నారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తి సైతం ఉద్యమాలు, నిరసనల రూపంలో వెల్లడవుతోందని, దాన్ని ప్రభుత్వం పతనం చేస్తోందని మండిపడ్డారు. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే బీజేపీకి వ్యతిరేకంగా దళితులు నిలిచారని స్పష్టంచేశారు. దీనికి కారణంగా దళిత ఉద్యమాల్లో ఆయా రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా కొనసాగాయని వివరించారు. ఉద్యమాలు కొనసాగితే ప్రజల నుంచి ప్రభుత్వాలు ఏర్పడతాయనే భావన పాలకుల్లో నెలకొందన్నారు. 2019లో బీజేపీకి వ్యతిరేకంగా దళితులు ఓట్లు వేస్తారనేదీ బీజేపీ అంతర్గత సమావేశంలో వెల్లడైందని చెప్పారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కార్మికుల ఉద్యమాల అనుమతులపై పోలీసుశాఖకు కాలయాపన చేస్తూ, చివరి నిమిషంలో వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యమాలను అణచివేసే చర్యలకు, ఉద్యమకారులను నిర్బంధించేందుకుగాను ఈ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం తప్పిదాలను కప్పిపుచ్చుకుంటోందన్నారు. ఇటీవల అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమంతోపాటు పలు సంఘాల నేతలు ఉద్యమాలకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారని ధ్వజమెత్తారు. అధికారపక్షం నేతలు ఆందోళనలు చేసుకోవచ్చని, ఎక్కడ చూసినా వారి ఫ్లక్సీలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యమాలను అణచివేసే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మనమంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని సూచించారు.

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పీడబ్ల్యూడీ గ్రౌండ్(స్వరాజ్య మైదానం) పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని సూచించారు. ప్రజాసంఘాలు సమావేశాలు నిర్వహించుకునే అనువుగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అద్దె ధరలు నిర్ణయించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. జనసేన పార్టీ నాయకుడు పోతిన వెంకట మహేష్ మాట్లాడుతూ పౌరహక్కులను కాలరాస్తోన్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. వైసీపీ రాష్ట్ర నాయకుడు పి.గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంఘాల నేతలపై టీడీపీ ప్రభుత్వం వివక్షత చూపుతోందని విమర్శించారు. సీఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలీసుల నిరంకుశ చర్యల్ని అన్ని కార్మిక, ప్రజాసంఘాలు ఖండించాలని కోరారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని మాట్లాడుతూ వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న మహిళలపై పోలీసులు దురుసుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఈ రౌండుటేబుల్ సమావేశంలో సీపీఐ(ఎంఎల్)-లిబరేషన్ రాష్ట్ర నాయకుడు హరినాథ్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ పౌరహక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు సిహెచ్.బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ప్రసాద్‌రావు, ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర నాయకుడు విద్యాసాగర్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ శ్రామిక మహిళా ఫోరమ్ రాష్ట్ర నాయకురాలు జె.లలిత, సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ మహిళా నాయకురాలు కె.స్వరూపరాణి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, వివిధ కార్మిక, ప్రజాసంఘాల నేతలు కృష్ణయ్య, మల్లారెడ్డి, సుధీర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డీఎస్సీ-2018 పరీక్షల్లో
ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించాల్సిందే..

- ఏపీ ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు ధర్మాసనం ఆదేశం
- సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు అభ్యర్థుల సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ డీఎస్సీ-2018 పరీక్షల నిర్వహణలో నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనలను తప్పనిసరిగా ప్రభుత్వం పాటించాల్సిందేనని ఉమ్మడి హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టులో డీఎస్సీ పరీక్షల సిలబస్, ఇతరత్రా అంశాలపై రాష్ట్రా నికి చెందిన పలువురు అభ్యర్థులు వేసిన పిటిషన్‌పై మంగళవారం వాదోపవాదనలు కొనసాగాయి. డీఎస్సీ పరీక్షలను ఎన్‌సీఈటీ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారంటూ డిసెంబరు 12వ తేదీన ఏపీ ప్రభుత్వ ట్రిబ్యునల్‌లో కొందరు డీఎస్సీ అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేశారు. 13వ తేదీన ట్రిబ్యునల్‌లో వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి కేసును 20వ తేదీకి వాయిదా వేశారు. 20వ తేదీన డీఎస్సీ పరీక్షలపై స్టే ఇవ్వాలని అభ్యర్థుల తరఫున న్యాయవాది కోర్టులో గట్టిగా వాదించగా, దానికి న్యాయమూర్తి నిరాకరించారు. దీంతో అభ్యర్థులు ఈ నెల 24వ తేదీన హైకోర్టులో కేసు ఫైల్ చేయగా, అక్కడ 26న విచారణకు వచ్చింది. 27వ తేదీన హైకోర్టులో జరిగిన వాదోపవాదనలపై తగిన ఆధారాలు సమర్పించేందుకుగాను రెండు రోజుల సమ యం కావాలని ప్రభుత్వ తరఫున న్యాయవాది హైకో ర్టును కోరగా, కేసును 31కు వాయిదా వేశారు. ఉమ్మడి హైకోర్టు విభజన కారణంగా సోమవారం ఈ కేసుపై రెండు గంటలపాటే విచారణ కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ పరీక్షల నిర్వహణలో తప్ప నిసరిగా ఎన్‌సిటిఈ నిబంధనలను పాటించాలని ఆదేశించింది. పరీక్షల నోటిఫికేషన్ నిలుపుదలకు స్టే ఇవ్వలేదు. దీంతో అభ్యర్థులంతా సుప్రీంకోర్టును ఆశ్ర యించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆర్థిక పరిస్థి తులపై వారంతా తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.

అతివేగానికి నలుగురి బలి

- ముగ్గురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- స్పీడు @ 165 కిలోమీటర్లు
- మృతులంతా ఇంజినీరింగ్ విద్యార్థులే
- గుంటూరు జిల్లాలో దారుణం



ఘటనాస్థలిలో ప్రమాదానికి గురైన కారు



ప్రమాదంలో మృతిచెందిన యువకుడు

విశాలాంధ్ర-గుంటూరు క్రైం: అతివేగం నలుగురు విద్యార్థుల ప్రాణాలను బలిగొన్నది. గుంటూరు లాల్‌పురం వద్ద గుంటూరు-చిలకలూరిపేట రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 165 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఓ కారు డివైడర్‌ను బలంగా ఢీకొని...అదే వేగంతో గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. కారు ఢీకొట్టిన వేగానికి లారీ సైతం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురు విద్యార్థులు దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాలన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిఉన్నాయి. వీరిలో ఆరుగురు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండగా మరొకరు రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఒకే కారులో వీరు నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా విజయవాడ వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ప్రమాద సమయంలో కారు 165 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతులను గుంటూరు కోటేశ్వరరావు, సాదినేని ధనుష్ చౌదరి, చిరుమామిళ్ల సాయిరాం, షేక్ గఫూర్, బత్తుల కౌశిక్, ఆళ్ల శివాజీ, ఆలోకం తారక్ హీరేంద్రగా గుర్తించారు. ఉదయం 11 గంటలకు విరామ సమయంలో కాలేజీ నుంచి వారు బయటికి వచ్చారు. విజయవాడ వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారు ఢీకొన్న ధాటికి లారీ బోల్తా పడిందంటే కారు ఎంత వేగంగా వెళుతున్నదో అర్థమవుతున్నది. ఒంగోలుకు చెందిన కౌశిక్ తన బంధువైన గుంటూరులోని వైద్యునికి చెందిన కారును కళాశాలకు తెచ్చినట్లు సమాచారం. కారును నడుపుతున్న కౌశిక్‌కు ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు. మృతులంతా 20 ఏళ్లలోపు యువకులే. అలోకం తారక్ హీరేంద్ర తీవ్రంగా గాయపడటంతో అతనిని మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కౌశిక్, ఆళ్ల శివాజీలకు స్వల్పగాయాలయ్యాయి. వీరిలో ఐదుగురు హాస్టల్ విద్యార్థులు కాగా, ఇద్దరు డే స్కాలర్లు. బోల్తా పడిన లారీ డ్రైవరుకు, క్లీనర్లు కూడా గాయపడ్డారు. ఘటనాస్థలం వద్ద మృతుల తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. సమాచారం తెలిసిన వెంటనే గుంటూరు అర్బన్ జిల్లా ఎస్పీ సీహెచ్ విజయారావు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కౌశిక్, శివాజీలను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. దక్షిణ మండలం డీఎస్పీ కేవీపీఎస్ మూర్తి మార్చురీ చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. నల్లపాడు సీఐ బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు

వేతన సవరణ సమస్య పరిష్కరించాలి

- లేదంటే ఈనెల 13 తర్వాత సమ్మె
- ఆర్టీసీ ఈయూ నేతలు హెచ్చరిక



ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబుకు సమ్మె నోటీసు ఇస్తున్న ఈయూ నేతలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వేతనాల సవరణ సమస్య తక్షణమే పరిష్కరించాలనీ, లేదంటే ఈనెల 13వతేదీ తర్వాత నుంచి సమ్మెకు వెళతామని ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు వైవీ రావు, రాష్ట్రప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావులు హెచ్చరించారు. విజయవాడలో సమ్మె నోటీసును ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య, ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబులకు సోమవారం వారు అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వైవీ రావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒక సారి జరగాల్సిన వేతన సవరణ గత రెండేళ్లగా జరగడంలేదన్నారు. ఈ వేతనాల సవరణ ఒప్పందం గతంలో జరగాల్సి ఉండగా ఆర్టీసీ యాజమాన్యం నష్టాలను సాకుగా చూపించి 19శాతం ఐఆర్‌తో సరిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికే వేతనాల సవరణ గడువుదాటి పదిహేడు నెలలు అయ్యిందన్నారు. తదుపరి గుర్తింపులోకి వచ్చిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గత ఆగస్టులో గెలిచిన దగ్గర నుంచి ఐదుపర్యాయాలు చర్చలు జరిపినప్పటికీ హామీలు అమలు కాలేదన్నారు. ఈనేపథ్యంలోనే సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్య పరిష్కరించకపోతే సమ్మె నోటీసు ఇచ్చిన 14రోజుల తర్వాత 41రోజులలోపు సమ్మె చేసుకునే అధికారం చట్టప్రకారం ఉందన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈయూ చేస్తున్న పోరాటానికి ఆర్టీసీలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు మద్దతు పలికాయన్నారు. ఎన్ఎంయూ ఒక్కటే ఈనెల 3వతేదీన జరిగే రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని పేర్కొందన్నారు. రాష్ట్రప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఈనెల 4వతేదీన ఈయూ రాష్ట్రకార్యాలయంలో ఆర్టీసీలో ఉన్న అన్ని కార్మిక సంఘాలతో చర్చించి జేఏసీను ఏర్పాటు చేసి సమ్మె సన్నాహక కార్యక్రమాలను రూపొందిస్తామని వెల్లడించారు. ఏప్రిల్ ఒకటోతేదీ 2017 నుంచి చేయాల్సిన వేతన సవరణను యాభైశాతం ఫిట్‌మెంట్‌తో నిజవేతనాలు ఇవ్వాలన్నారు. అలాగే ప్రతిపాదించిన సర్వీసు కండీషన్లు, అలవెన్సులు వందశాతం పెంచాలన్నారు. కారుణ్య నియమాకాల ద్వారా పెండింగ్‌లో ఉన్నవారికి ఉద్యోగాలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను అందరినీ రెగ్యూలర్ చేయాలన్నారు. బలవంతపు వీఆర్ఎస్ పథకాన్ని విరమించుకునీ, సిబ్బంది కుదింపు చర్యలు విడనాడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఆర్టీసీ ఉద్యోగులకు కూడా పదవీవిరమణ వయోపరిమితి 60ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మెరుగైన పింఛన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్రనాయకులు ఎం.హనుమంతరావు, జీవీ నరసయ్య, ఏవీ రామచంద్రరావు, ఎం.శంకర్‌రావు, ఎండీ ప్రసాద్, ఎం.కోటేశ్వరరావు, టీవీ భవాని, ఎస్‌కే సుభాని, పి.రామకృష్ణ, కృష్ణారీజియన్ నాయకులు ఎస్‌హెచ్ఎన్ చక్రవర్తి, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోస్తాంధ్ర గజగజ

- లంబసింగిలో 5 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- 12-15 మధ్యే నమోదు

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో: తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎన్నడులేనంతగా అతి శీతల ప్రభావాన్ని చవి చూస్తున్నారు. పెథాయ్ తుపాను తరువాత ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. ఉత్తరాధితోపాటు వాయువ్య భారత దేశంలోనూ శీతల ప్రభావం ఎక్కువగా ఉంది. హిమచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, జార్ఖండ్, చత్తీష్‌గడ్, ఉత్తఖాండ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో చలి విజృభిస్తుంది. ఆయా రాష్ట్రాల్లో రెండు నుంచి నాలుగు డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విశాఖ ఏజెన్సీలోని లంబసింగిలో 5 డిగ్రీలు కనిష్టం నమోదు కావడంతో చలి చంపేస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో 11 డిగ్రీలు పడిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్, మెదక్ జిల్లాలో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తరాధి నుంచి చలిగాలులు , మరోపక్క ఒడిశాపై ఆవర్తనం తోడవడంతో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. నాలుగు రోజులుగా కోస్తాంధ్రను చలిపులి వణికిస్తుంది. మరో నాలుగైదు రోజులు ఇలాగే కొనసాగుతుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. విశాఖ నగరం చలి గుప్పెట్లో చిక్కుకుంది. విశాఖ జిల్లా లంబసింగిలో 5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయ్యాయి. చింతపల్లిలో 7, మినుమలూరులో 10 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కోస్తాంధ్రలో మైదాన ప్రాంతాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. గుంటూరు జిల్లా జంగ మహేశ్వరం(రెంటచింతల)లో 12 డిగ్రీలు నమోదు కాగా, విశాఖ, అమరావతి, కళింగపట్నం, నందిగామలో 15 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బాపట్లలో 16, తుని, ఆరోగ్యవరంలో 17 డిగ్రీల నమోదు కాగా, కోస్తాంధ్రలో సాధారణం కంటే కనిష్ట ఉష్ణోగ్రతలు 2-5 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 1-2 డిగ్రీల వరకు రికార్డై చలి తీవ్రతను పెంచుతున్నాయి. రాయలసీమలో రాత్రి సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. విశాఖ ఏజెన్సీతోపాటు నగరంలో చలితీవ్రతం ఎక్కువ కనిపిస్తుంది. ప్రజలు సాయంత్రం 4.00 గంటలకే ఇళ్ళకు చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో చలిమంటలు కాగుతున్నారు. తీర ప్రాంతంలో చలి మరింత అధికంగా వుంది. ఆంధ్ర ఊటీగా పేరొందిన విశాఖ మన్యంలో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. అరకు, లంబసింగి, బొర్రాగుహలు, చాపరాయి వంటి ప్రాంతాల్లో చలిలో పర్యాటకులు సందడి చేస్తున్నారు.

కొత్త వత్సర వేడుకలపై నజర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. రాత్రి 10 నుంచే అన్ని ఫ్లైఓవర్లను మూసివేయడంతో పాటు.. ఉదయం 5 గంటల వరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నారు. మద్యం సేవించి వాహనం నడిపేవారిని జైలుకు పంపనున్నారు.

35 శాతం మధ్యంతర భృతి చెల్లించాలి

చంద్రబాబుకు ఏపీ జేఏసీ నేతల విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 35శాతం మధ్యంతర(ఐఆర్) భృతి చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం జేఏసీ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. జేఏసీ చైర్మన్ పి.అశోక్‌బాబు, సెక్రటరీ జనరల్ సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు సారథ్యాన సోమవారం చంద్రబాబుతో చర్చించారు. రెండు పెండింగ్ డీఏలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానించాలని, 653, 655 జీవోలు రద్దు చేయాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని జేఏసీ నేతలకు హామీ ఇచ్చినట్లు అశోక్ బాబు, జోసఫ్ సుధీర్‌బాబు తెలిపారు. కో-చైర్మన్ పి.బాబురెడ్డి, సి.గోపాలకృష్ణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎన్.చంద్రశేఖరరెడ్డి, జి.హృదయరాజు, ఎ.విద్యాసాగర్, సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని విజయాల దిశగా పర్యాటకం

- నూతన సంవత్సరంలో వారం రోజుల పాటు జల ఉత్సవాలు
- కొండపల్లి, కొండవీడు, కోటప్పకొండలలో హిల్ ఫెస్టివల్స్
- అటు బెలూన్ ఫెస్టివల్, ఇటు ఎడ్వంచర్స్ టూర్ ఆపరేటర్స్
- పర్యాటక సాధికార సంస్థ ఎండీ హిమాన్షు శుక్లా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సాధించిన విజయాలతో సంత ృప్తి చెందకుండా నూతన సంవత్సరంలో మరిన్ని పర్యాటక అభివ ృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక సాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. 2019 క్యాలెండర్ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలను అలరించేందుకు మరిన్ని పర్యాటక ఆకర్షణలు సిద్ధం చేస్తున్నామన్నారు. నవంబర్‌లో చేపట్టిన ఎఫ్1హెచ్2ఓ దేశంలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిలవగా ఆ పరంపరను కొనసాగిస్తామని, 2019 నవంబరులో వారంరోజుల పాటు జల ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. ఎఫ్1హెచ్2ఓ తో పాటు, అక్వాబైక్ రేసింగ్, పారా సైలింగ్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 2018 సంవత్సర ముగింపు నేపథ్యంలో 2019లో చేపట్టనున్న కార్యక్రమాల గురించి తనను కలిసిన మీడియా ప్రతినిధులకు సోమవారం వివరించారు. సంక్రాంతి పర్వదినాల తరువాత, 17,18,19 తేదీలలో అరకు వేదికగా, బెలూన్ ఫెస్టివల్‌తో పాటు అడ్వంచర్ టూర్ అపరేటర్స్ జాతీయ సెమినార్ నిర్వహించనున్నామని వివరించారు. స్థానిక పర్యాటక ప్రయోజనాలకు ఊతం ఇస్తూ కొండపల్లి, కొండవీడు, కోటప్పకొండలలో హిల్ ఫెస్టివల్స్ చేపడుతున్నామన్నారు. పర్యాటకుల రాకకు విడిది ప్రధానం కాగా, 2014లో 6000గా ఉన్న హోటల్ రూమ్స్ సంఖ్యను ప్రస్తుతం 11,000కు తీసుకు వెళ్లామని, 2018 ఏప్రిల్ నాటికి మరో 2500 రూమ్‌లు అందుబాటులోకి రానున్నాయని శుక్లా వివరించారు. రాష్ట్రంలో ఐదు నక్షత్రాల హోటళ్ల సంఖ్య ఆరు నుండి 10కి చేరుకుందన్నారు. రూ.5,300 కోట్ల పెట్టుబడులు ఇప్పటికే క్షేత్ర స్థాయికి చేరగా, 25,000 మంది ఉపాధి పొందగలిగారన్నారు. మానవవనరుల అభివ ృద్ధిలో భాగంగా ప్రతిఏటా పదివేల మంది గైడ్లు, క్యాబ్ డ్రైవర్లు, ఛెఫ్‌లకు స్వల్పకాలిక శిక్షణలు అందిస్తున్నామన్నారు. పర్యాటకుల రాక పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మూడవ స్థానంలో ఉండగా, రానున్న మూడు సంవత్సరాల కాలంలో రెండవ స్థానానికి చేరుకోవాలన్న లక్ష్యాన్ని కలిగి ఉన్నామని హిమాన్షు వివరించారు. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 36 అవార్డులు అందుకోగా, సమీకృత పర్యాటక అభివృద్ధికి గాను 2017,2018 సంవత్సరాలలో వరుసగా కేంద్ర ప్రభుత్వం నుండి ఉత్తమ రాష్ట్రంగా అవార్డులు అందుకున్నామన్నారు. రానున్న సంవత్సరంలో ఇప్పటికే మౌళిక వసతులు ఉన్న 15 ప్రాంతాలలో పాటు, వసతులు లేని మరో 10 ప్రాంతాలను కూడా పర్యాటక పరంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నామన్నారు. ఏపీటీడీసీ పరంగా గణనీయమైన ప్రగతిని నమోదు చేస్తున్నామని, 125 కోట్ల అదాయ లక్ష్యంను కలిగి ఉండగా, ఇప్పటికే 120 కోట్లను గడించామని మరో త్రైమాసికం మిగిలి ఉండగా, రూ.132 కోట్లు సాధించగలమన్న ధీమాను వ్యక్తం చేసారు. విజయవాడ భవానీ ద్వీపంలో నీటి సింహాల పార్కును ఏర్పాటు చేయనున్నామన్నారు. జల క్రీడల ద్వారా గణనీయమైన అదాయం గడిస్తున్నామని, దీనికి ఉన్న భవిష్యత్తు రీత్యా పిపిపి విధానంలో మరికొందరితో కలిసి పనిచేయనున్నామన్నారు. ఆంధ్రా ఆహార రుచులను అభివ ృద్ధి చేసే క్రమంలో ప్రతినెల ఆహార పండుగలను నిర్వహిస్తున్నామని హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. పర్యాటక, భాషా సాంస్క ృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా నేత ృత్వంలో సరికొత్త ఆలోచనలకు కార్యరూపం ఇస్తూ పర్యాటక శాఖ గణనీయమైన అదాయ వనరుగా రూపుదిద్దుకుంటుందని శుక్లా వివరించారు.

గవర్నర్, సీఎం శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ ప్రజానీకానికి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వసంతంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, తెలుగు ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని గవర్నర్ ఆకాంక్షించారు. తెలంగాణ తల్లి ముద్దు బిడ్డలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలను సీఎం కేసీఆర్ తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలని భగవంతుడిని ప్రార్థించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలన్నీ 2019లో విజయవంతంగా సాగాలని సీఎం ఆకాంక్షించారు.

శాంతిభద్రతలు క్షీణించాయి : రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తాడిపత్రిలో మట్కా మాఫియా రెచ్చిపోయి పోలీసులపై దాడికి పాల్పడటమే రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయనడానికి నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఒక ప్రకటనలో పోలీసులపై జరిగిన దాడిని ఖండించారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో మట్కా మాఫియా రెచ్చిపోయి సాక్షాత్తు పోలీసులను బంధించి, వాహనాలకు నిప్పు పెట్టడం అమానుషమన్నారు. ఈ ఘటనలో సీఐ హమీద్‌ఖాన్‌తో సహా ముగ్గురు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన జేసీ మద్దతు ఉన్నదనే ధైర్యంతోనే మట్కా నిర్వాహకులు దాడులకు తెగబడుతున్నారన్నారు. పోలీసులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాగే దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగడాలు మితిమీరిపోతున్నప్పటికీ సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి అలసత్వానికి, నిర్లక్ష్యానికి నిదర్శనమిదేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పటిష్టం చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు.

40 కాదు 75 లక్షల ఎకరాలు

- పెరగనున్న పోలవరం ప్రాజెక్టు సాగు విస్తీర్ణం
- ప్రాథమిక అంచనాలను మించిన తాజా అధ్యయనం
- సీఎం చంద్రబాబుకు నివేదించిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలో 75.38 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని సీఎం చంద్రబాబుకు జలవనరుల శాఖ అధికారులు వివరించారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ఏ జిల్లాకు ఎంతమేర ప్రయోజనం కలుగుతుందనే లెక్కలు తేల్చామన్నారు. మొత్తం 13 జిల్లాలకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాకు సాగునీటి వసతి సాధ్యమవుతుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో 32.2 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి రావడమే కాకుండా, 43.18 లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగుతుందని చెప్పారు. విశాఖ నగరానికి తాగునీరుకు 7.32 టీఎంసీలు, విశాఖ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలకు 16.12 టీఎంసీలు, కాలువల ద్వారా 540 గ్రామాల్లోని 28.5 లక్షల మందికి తాగునీరు లభిస్తుందన్నారు. ఒడిశాకు 5 టీఎంసీలు, చత్తీస్‌గఢ్‌కు 1.5 టీఎంసీలు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. సోమవారం ప్రజావేదికలో పోలవరం ప్రాజెక్టుపై 84వసారి ముఖ్యమంత్రి వర్చువల్ రివ్యూ నిర్వహించారు. పనుల పురోగతి వివరాలను జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు మొత్తం 63.27% పూర్తికాగా, తవ్వకం పనులు 83.60%, కాంక్రీట్ పనులు 57.90% పూర్తయినట్టు అధికారులు తెలిపారు. కుడి ప్రధాన కాలువ 90%, ఎడమ ప్రధాన కాలువ 66.77%, రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ 62.52%, కాఫర్ డ్యామ్ పనులు 6.04% పూర్తయినట్టు చెప్పారు. గత వారం స్పిల్ వే, స్పిల్ చానల్, పైలట్ చానల్, అప్రోచ్ చానల్, లెఫ్ట్ ఫ్లాంక్‌కు సంబంధించి 4.22 లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకం పనులు, స్పిల్ వే, స్పిల్ చానల్, స్టిల్లింగ్ బేసిన్‌కు సంబంధించి 51 వేల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీట్ పనులు పూర్తయినట్టు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తువరకు నిర్మించడం వల్ల తలెత్తే ముంపు ప్రాంతాల వారికి ఆర్‌ఆర్ కాలనీల నిర్మాణం మార్చి నాటికి పూర్తిచేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షలో జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సీఎం ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్, ఈఎన్‌సీ వెంకటేశ్వరావు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

2019లో వైసీపీదే అధికారం : బాలశౌరి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఎన్టీఆర్, జయలలితల బయోపిక్‌లు తెరకెక్కుతున్న తరుణంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ కూడా తీస్తే 'మహానగరంలో మాయగాడు'.. 'యూటర్న్ మోసగాడు' అనే పేర్లు పెట్టవచ్చని వైసీపీ నేత బాలశౌరి ఎద్దేవా చేశారు. సోమవారం పార్టీ కేంద్రకార్యలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్ ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తొమ్మిది శ్వేతపత్రాలు విడుదల చేసిన చంద్రబాబు వైసీపీ ఎమ్మెల్యేలను ఎన్ని కోట్లతో కొనుగోలు చేశారో చెప్పాలన్నారు. మేనిఫెస్టో అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండు చేశారు. హైకోర్టు కట్టడంలో చంద్రబాబు విఫలమయ్యారని, హైకోర్టు కట్టలేక సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ధర్మ పోరాట దీక్షకు అర్థం లేకుండా చేశారన్నారు. వైసీపీ ఇప్పటివరకు ఏ పార్టీతో పొత్తు పెట్టుకోలేదు కానీ చంద్రబాబు మాత్రం అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మాటల్లో భావం కరెక్టుగానే ఉందని జేసీ దివాకర్ రెడ్డి మాట్లాడినప్పుడు చంద్రబాబుకు ముసిముసి నవ్వులెందుకో అంటూ ఎద్దేవా చేశారు. జేసీ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని చంద్రబాబును ఆయన నిలదీశారు.

ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను తరలించాలి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: హైదరాబాద్‌లో ఉన్న ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను కూడా రాష్ట్ర రాజధాని అమరావతికి తరలించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ డిమాండు చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వ సర్వీసు వ్యవహారాల వివాదాల పరిధిని దీన్ని నుంచి తప్పించినందున ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను హైదరాబాద్‌లో ఎందుకు కొనసాగిస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన పేర్కొన్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నవారి సర్వీసుల వివాదాలను పరిష్కరిస్తున్న ట్రిబ్యునల్‌ను హైదరాబాద్‌లో కొనసాగించాల్సిన అవసరం లేదని తెలిపారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఏపీ హైకోర్టును మంగళవారం నుంచి అమరావతిలో కొనసాగిస్తున్నందున ట్రిబ్యునల్‌ను కూడా తరలించేందుకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండు చేస్తున్నామని సూర్యానారాయణ వివరించారు.

ఎస్టీయూ క్యాలెండరు, డైరీ ఆవిష్కరించిన సీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్టీయూ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను సోమవారం ప్రజావేదిక దగ్గర సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ విషయాన్ని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సిహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరంలో విద్యాప్రమాణాల పెంపునకు, విద్యారంగాభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సీఎం సూచించారని పేర్కొన్నారు.

నదుల పునరుజ్జీవనంపై ముసాయిదా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం నదుల పునరుజ్జీవపై నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ముసాయిదా కార్యచరణ ప్రణాళికను జనవరి 15 లోగా రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.కె.జోషి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో నదుల పునరుజ్జీవ కమిటీ సమావేశం సిఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి వివిధ నదులకు సంబంధించిన ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, మెట్రోవాటర్ వర్క్స్, మున్సిపాలిటి, పరిశ్రమలు తదితరశాఖలు జనవరి 5 లోగా తమ డాటాను నేషనల్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీరింగ్ రిసెర్చ్ ఇన్సిట్యూట్‌కు అందజేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మొత్తం వాటర్ షీడ్ మాప్‌ను రూపొందించాలన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా నీటి నాణ్యతను మానిటరింగ్ చేయాలని తెలిపారు. రాష్ట్రానికి సంబంధించి పిసిబి ద్వారా నీటి నాణ్యత, ఇరిగేషన్ ద్వారా నీటి పరిమాణంపై అధ్యయనం చేయాలన్నారు.

సంపాదకీయం

ఎన్నో మలుపులు, మార్పులు, రాజకీయాలు, పారవశ్యం – ఆవేదన భరితమైన 2018వ సంవత్సరానికి గుడ్‌బై. అయితే, చరిత్రలో ఈ ఏడాది శాశ్వతంగా మిగిలిపోతుంది. దేశంలోని దళితులు, ముస్లిం మైనారిటీ వర్గాల పైన గోసంరక్షకుల ముసుగులో సంఘ్ పరివార్ శక్తులు భౌతికదాడులకు పాల్పడి, హత్యలకు బరితెగించిన 2018వ సంవత్సరం ఆరెస్సెస్ కనుసన్నల్లో పరిపాలన సాగిస్తున్న నరేంద్రమోడీ హయాంలో ఓ మాయని మచ్చగా, కళంకభరితమైనదిగా ఉండిపోతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మోడీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైంది. దేశ రాజ్యాంగం విలువలు లుప్తమైపోయి ఈ ప్రమాదంలో పడింది. స్వతంత్రంగా, నిష్పాక్షికంగా వ్యవహరించవలసిన కేంద్ర దర్యాప్తు సంస్థలపై ఏలికల ఒత్తిడి మరింతగా పెరిగిపోయింది. దేశ ప్రజల్లో మరీ ముఖ్యంగా అల్ప సంఖ్యాక వర్గాల్లో అభద్రతాభావం చోటు చేసుకుంది. దేశవ్యాపితంగా అన్ని రాష్ట్రాల్లో రైతులు దుస్థితిలో కూరుకుపోయారు. యువకులు, విద్యాధికులను నిరుద్యోగభూతం వెంటాడుతోంది. అన్నదాతలు, కార్మికులు, ఉద్యోగులు గత్యంతరంలేని పరిస్థితుల్లో వారి కోర్కెల సాధనకు ఉద్యమాల బాట పట్టవలసి వచ్చింది. ప్రధాని మోడీ అనాలోచిత, తొందరపాటు నిర్ణయాలు, చర్యలతో దేశ ఆర్థికవ్యవస్థ అతలాకుతలమై నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) పేరుకుపోవడం వల్ల ప్రభుత్వరంగ బ్యాంకులు నష్టాల ఊబిలో కూరుకుపోయి దివాలా అంచులకు చేరుకున్నాయి. తొందరపాటుతో అమలుచేసిన వస్తు సేవలపన్ను సామాన్య మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచింది. మోడీ తన 2018వ సంవత్సరం చివరి 'మన్‌కీబాత్' (స్వీయమనోగతం) లో ఆదివారం సందేశమిస్తూ, కేంద్రప్రభుత్వం సాధించిన విజయాలు ప్రతి ఒక్కరినీ గర్వించేలా చేశాయని, ప్రగతి పథంలో ఈ పయనం వచ్చే ఏడాది కొనసాగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రతి ఒక్కరిని 'గర్వించేలా చేసినట్లయితే ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీకి శృంగభంగం ఎందుకు జరిగిందో మోడీకే ఎరుక. వచ్చే ఏడాది ఈ పయనం కొనసాగుతుందని కూడా ఆయన అన్నారు. అంటే 2019లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. మొట్టమొదటి నుండి మనకీ బాత్ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడే మాటలకు, ఆచరణలో చేతలకు పొంతనలేని విధంగానే సాగాయి. మాటల మాంత్రికుడిగా పేరుగాంచిన మోడీ తన వాగడంబరంతో లేనిపోనిదానికి హల్‌చల్ సృష్టించటం అలవాటుగా మారింది. మోడీ అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో అభివృద్ధి మంత్రాన్ని జపించారు. రాను రాను అది బెడిసి కొట్టి అభివృద్ధి మంత్రం జపించడాన్ని నిలిపివేసి, 'ఎప్పటికయ్యేది అవసరమో' అది లంకించుకోవడం ప్రారంభించి ఎన్నికల్లో లబ్ధిపొందే ప్రయత్నం చేశారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాతో కలిసి స్వార్థ ప్రయోజనాలతో కులం, మతం పేరిట సమాజాన్ని విభజించి, విద్వేషాలను రెచ్చగొట్టే క్రీడను మోడీ ప్రారంభించారు. 1943 అక్టోబరు 21 భారత్ మొట్టమొదటి స్వతంత్ర ప్రభుత్వం "అజాద్‌హింద్" ప్రభుత్వాన్ని నేతాజీ సుభాష్

పొంతనలేని మోడీ మాటలు

చంద్రబోస్‌ను ఏర్పాటు చేసి 75 సంవత్సరాలైన సందర్భంగా (ప్లాటినం జూబ్లీ) మోడీ ఎర్రకోటపైన త్రివర్ణపతకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్యసమర వీరయోధులకు నివాళుర్పించారు.

వ్యతిరేకతను వ్యాప్తి చేయడం చాలా తేలికని. అయితే ప్రజలు ఐక్యంగా "సానుకూల ప్రచారాన్ని" సాగిస్తూ ముందడుగు వేయాలని మోడీ తన స్వీయ మనోగతాన్ని వెల్లడించారు. మోడీ చేసిన విజ్ఞప్తి హర్షణీయమే. అయితే, చెప్పింది ఆచరణలో అమలు చేసి చూపగలిగినప్పుడే ఏలికల నిజాయితీ, చిత్తశుద్ధి నిరూపితమవుతుంది. మోడీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్ళపాలనలో జరిగిన సంఘటనలను ఒకసారి సింహావలోకం చేసుకున్నట్లయితే వ్యతిరేకతను, విద్వేషాలను వ్యాప్తి చేసిందెవరో ప్రజలకు తెరచిన పుస్తకంలో అర్థమవుతుంది. మతం–కులం పేరిట సమాజంలో విభజనకు పాల్పడుతూ, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాలరాచే విధంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆరెస్సెస్, సంఘ్ పరివార్ శక్తులు బరితెగించి దుష్టచర్యలకు పాల్పడితే నోరు మెదపకుండా "మౌనముని" పాత్ర పోషించిన మోడీదే పూర్తిబాధ్యత. ఆయన ఈ విషయంలో జాతికి సమాధానం చెప్పవలసిన సమయం ఆసన్నమైంది. బలమైన కృతనిశ్చయం ఉంటే అవరోధాలుగా మారడంలో కష్టాలుకూడా విఫలమవు తాయని మన్‌కీబాత్ రేడియో ప్రసంగంలో మోడీ చెప్పారు. అయితే "మంత్రాలతో చింతకాయలు రాలవు." కృతనిశ్చయం ఒక్కటే ఉంటే కష్టాలు, కడగండ్లు వాటంత అవే సమసిపోతాయంటే దేశప్రజలను వెర్రివాళ్ళను చేయడం తప్ప మరొకటి కాదు. ప్రజల కష్టాలను తీర్చేందుకు తగిన చర్యలు చేపట్టవలసిన ప్రధాన మంత్రిది. గత నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజల కష్టాలను తీర్చే చర్యలు తీసుకోకపోగా ప్రజలు ముఖ్యంగా సామన్య మధ్యతరగతి ప్రజలను కష్టాలకు గురిచేసే విధంగా పెద్దనోట్లరద్దు, జీఎస్టీ, అమలు వంటి అనాలోచిత చర్యలు చేపట్టింది మోడీ ప్రభుత్వం. ప్రజలందరూ ఐక్యమై సానుకూలతను విస్తృతంగా ప్రచారం చేసినట్లయితే సమాజంలో మార్పులు తీసుకొచ్చిన మన "వీరుల" గురించి మరింత మందికి తెలుస్తుందని కూడా మోడీ సెలవిచ్చారు. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించవలసిన అవసరం ఉంది. "నవయుగ భారత" నిర్మాత, భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పేరున దేశచరిత్ర పటంలో నుండి చెరిపి వేసేందుకు ప్రయత్నించింది. మోడీ ప్రభుత్వం కాదా? ఆచరణకు నోచుకోని ఎన్ని సూక్తులు వల్లిస్తే ప్రయోజనం ఏముంటుంది. గత ప్రభుత్వాలపాలనలో అభివృద్ధి ఏమి జరగలేదన్నట్లు, తమ హయాంలోనే అభివృద్ధి అంతా జరిగిందని గొప్పలు చెప్పుకోవడం "సెల్ఫ్‌డబ్బా" తప్ప వేరేకాదు. వేలకోట్ల రూపాయలు వెచ్చించి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించిన విషయాన్ని ఆయన ఉటంకించారు. ఆ విగ్రహానికి వెచ్చించిన సొమ్మును అన్నదాతల కడగండ్లు తీర్చి, బలవన్మరణాలను అరికట్టి ఉండగలిగితే ప్రజలు హర్షించేవారు. మహాకవి గురజాడ "వట్టిమాటలు కట్టిపెట్టోయ్ గట్టిమేల్ తల పెట్టవోయ్" అని ఒక గేయంలో అన్నట్లుగా ఏలికల మాటలు, చేతలు ఉండవలసిన అవసరం ఉంది.

చురక

కాలసూచీలో అంకెల మార్పు
కొత్త సంవత్సరం కానేకాదు
కొత్త ఊహలు తొడగకపోతే
కొత్త పిలుపుకు అర్థమే లేదు

కొత్తదారులు పాదుకొలుపే
కొత్త సృష్టికి మేలుకొలుపు
గుండె గుండెలో పల్లవిస్తేనే
కొత్త సాలుకు మేలి మలుపు

– వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

మహత్తర క్యూబా విప్లవం @ 60

బుడ్డిగ జమిందార్




'వీవా క్యూబా'



ఫిడెల్ కాస్ట్రో తన విద్యాభ్యాసాన్ని సాంతియాగో డె క్యూబా, హవానాలో చదువుతున్న రోజుల్లోనే లాటిన్ అమెరికా దేశాల్లోని విప్లవోద్యమాలలో పాల్గొన్నాడు. 1950లో యూనివర్సిటీ ఆఫ్ హవానాలో లా పూర్తి చేసుకొని 1952లో క్యూబన్ పీపుల్స్ పార్టీ తరపున పోటీ చేయగా, బాటీస్టాస్ తిరుగుబాటులో పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. 1953 జూలై 26 నాడు శాంతియాగోలోని ఆర్మీగోడౌన్‌లపై 160 మందితో దాడిచేసి విఫలమయ్యాడు. అనేక మంది చనిపోగా కాస్ట్రో సోదరులను అరెస్టు చేసి జైలులో ఉంచి 1955న విడుదల చేయగా మెక్సికోకు కాస్ట్రో సోదరులు పయనమై అక్కడ నుండి ఫాసిస్టు బాటిస్టాకు వ్యతిరేకంగా విప్లవోద్యమాన్ని ప్రారంభించారు. 81 మంది విప్లవకారులతో గ్రాన్మా పేరుగల నౌకతో క్యూబాకు పయనమై తూర్పు క్యూబా సముద్ర తీరానికి 1956 డిసెంబరు 2న చేరుకొన్నారు. వీరిలో చాలామంది చంపబడగా కాస్ట్రో సోదరులు, చేగువేరాలు తప్పించుకొని బాటిస్టాకు వ్యతిరేకంగా గొరెల్లా సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు. సియెర్రా మెయిస్ట్రా పర్వతశ్రేణుల్లో ప్రారంభమైన పోరాట ఉద్యమానికి 1953 తిరుగుబాటు చిహ్నంగా '26 జూలై ఉద్యమం'గా నామకరణ చేసుకొన్నారు. పోరాటాల ఫలితంగా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 26 జూలై ఉద్యమంగా పిలవబడే క్యూబాగెరిల్లా సాయుధ విప్లవం 1953 జూలై నెలలో ప్రారంభమై 1959 డిసెంబరు 31 నాటికి ముగిసింది. ఈ రోజు జనవరి 1, 2019 నుండి క్యూబా ప్రజలు తమ దేశ విప్లవ 60వ వార్షికోత్సవాన్ని సంవత్సరంపాటు జరుపు కోనున్నారు. ఫిడెల్‌కాస్ట్రో, రాల్‌కాస్ట్రో, చేగువేరాల నాయకత్వంలో విప్లవకమిటీ చేతుల్లో క్రూరమైన ఫాసిస్టు నియంత ఫ్లగెన్సియా బాటిస్టా ఓడిపోయాడు.

ఫిడెల్ కాస్ట్రో చెప్పినట్లుగా 'అమెరికా ప్రతీక్షణం విప్లవాన్ని కూలద్రోయటానికి నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటుంది గనుక మనం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి.' సామ్రాజ్యవాదం తన ప్రయత్నాలను ఇప్పటికీ విరమించుకోలేదు. అవకాశం వచ్చినప్పుడల్లా క్యూబన్ విప్లవాన్ని నీరుగార్చుటకు ప్రయత్నిస్తూ, క్యూబాను విధ్వంసం చేయుటకై తన కృషిని అమెరికా సలుపుతూనే ఉన్నది. బే ఆఫ్ పిగ్స్ చొరబాటునుండి, క్యూబన్ నాయకత్వాన్ని ముఖ్యంగా ఫిడెల్‌కాస్ట్రోని పందలసార్లు హత్య చేయటానికి ప్రయత్నించి విఫలమైంది. క్యూబాలో తన కీలుబొమ్మ ప్రభుత్వం కోసమై వందలాది కోట్ల డాలర్లను ఖర్చు చేస్తూనే ఉంది అమెరికా. వీటన్నిటికన్నా క్యూబాపై యుద్ధంకాని ఆర్థికయుద్ధాన్ని ప్రకటించి అమెరికా ముఖద్వారానికి 90 మైళ్ల దూరంలోవున్న క్యూబాను వాణిజ్యనిర్బంధంలో దశాబ్దాలపాటు ఉంచింది. 1962 సంవత్సరం నుండి అమెరికాతో పాటు పాశ్చ్యదేశాలు దౌత్య సంబంధాలను రద్దుచేసుకొన్నాయి. కోటీ పదిహేను లక్షల జనాభాతో జీడీపీతో 1,90,884 కిలోమీటర్ల వైశాల్యంతో అమెరికాతో పోల్చుకుంటే 89వ వంతైన చిన్న దేశమైన క్యూబా అన్నిరకాల ఒడిదుడుకులను ఎదుర్కొని ముందుకు వెళ్లడమేగాక అనేక రంగాలలో ముఖ్యంగా మానవీయరంగంలో అమెరికాకంటే ముందంజలో ఉంది. విద్య వైద్యం సాంఘిక భద్రతలకు పెట్టింది పేరుగా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది క్యూబా దేశం. ప్రపంచ దేశాలకు ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలకు క్యూబాదేశం ఒక ఆదర్శ దిక్సూచిగా నిలిచింది. సంపద సృష్టించిన మెజారిటీ ప్రజల కోసమని, కొద్దిమంది కోసం కాదని చాటిచెబుతున్నది.

ప్రపంచంలో ట్రంప్ నాయకత్వంలోని అమెరికా సామ్రాజ్యవాదం ప్రస్తుతం క్యూబాను ఇంకా నిర్బంధానికి గురిచేయటానికి విశ్వ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది. శ్వేతసౌధంలో జాతీయ భద్రతా సలహా దారునిగా ఉన్న, యుద్ధ అనుకూలడేగ అయినటువంటి జాన్‌బోల్టన్ 'క్యూబా, వెనిజులా, నికరాగువా దేశాలను క్రూరమైన హక్కులను అణగదొక్కే దృష్టత్రయ శక్తులు'గా పోల్చి పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనబడినట్లుగా వ్యాఖ్యానించాడు. బ్రెజిల్ దేశంలో ఇటీవల ఫాసిస్టు జైర్ బొల్సోనారో అధ్యక్షునిగా ఎన్నికయిన సందర్భంగా ఫ్లోరిడా నగరంలో క్యూబా విప్లవ ప్రతిఘాతశక్తులతో జాన్‌బోల్టన్ సంబరాలను జరుపుకొన్నాడు. వెన్వెంటనే జైర్‌బొల్సోనారోను కల్సుకొని లాటిన్, సెంట్రల్ అమెరికాలోని అభ్యుదయ, ప్రగతిశీల, ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూల్చటానికి బ్రెజిల్ సహాయం అర్థించినట్లు పత్రికలు రాశాయి. తన అభ్యర్థనను సానుకూలంగా స్పందించి బ్రెజిల్‌లో ఉన్న 8వేల మంది క్యూబా డాక్టర్లను వెనుకకు వంపేలా చేయగల్గాడు. క్యూబాదేశంలోని వేలాది డాక్టర్లతో పాటుగా 60వేల మంది వైద్యసిబ్బంది ప్రపంచంలోని కనీసం 50 దేశాల్లో వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రకృతి విలయతాండవం ఏదైనా దేశంలోనైనా వస్తే ముందుగా సహకరించేది క్యూబా డాక్టర్లే. హైతీ, కాశ్మీర్లో సంభవించిన భూకంపాల తర్వాత వీరు అందించిన సేవలు మరువరానివి. పశ్చిమ ఆఫ్రికాలో సంబంధించిన ఎబోలా వ్యాధి బారినుండి రక్షించటానికి సేవలందించమని ప్రపంచ ఆరోగ్య సంస్థ కోరగా ముందుగా క్యూబన్ డాక్టర్లు కథనరంగంలోకి దూకి సేవలందించారు. క్యూబా అంతర్జాతీయ ప్రజలతో సంఘీభావం విడదీయరానిది.

క్యూబా నిరంతం ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే అభివృద్ధి దశలో పయనిస్తున్న దేశంగా నిలిచింది. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పాల్గొన్న 70 లక్షల ప్రజానీకం (దేశ ఓటర్లలో 82.9 శాతం ఎన్నికల్లో పాల్గొన్నారు) 605 పార్లమెంటు సభ్యులను ఎన్నుకోగా వారిలో 53 శాతం మహిళలే ఎన్నిక కావటం, ప్రపంచంలో ద్వితీయ స్థాయిలో మహిళా సభ్యులు క్యూబా పార్లమెంటులో ఉండటం మహిళల హక్కులను, మహిళా సాధికారికతను తెలియజేస్తుంది. క్యూబా రాజ్యాంగ సంస్కరణలపై ప్రస్తుతం దేశమంతటా ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలు, సమాజంలోని అన్ని తరగతుల ప్రజలు చర్చలు జరుపుతున్నారు. రాజ్యాంగంపై ప్రతిపాదించిన అనేక సవరణలపై కనీసం ఇప్పటివరకూ 135వేల సమావేశాలు జరిగాయి. చర్చల అనంతరం నూతన రాజ్యాంగంపై క్యూబాదీవిలో ఫిబ్రవరి 2019లో రెఫరెండంను తీసుకొంటారు. ఇటీవల క్యూబా నాయకుడు విప్లవ పోరాటయోధుడు ఫిడెల్ కాస్ట్రో చనిపోయిన తర్వాత క్యూబా తన నడకను మార్చుకోనుందని సోషలిస్టు పంథానుండి తప్పుకొంటుందని పశ్చిమ మీడియా ప్రచారం చేసింది. ఇదేతరహా ప్రచారం 90 దశకంలో సోవియట్ యూనియన్ పతనం తర్వాత కూడా జరిగినది. మరలా అమెరికా అధ్యక్షుడు క్యూబాలో పర్యటించినప్పుడు కూడా ఈ తరహా వార్తలే వినబడ్డాయి. మీడియా ఎప్పుడూ క్యూబాపై బురదజల్లటానికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటుంది. కానీ ఎంత ఎక్కువగా క్యూబా వ్యతిరేక ప్రచారం జరుగుతుందో అంత పటిష్టంగా క్యూబా సోషలిస్టు సమాజం రూపుదిద్దుకొంటున్నది. క్యూబన్ ప్రజలు సోషలిజాన్ని వీడమనే దృఢసంకల్పంతో, నిశ్చయంతో పయనిస్తున్నారు. క్యూబా నూతన అధ్యక్షుడు డియాజ్-కనేల్‌ను బ్రిటన్‌లోని క్యూబా సంఘీబావ కమిటీ నవంబరు నెలలో ఆహ్వానించింది. లేబరు పార్టీ అధ్యక్షుడు జెర్మీకోర్బిన్‌ను క్యూబా ప్రతినిధివర్గం కలిసింది. ఛాన్సలర్‌ను ప్రిన్స్ చార్లెస్‌ను కూడా కలుసుకున్నారు. పార్లమెంటులో క్యూబా అధ్యక్షుడు మాట్లాడుతూ 'తనపై చూపిన ఆప్యాయితకు స్వాగతాన్కి యుకె ప్రజలతో అతుక్కొనిపోయానని, క్యూబాకు ఎంతోదూరంగా ఉన్న మాపై మీరు చూపిస్తున్న ప్రేమానురాగాలు ఆప్యాయతలను చూస్తుంటే మన ఇరువురి ప్రజల సంబంధాలు చాలా పూర్వకాలం నాటివిగా అనిపిస్తుందని, అందుకే నైను సదా కృతజ్ఞుడనని' అన్నారు. అయినప్పటికీ బ్రిటీష్ ప్రభుత్వం మాత్రం క్యూబాతో ఆచరణలో పనికిరాని వర్తక వాణిజ్యాలను మాత్రమే చేస్తున్నది. 2019 సంవత్సరమంతా క్యూబా సంఘీభావ ప్రచారసభ 60 వసంతాల వేడుకలను దేశమంతటా జరుపుకోనుంది. క్యూబా ఈ ప్రపంచంలో ఒంటరిగాలేదని మనమంతా రెట్టించిన సంఘీబావంలో క్యూబా దేశానికి, ఆదేశ సమసమాజం కోసం అనేక త్యాగాలనొడ్డిన వీరక్యూబా విప్లవవాదులకు, సోషలిస్టు పటిష్టతకు నిరంతరం అమెరికాను ఎదిరించి పోరాడుతున్న క్యూబా ప్రజానీకానికి మనదేశ ప్రజలమంతా శుభాకాంక్షలు తెలుపుతూ అభినందిద్దాం. వీవా క్యూబా 60కు శుభాకాంక్షలు.

పయనించే కాలానికి స్వాగతం...



దాసరి శాంతకుమారి

నింగికెగసిన ఆనందాలతో
తరలిపోయే తారకవై
కాలవలయంలో కమ్మని కలవై
వివాదాలు, విషాదాలు,
వేడుకల సమాహారంగా సాగుతూ
కొత్త శకానికి నాంది పలుకుతూ..
పడి పడి వడి వడిగా
పయనించే కాలానికి
స్వాగతం పలుకుదాం

జ్ఞాపకాల పొరల్లో
అంతులేని అనుభూతులతో
ఊరించే ఊసులతో..
నిన్నునమ్మినవారికి
ఎదురేలేని కనబడని కావ్యమై
యుగ యుగాల చరిత్రలకు
సాక్షిగా నిలుస్తూ...
పయనించే కాలానికి
స్వాగతం పలుకుదాం

సంబరాల సందడేలేక
సాగిపోయే సాగుబడిలో
సత్యం అహింసల నీరుపోసి
ఈర్ష్యా ద్వేషాల
కలుపుమొక్కలను తొలగించి
మంచిని పెట్టుబడిగా చేసి
సరికొత్త ఆశల్ని పండిస్తూ..
జనావళికి శుభం
పూలు పూయిస్తూ..
కాలచక్ర భ్రమణంలో..
మంచి చెడులను మదింపు చేస్తూ..
కొరతల కోమాలో ఉన్న
అనుబంధ బాంధవ్యాలకు
భవిష్యత్తుకు భరోసా ఇచ్చు
పయనించే కాలానికి
స్వాగతం పలుకుదాం

ఆన్ లైన్ హంగామతో...
విచ్చలవిడి యూట్యూబ్ వీడియోలతో
కాలయంత్రంలో చిక్కుకొని
కాలాన్ని సబ్ స్క్రైబ్ చేసుకోలేక
కేరాఫ్ లేకుండా పోతున్న
కుర్రకారు వేలుపట్టుకొని
పయనించే కాలానికి
స్వాగతం పలుకుదాం

కాలంవేసే గాలానికి చిక్కుకోక
విష సంస్కృతులను విడనాడి
జారిపోతున్న కాలాన్ని
జాగరూకతతో ఒడిసి పట్టుకొని
అభివృద్ధి దీపకాంతులను
అన్నిదిక్కుల ప్రసరింపజేస్తూ
పయనించే కాలానికి
స్వాగతం పలుకుదాం

సందర్భం

పుస్తక ప్రియుల పండుగ - త్రిదశోత్సవం



సి. రాఘవాచారి

చారిత్రాత్మకంగా విజయవాడ పుస్తక ప్రచురణ కేంద్రం. ప్రఖ్యాతిగాంచిన ఈ నేపథ్యంలో జరుగుతున్న పుస్తక మహోత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. జాతీయోద్యమ కాలం నుంచి పత్రికలు, పుస్తక ప్రచురణ కేంద్రాలు, ప్రింటింగ్ ప్రెస్‌లతో విలసిల్లిన ఈ పట్నం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధానిగా విస్తరిస్తున్న సందర్భం కూడా గమనార్హం. స్వాతంత్ర్యోద్యమం, గ్రంథాల యోద్యమం, సాహితీ ప్రచురణల విశేషాలతో ఈ పట్టణ చరిత్ర ముడిపడి ఉన్నది. ఆంధ్రా తిలక్‌గా చిరస్మరణీయుడైన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు సంపాద కత్వంలో కొద్దికాలమే నడిచినా స్వాతంత్ర్యో ద్యమంలో తనకంటూ స్థిరమైన స్థానం పొందిన 'స్వరాజ్య' పత్రిక ఇక్కడ నుంచే వెలువడింది. ఆ పత్రికలో బ్రిటీష్ సామ్రాజ్యవాదుల దురంతాలను ఖండిస్తూ ఘాటైన సంపాద కీయం రాసి నందుకు హరిసర్వోత్తమరావు గారు జైలు పాల య్యారు. ఆ ఉదంతాన్ని పురస్కరించుకునే జాతీయ స్థాయిలో లోకమాన్య తిలక్ ఆదర్శాలను పాటించినందుకు ఆంధ్రా తిలక్ అని బిరుదు వచ్చింది. ఆయన కూడా తన పత్రికలో ఇలాంటి సంపాదకీయాలు రాసినందుకు మాండలే జైలులో శిక్ష అనుభవించాల్సి వచ్చింది. ఆ తర్వాత అనేక పత్రికలు ప్రచురింపబడటంతో విజయవాడ తెలుగు పత్రికలకు ప్రధాన కేంద్రం అయ్యింది. దాంతోపాటే అనేక ప్రచురణ సంస్థలు ప్రసిద్ధిగాంచిన ఇతర భాషా రచయితల అనువాదాలతో సహా ఉత్తమ సాహిత్యాన్ని అందించారు. బొందలపాటి శివరామ కృష్ణ, శకుంతలాదేవి స్థాపించిన దేశీ ప్రచురణల ద్వారా శరత్ సాహిత్యం తెలుగు పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. ఈ క్రమంలోనే జాతీయోద్యమ ప్రభావంతో "ఆదర్శ గ్రంథ మండలం" ప్రచురణలు చేపట్టిన గద్దె లింగయ్య గారు స్వాతం త్ర్యోద్యమ వీరులకు, విలువలకు సంబంధించిన పుస్తకాలు వెలువరించారు.

దేశభక్తి, భావకవిత్వాల హోరులో తెలుగుపాఠకలోకం ఓలలాడుతున్న తరుణంలో 30వ దశకంలో అభ్యుదయ సాహిత్యం పరిమితంగానైనా సోషలిస్టు సిద్ధాంతాల ప్రచారా నికి అంకితమైన ప్రచురణలు, పత్రికలు వెలువడటంతో బెజ వాడ తెలుగునాట సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమం కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఆ దశకంలో అన్ని సాహిత్య ధోరణు లకు ఆదరణ అందించింది. ఒకవైపు తిరుపతి వెంకటకవులు, కొప్పరపు సోదరుల శతావధానాలు, అష్టావధానాల జోరు. మరోవైపు రాయప్రోలు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ ప్రభృతులు రంగంమీదకు వచ్చిన దశ ఇది. అదే సమయంలో తెలుగుజాతి వైతాళి కత్రయం (కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి) రచనలను, వారు జరిపిన అనితర సాధ్యమైన కృషిని తెలుగు ప్రజలకు తెలియజేయడంతో ఉద్యమంలా వామపక్షభావాలున్న ప్రచురణ సంస్థలు నిర్వహించిన పాత్ర ఈ సందర్భంగా విస్మరించరానిది. నవశక్తి, ప్రజాశక్తి తర్వాత విశాలాంధ్రతోపాటు అనేక వామపక్ష ప్రచురణ సంస్థలు ఈ పట్టణం నుంచే తమ కార్యకలాపాలు నిర్వహించాయి. 30వ దశకంలోనే ప్రఖ్యాత కాంగ్రెస్ నాయకుడు కొవ్విడి లింగరాజు గోర్కి అమ్మకు తెలుగు అనువాదం చేసి ప్రచురించారు. ముంగండ నుంచి మహీదర సోదరులు (జగన్మోహనరావు, రామ్మోహనరావు) విశ్వ సాహిత్యమాల ద్వారా సోషలిస్టు రచనల తెలుగు అనువాదాలను ప్రచురించారు. రాహుల్ సాంకృత్యాయన రచనలు, ఆదర్శ గ్రంథాలను ప్రచురించింది. మద్రాసు నుంచి సాహిత్య సేవ చేస్తున్న విజ్ఞాన చంద్రిక ప్రచురణల్లో భాగంగా ఈ నగర ప్రముఖులు అయ్యదేవర కాళేశ్వరరావు గారు ఆధునిక టర్కీ నిర్మాత, ఆదర్శ సంస్కరణవాది అయిన కెమాల్‌పాషా జీవిత చరిత్రను తెలుగు పాఠకులకు అందించారు.

ఈ సమయంలోనే సమాంతరంగా గ్రంథాలయ ఉద్య మం ఉవ్వెత్తున సాగడంతో రాష్ట్రమంతటా పుస్తకాలు చదివే పాఠకుల సంఖ్య పెరిగింది. మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రా ప్రాంతంలో హరిసర్వోత్తమరావు గారు, అయ్యంకి వెంకట రమణయ్య గారు, చిలకమర్తి లక్ష్మీనరసింహం తదితరులు గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం అందించడమే గాక తెలుగు వారిలో రాజకీయ చైతన్యాన్ని, ప్రపంచ పరిణామాల పట్ల ఆసక్తిని పెంచగలిగారు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైన 1914లో తొలి తెలుగు దినపత్రిక 'ఆంధ్రపత్రిక' ప్రచురణ మద్రాసు నుంచి ప్రారంభమైంది. స్వాతంత్ర్యం రావడానికి పూర్వమే కమ్యూనిస్టు ఉద్యమం విస్తరిస్తున్న క్రమంలో ప్రజాశక్తి 1941లో వారపత్రికగా మొదలై 1945లో విజయవాడ కేంద్రం నుంచి తొలి తెలుగు దిన పత్రికగా వెలుగుచూసింది. తర్వాత జరిగిన నిర్బంధకాండలో ఎన్నో ఒడిదుడుకులకులోనైనా 1952లో వెలువడిన విశాలాంధ్ర ఆ కృషిని కొనసాగిస్తూ వచ్చింది. ఆ నాటికి తాలూకా కేంద్రంగా మాత్రమే ఉన్న విజయవాడలో జాతీయ వార్తా సంస్థ(పీటీఐ) శాఖ నెలకొల్పడానికి ప్రజాశక్తి కారణం. విశాలాంధ్ర దినపత్రిక ప్రారంభమైన తర్వాత దాదాపు పదేళ్ళకు ఆంధ్రజ్యోతి నార్ల వారి సంపాదకత్వంలో దిన పత్రికగా మొదలైంది. అదే సమయంలో మద్రాసులో ప్రచు రించబడుతున్న ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలు కూడా విజయ వాడలో ప్రచురణలు ప్రారంభించాయి. ఇది 1956 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన పరిణామం. హైదరాబాద్ రాజకీయ, పరిపాలనా కేంద్రంగా, రాజధానిగా ప్రతిపత్తితో కొనసాగుతున్నా విజయవాడ రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక కేంద్రంగా తన స్థానాన్ని నిలబెట్టుకో కలిగింది. రెండు దశాబ్దాల తర్వాత ప్రధాన పత్రికలన్నీ హైదరాబాద్‌కు మారాయి. కానీ పుస్తక ప్రచురణ కేంద్రంగా విజయవాడకున్న ప్రశస్తి మాత్రం తరగలేదు. మళ్లీ ఇప్పుడు కొత్త రాష్ట్ర రాజధానిగా తెలుగు పత్రికలన్నీ ఇక్కడ తమ ప్రచురణ కేంద్రాలను విస్తరించాయి.

1989లో నేషనల్ బుక్ ఫెస్టివల్ సహకారంతో ప్రారంభమైన పుస్తక మహోత్సవం వయస్సు ఇప్పటికి 30 ఏళ్లు. ఈ త్రిదశవత్సర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ నిర్వాహకులు గర్వపడేలా చెప్పుకోవడానికి జరిగిన కృషి ఎంతో ఉంది. పుస్తక పఠనం వల్ల మనోవికాసంతోపాటు ప్రపంచం పట్ల, సమాజం పట్ల అవగాహన కలుగుతుంది. ఈ పుస్తక మహోత్సవంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి గల ప్రచురణ సంస్థలతోపాటు రాష్ట్రంలోని ప్రచురణకర్తలందరూ పాల్గొనటం ద్వారా దాదాపు 300 బుక్‌స్టాల్స్‌తో ఏటేటా ఈ పది రోజులూ పుస్తకప్రియులకు పెద్ద పండుగ వలే గుర్తుపెట్టుకోదగిన ఘటనగా స్థిరపడింది. ఆంగ్ల నూతన సంవత్సరంలో మొదలయ్యే ఈ పండుగ సంక్రాంతికి రెండు, మూడు రోజుల ముందు వరకు వేలాది మంది పాఠకులను ఆకర్షిస్తూ సాహిత్యప్రియులను ఆదరిస్తున్నది. చిన్నగా మొద లైన వాగు క్రమంగా పెద్ద నది స్థాయికి చేరినట్టు ఇప్పుడు ఈ పుస్తక మహోత్సవమూ నేడు దేశంలోనే పేరు తెచ్చుకున్నది. పుస్తక ప్రచురణకర్తలు, విక్రేతలు కలిసి సంఘంగా చేసిన కృషి ఫలితమే ఇప్పుడు ఈ స్థాయి సాంస్కృతిక సంబరంగా, నూతన సంవత్సరపు తొలి కానుకగా ఉత్సవం తెలుగువారు నిరీక్షించేట్టు పరిణమించింది.

ఈ ఉత్సవంలో చెప్పుకోదగ్గ ఘట్టాలు కొన్ని ఉన్నాయి. ఒకటి వైవిధ్యంతో కూడిన పుస్తకాలు అనేక భాషల్లో అందు బాటులో రావడానికి అవకాశం ఉంది. రెండవది తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధులైన వారి శతజయంతులు, స్మారకసభల ద్వారా వారిని, వారి కృషిని నేటి తరానికి తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించడం. మూడవది తమ అభిమానులైన కవులతో, రచయితలతో ముఖాముఖి మాట్లాడే అవకాశాలు కల్పించడం. వివిధ స్థాయి విద్యార్థులకు పోటీల నిర్వహణ ద్వారా వారిలో పఠనాసక్తి పెంపొందించేలా ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. సాంకేతిక, ఆధ్యాత్మిక, సాధారణ, విద్యా విషయక పుస్తకాలతోపాటు వివిధ సాహిత్యధోరణులకు ప్రాతినిధ్యం వహించే సంస్థల ద్వారా తాజాగా వెలువడుతున్న రచనలు పాఠకులను అందించే అవకాశం ఉంది. పుస్తకావిష్కరణలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. వాణిజ్య ప్రాధాన్యం కలిగిన ప్రచురణ సంస్థలతోపాటు అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం, అమరావతి, ప్రజాసాహితి వంటి సంస్థలకు కూడా అవకాశమిచ్చి ప్రోత్సహిస్తున్నందుకు పుస్తక మహోత్సవ కమిటీ బాధ్యులకు అభినందనలు. విశ్వనాథ సత్యనారాయణ గారి రచనలన్నీ విశ్వనాథపీఠం వారి స్టాల్ ద్వారా దొరుకుతున్నాయి. ఇవే గాక నవోదయ, స్టూడెంట్ బుక్స్, ఎమెస్కో, అశోక్ బుక్‌సెంటర్, అలకానంద ప్రచురణ సంస్థ, సాహితీమిత్రులు.. ఇలా అనేక సంస్థలు వివిధ రకాల పుస్తకాలను అందజేస్తున్నాయి. మోతీలాల్, బెనారస్‌దాస్ వారు ప్రచురించే ప్రాచీన భారతీయ వాంగ్మయం ఇంగ్లీషు అనువాదాల్లో లభ్యమవుతున్నాయి. అనేక అంశాలపై నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బీటీ) వారు ప్రచురించే పుస్తకాలు చౌక ధరలకు లభిస్తాయి. కేంద్ర సాహిత్య అకాడమీ తరఫున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇలాంటి మహోత్సవాలతో నగర స్థాయికి తగ్గట్టు సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రగతి కూడా జరుగుతుంది. పుస్తకం కొరకు నడక (వాక్ ఫర్ బుక్స్) ద్వారా విద్యార్థుల్లో, పౌరుల్లో పఠనాసక్తి పెంచే వినూత్న కార్యక్రమం. నగర పాలక సంస్థ కేటాయించిన స్థలం(సీవీఆర్ హైస్కూల్ ప్రాంగణం)లో అధునాతన సౌకర్యాలతో అన్ని రకాల పాఠకుల అవసరాలు తీర్చవిధంగా నిర్మించిన సొంత భవనంలో ప్రతిష్టాత్మక మైన గ్రంథాలయం నిర్వహించడం కూడా అపురూపమైన విష యమే. విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభమైన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లోనూ పుస్తక ప్రదర్శ నలు కొనసాగుతున్నాయి. గుంటూరులో విశాలాంధ్ర విజ్ఞాన సమితి ద్వారా కొన్నేళ్ళ నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. విశాఖ పట్నంలో ప్రచురణకర్తలు రాష్ట్ర సాంస్కృతికశాఖ సహకారంతో ఇతర జిల్లా కేంద్రాల్లోనూ పుస్తక ప్రదర్శ నలు, మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఒక విషయం గుర్తుంచు కోవాలి. 1920 దశకంలో ఆనాటి మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర ప్రాంతంలో విశ్వవిద్యాలయం నెలకొల్పాలని సంకల్పించినప్పుడు ముందుగా విజయవాడ ప్రతిపాదన జరిగింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్రథమ కులపతిగా నియమించబడిన కట్టమంచి రామలింగారెడ్డి గారు బెజవాడను ఇంటలెక్చువల్ సహారాగా ఆ ప్రతి పాదనను తిరస్కరించారు. దీంతో విశ్వవిద్యాలయం విశాఖ పట్నం తరలి పోయింది. ఆయన అంతటితో ఊరుకోలేదు. విజయ వాడ పరిసరాల్లో అగ్రికల్చర్ తప్ప కల్చర్ లేదన్నారు. ఇప్పుడు రెడ్డిగారు చెప్పిన రెండు లోపాలు విజయవాడకు వర్తించవు. అప్పుడు విశ్వవిద్యాలయాన్ని కోల్పోయినట్టే 1953లో ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రాజధానిగా విజయవాడ ప్రతిపాదన వచ్చినప్పటికీ పాలక పార్టీ రాజకీయ ఒత్తిళ్ళ కారణంగా కర్నూలుకు తరలివెళ్ళింది. ఇప్పుడు ఆ లోటు కూడా తీరింది. సమైక్య రాష్ట్రం విభజనపర్యవసానంగా అమరావతి రాజధానిగా అటు గుంటూరు కాకుండా, ఇటు విజయవాడ కాకుండా మధ్య ప్రాంతం ఎన్నికయ్యింది. ఈ రాజధానిలో జరుగు తున్న నూతన సంవత్సర పండుగల్లో ఈ పుస్తక మహోత్సవం ఒకటి. మద్రాసులో డిసెంబర్‌లో మార్గళి (ధనుర్ మాసం)లో సంగీతోత్సవాలు ఘనంగా కొనసాగు తాయి. ప్రపంచవ్యాప్తంగా కర్ణాటక సంగీత అభిమా నులంతా ఈ కార్యక్రమాలకు వస్తుంటారు. 1927లో కాంగ్రెస్ సభలతోపాటు ప్రారంభించబడిన మ్యూజిక్ అకాడమీ ఏటేటా యిచ్చే 'సంగీత కళానిధి' బిరుదు సంగీతప్రియులకు భారత రత్న కన్నా గొప్పది. అలాంటి వాతావరణమే మన విజయ వాడలో నూతన సంవత్సర వేడుకల్లో పుస్తక తిరునాళ్లలా జరుగుతాయి. ఆంధ్రులు ఆరంభశూరులని ప్రతీతి. అందుకు అపవాదంగా పుస్తక మహోత్సవ నిర్వాహకులు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సహకారంతో ముఖ్యంగా విజ్ఞులైన ప్రజల ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న ఈ మహోత్సవాలు ఇలాగే నిర్విఘ్నంగా, దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షిద్దాం.

వ్యాస రచయిత : విశాలాంధ్ర పూర్వ సంపాదకులు

విశాలాంధ్ర

బతుకు The Life

మంగళవారం
01 జనవరి 2019



వెల్‌కమ్ 19!



సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు...పశ్చిమాన అస్తమిస్తాడు...అంతే షరా మామూలుగా ఏడాదుల రాకపోకలూ సాగిపోతుంటాయి. మరి కొత్త ఏడాది రోజున ప్రత్యేకించి విందులు...చిందులు...ఎందుకు? నిన్నటి నుంచి రేపటిలోకి....గతం నుంచి భవిష్యత్తులోకి....చేదు జ్ఞాపకాల నుంచి...వెలుగుల ఆశాకిరణాల వైపు నడిపించేది...చూపించేది....ఈ కొత్త ఏడాది రాక.

ఇలాంటి సందర్భంలో విందులు, వినోదాలు, వేడుకలు చేసుకోవడం సముచితమే.. కానీ ఆ జోష్ ఆ రోజునే చల్లారిపోతే...వీటికి అర్థమేముంది? నీ ప్రతిబింబం స్పష్టత నీవు చూసే అద్దం మీద ఆధారపడి ఉంటుంది...నీ భవిష్యత్ స్పష్టత నీ ఆలోచనా విధానం మీద ఆధారపడి ఉంటుంది... కొత్త ఏడాదిని మనం చూసే కోణమూ అంతే....చిమ్మ చీకటి గురుతులను చెరిపేస్తూ నులివెచ్చని లేలేత కిరణాలతో వెలుగుని అందిస్తాడు బాలభానుడు. సకల జనావళికి నిత్యనూతనత్వంతో గుడ్‌మార్నింగ్ చెబుతాడు. అంతే స్వచ్ఛంగా....అంతే స్పష్టంగా...అంతే నూతనోత్తేజంతో... జీవితాన్ని ఆస్వాదించగలిగితే అన్ని రోజులూ మనవే...అన్ని ఏడాదులూ...మనవే...క్షణాలు... నిముషాలుగా...నిముషాలు గంటలుగా...గంటలు రోజులుగా...రోజులు వారాలుగా...వారాలు నెలలుగా...నెలలు సంవత్సరాలుగా....నడిచిపోతూనే ఉంటాయి...గడిచిపోతూనే ఉంటాయి...కేలండర్‌లు మారుతూనే ఉంటాయి. కాలం ఎంత పెద్దదో...జీవితం అంత చిన్నది...వేగంగా సాగిపోయే కాలచక్రంలో మనకు ఎదురయ్యే ప్రతి క్షణాన్ని ఆస్వాదించగలిగితేనే నిండైన జీవితాన్ని పరిపూర్ణం చేసుకున్నట్టు. ఎన్ని ఏడాదులు వచ్చి వెళ్ళినా....ఇందుకు తగ్గ వాతావరణాన్ని మనం సృష్టించుకోగలుగుతున్నామా? అసలు మన జీవితాల్లో జీవం ఉందా? మనం జీవించడం మర్చిపోయి చాలా ఏళ్ళే అయ్యింది. ఏదో బ్రతుకుతున్నాం అంతే! బ్రతకడం వేరు, జీవించడం వేరు, బ్రతకడంలో ప్రాణం మాత్రమే ఉంటుంది. సంతృప్తిగా జీవించడంలో అనుభూతి ఉంటుంది. ఈ దిశగా మనుషుల్లో మార్పు రావాలి. "ప్రపంచం మారాలని మనం కోరుకోవడం కాదు...మార్పు మనతో మొదలైతే ప్రపంచం అదే మారుతుంది అంటారు"....ప్రఖ్యాత రచయిత లియో టాల్‌స్టాయ్. ఇలాంటి మంచి మార్పునకు 2019 పునాది కావాలి...."ఈ ప్రపంచంలో మిమ్మల్ని పూర్తిగా మార్చగలిగేది ఒక్కరే...అది ఎవరో కాదు...మీరే"....ఈ సత్యాన్ని గుర్తించేందుకు 2019 శ్రీకారం కావాలి...విలువలతో కూడిన జీవితానికి..... సంతృప్త జీవితానికి....అనుక్షణం ఆనందకరమయ్యే జీవితానికి...2019 నాంది కావాలి...అన్ని ఇళ్ళు ఆత్మీయాతా సుబంధాల లోగిళ్ళు కావడానికి 2019 మూలమవ్వాలి... ఆశావహ జీవితానికి అందరి హృదయాల్లో మొలకలు పుట్టిస్తున్న 2019కి స్వాగతం పలుకుదాం..!

అందరికీ జన్మదిన శుభాకాంక్షలు.... ఏంటీ తప్పు చెప్పాననుకుంటున్నారా? హ్యాపీ న్యూఇయర్ చెప్పాలింది....హ్యాపీ బర్త్‌డే చెప్పాననుకుంటున్నారా? కానే కాదు...ఈ రోజున అదే కొత్త ఏడాది ప్రారంభం రోజున అందరూ ఫీలయ్యేది ఇలానే కదా...ఎవరికి వారు వారి పుట్టినరోజు అన్నంత భావోద్వేగానికి లోనవుతుంటారు. అందరూ కాకపోయినా ఎక్కువమంది భావన ఇలానే ఉంటుంది. కారణం...ఈరోజు నుంచి సరికొత్తగా జీవితం ప్రారంభించాలనుకుంటారు. ఇప్పుడు ఒప్పుకుంటారా? హ్యాపీ బర్త్‌డే చెప్పడం సబబేనని. అందరి మాదిరిగానే మీరూ...కొత్త ఏడాది ప్రారంభం రోజున కొత్త నిర్ణయాలు, కొత్త తీర్మానాలు చేస్తున్నారా? ఈ కొత్త ఏడాది తీర్మానాల గురించి, వాటిని అమలు చేసే పద్ధతులు, ప్రణాళికల గురించి పత్రికలు, మీడియా హోరెత్తిస్తూనే ఉంటాయి. ఇంతకుమించి కొత్తగా చెప్పుకోవడానికి ఏమీ లేదు గానీ...ఎప్పుడూ చెప్పుకునేవే అయినా...మరొక్కసారి గుర్తు చేసుకుందాం. మంచి జీవితానికి అవసరమైన మంచి మార్పుల గురించి మరోసారి మననం చేసుకుందాం. రోజు మారినా...ఏడాది మారినా...మనుషుల దృక్పథంలో మార్పు రానంతవరకూ...చెప్పుకోవలసిన విషయాల గురించి మరోసారి చెప్పుకుందాం...నేటి వాతావరణానికి....మంచి జీవనశైలికి కావలసిన, చేయవలసిన పనుల గురించి మరొక్కసారి మాట్లాడుకుందాం.

– ఎస్వీ జ్యోతి



అలవాట్లు...అవసరాలు



- బద్ధకాన్ని వదిలేయండి
- ఆలస్యాన్ని నివారించండి
- ఏకాగ్రతను సాధించండి
- దూరదృష్టిని పెంచుకోండి.
- ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేయండి
- టీవీ చూడడం తగ్గించేయండి
- పుస్తక పఠనాన్ని పెంచుకోండి.
- కొత్త స్నేహితులను సంపాదించుకోండి
- సోషల్ మీడియా సమయాన్ని కుదించేయండి
- వీడియో గేమ్‌లకు స్వస్తి చెప్పండి
- ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోండి
- సవాళ్ళను స్వీకరించండి
- భయాలను ఎదుర్కోండి
- మానవత్వం, దాతృత్వం పెంచుకోండి
- స్వచ్ఛందంగా సహాయం చేయండి.
- మర్యాదను అలవర్చుకోండి
- భావోద్వేగాలను అదుపులో ఉంచుకోండి
- ఒత్తిడికి దూరంగా ఉండండి
- సంతోషాన్ని అందిపుచ్చుకోండి
- ఇంటి పరసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచండి
- స్నేహితులు, ప్రియతములతో మీ సంబంధాలను మరింత బలపర్చుకోండి
- సందేశాలు తగ్గించి నేరుగా మనుషులతో మాట్లాడండి



- డైరీ రాయడం ప్రారంభించండి
- మీలోని సృజనాత్మకతకు పదునుపెట్టండి, బయటపెట్టండి
- భాగస్వామితో, కుటుంబంతో ఎక్కువ సమయం గడపండి
- మరింత చురుకుగా ఉండేందుకు ప్రయత్నించండి.
- కళలు, సంగీతాన్ని ఆస్వాదించండి.
- సంస్కృతిని పాటించండి
- వీలైనన్ని కొత్త ప్రదేశాలు చుట్టి రండి
- మనోబలాన్ని సుస్థిరం చేసుకోండి.

ఆర్థికం...అవసరాలు



- పొదుపు, మదుపు ఉండాలి
- షాపింగ్‌లు తగ్గించండి
- కూపన్ల మాయలో పడిపోవద్దు
- కావలసినంతే తినండి
- ఇంటి భోజనానికే ప్రాధాన్యతనివ్వండి.
- అదనపు డబ్బు సంపాదనా మార్గాలు అన్వేషించండి
- అవసరాలకు సరిపడ ఆదాయార్జన ఉండాలి
- ఇంటి బడ్జెట్ వేసుకోవాలి
- అనవసర ఖర్చులు నియంత్రించుకోవాలి
- వర్షాకాలం లేదా అత్యవసరాల్లో అదనపు డబ్బు కోసం ప్రత్యేక పొదుపు ఉండాలి
- క్రెడిట్ కార్డు బిల్లులు సకాలంలో చెల్లించండి
- రుణాలు తగ్గించుకోండి
- మీ క్రెడిట్ స్కోరుపై పర్యవేక్షణ ఉండాలి.
- ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లించేయండి
- రిటైర్‌మెంట్ ప్లాన్ వేసుకోండి.
- పెట్టుబడుల సమతుల్యత చూసుకోండి
- ఇన్వెస్ట్‌మెంట్‌ల మీద అవగాహన పెంచుకోండి
- ఆరోగ్య బీమా తీసుకోండి
- జీవితా బీమా తప్పనిసరిగా ఉండాలి.
- ఆర్థిక సవాళ్ళను ఎదుర్కొనేందుకు నిపుణుల సలహాలు పాటించండి.

ఆరోగ్యం...అవసరాలు

- మరిన్ని నీళ్ళు తాగండి
- మెట్లు ఎక్కడం, దిగడం చేయండి
- వైద్యుల పర్యవేక్షలో ఉండండి.
- కంటి పరీక్షలు చేయించుకోండి
- జిమ్‌లో చేరండి
- ఫిట్‌నెస్ మీద అవగాహన పెంచుకోండి
- స్మోకింగ్, డ్రింకింగ్ వదిలేయండి
- ఆహార నియమాలు పాటించండి
- సోడా, కార్బొనేటెడ్ డ్రింక్‌లకు దూరంగా ఉండండి
- అనారోగ్యకరమైన ఆహారాన్ని వదిలేయండి
- పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకోండి
- ఆహారాన్ని మింగేముందు బాగా నమలండి
- తీపికి స్వస్థి చెప్పండి
- రోజూ నడవండి
- శక్తిమేర పరుగు పెట్టండి, మారథాన్‌లలో పాల్గొనండి
- నోటిని శుభ్రంగా ఉంచుకోండి
- తగినంత నిద్రపోండి
- ఆందోళన తగ్గించుకోండి
- రాత్రివేళ, నిద్రకు ముందు ఎలక్ట్రానిక్ వస్తువులకు దూరంగా ఉండండి
- ఒత్తిడిగా ఉన్నప్పుడు ఒక్కసారి దీర్ఘశ్వాస తీసి వదలండి



ప్రకృతి...అవసరాలు

- పచ్చదనాన్ని పెంచండి
- మొక్కలు నాటండి
- నీటిని పొదుపు చేయండి
- వృక్షాలను తొలగించకండి
- ప్లాస్టిక్ వాడకాన్ని బాగా తగ్గించండి
- గాలి కాలుష్యం, శబ్ధ కాలుష్యాన్ని నివారించండి
- భూతాపాన్ని తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టండి
- ఇళ్ళల్లో ఫ్రిజ్‌లు, ఏసీల వాడకాన్ని తగ్గించండి
- ప్రతి ఇంట్లో మొక్కలు ఉండేలా చూడండి
- తోటి జీవరాశులను బతకనివ్వండి
- రసాయన ఎరువుల వాడకాన్ని ఆపండి
- పంటలకు అనువైన వాతావరణాన్ని సృష్టించండి
- చుట్టూ ఉన్న పరిసరాలను అపరిశుభ్రం చేయకండి
- అరుదైన జీవులను కాపాడండి
- సమస్త జీవరాశుల మనుగడకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించండి.

దేశానికో....ఏడాది!

❑ **షోగస్తు :** ది జపాన్ నూతన సంవత్సరం పేరు. 1823 నుంచి జపనీయులు దీనిని ఆచరిస్తున్నారు. అంతకుముందు వారు చైనీస్ లునార్ కేలండర్‌ని అనుసరించి ఈ పండగ చేసుకునేవారు.

❑ **నోవీ గాడ్ :** ఇది రష్యన్ల నూతన సంవత్సరం. 18వ శతాబ్దంలో క్రిస్టియన్ల శకం ప్రారంభమయ్యేవరకూ వారు సెప్టెంబరు 1వ తేదీన ఈ పండగను జరుపుకునేవారు. ఇప్పుడు జనవరి నెలలోనే ఈ పండగ చేసుకుంటున్నారు.

❑ **టీటీ :** ఇది వియత్నాం మత, సాంస్కృతిక, జాతీయ నూతన సంవత్సరం. దీనిని వారు జనవరి లేదా ఫిబ్రవరిలో జరుపుకుంటారు. వియత్నామీస్ కేలండర్‌ని అనుసరించి గత ఏడాది జనవరి 28వ తేదీన దీనిని జరుపుకున్నారు.

❑ **సోల్లాల్ :** కొరియన్ల న్యూ ఇయర్ దే ఇది. కొరియన్ లూనార్ కాలండర్ ప్రకారం కొత్త లూనార్ సంవత్సరంగా దీనిని జరుపుకుంటారు. గత ఏడాది కొరయన్లు జనవరి 28వ తేదీన ఈ పండగ జరుపుకున్నారు.

❑ **చున్ జియే :** చైనీస్ లూనార్ కేలండర్‌ని అనుసరించి జరుపుకునే కొత్త సంవత్సరమే ఈ చున్ జియే. గ్రెగేరియన్ కేలండర్ ప్రకారం వారికి ఈ పండగ జనవరి 21, ఫిబ్రవరి 20 మధ్య వస్తుంది.

❑ **సగాన్ సార్ :** ఇది మంగోలియన్ల కొత్త ఏడాది. మంగోలియన్ లూనార్ కేలండర్‌ను అనుసరించి వారు ఈ పండగ చేసుకుంటారు. గత ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన వారికి కొత్త ఏడాది ప్రారంభమైంది.

❑ **ఖాబ్ నిసాన్ :** అస్సీరియన్ల కొత్త సంవత్సరం ఇది. వసంతం ప్రారంభమయ్యే వేళ ఏప్రిల్ ఒకటో తేదీన ఈ పండగను వారు జరుపుకుంటారు.

❑ **నౌరుజ్ :** ఇరానియన్ల కొత్త సంవత్సరం నౌరుజ్. మతపరమైన, జాతిపరమైన, అంతర్జాతీయ ఇరానియన్ డేగా దీనిని వారు జరుపుకుంటారు. ఏటా మార్చి 20 లేదా 21వ తేదీన ఈ పండగ వస్తుంది.

❑ **సాంగ్‌క్రాన్ :** థాయ్‌లాండ్ న్యూ ఇయర్ డే సాంగ్‌క్రాన్. ఏప్రిల్ 13, 14 తేదీల్లో రెండు రోజులపాటు ఈ వేడుకలు చేసుకుంటారు. బుద్ధిస్ట్ లేదా హిందూ సోలార్ కేలండర్‌ని అనుసరించి వారు కొత్త ఏడాది ప్రారంభ రోజును నిర్ణయించుకుంటారు.

❑ **అలుత్ అవురుద్ద :** శ్రీలంకవాసులు చేసుకునే కొత్త సంవత్సరం పేరు ఇది. సోలార్ కేలండర్‌ని అనుసరించి ఏప్రిల్ 13న ఈ పండగ చేసుకుంటారు.

❑ **వైశాఖి :** పాకిస్తాన్ ప్రజల న్యూ ఇయర్ డే ఈ వైశాఖి. వసంతం ప్రారంభమయ్యే వేళ ఏప్రిల్ 13నే వారి కొత్త సంవత్సరమూ ప్రారంభమవుతుంది.

❑ **చౌల్ చాన్ త్మే :** కంబోడియన్ల కొత్త సంవత్సరం ఇది. ఏప్రిల్ 13 నుంచి మూడు రోజులు ఈ కొత్త సంవత్సర వేడుకలు జరుగుతాయి.

❑ **ఎన్‌కుతతాష్ :** ఇథోపియన్ న్యూ ఇయర్ డే. గ్రెగేరియన్ కేలండర్ ప్రకారం సెప్టెంబరు 11న ఈ పండగ చేసుకుంటారు.

❑ **రోష్ హషనా :** జెవిష్ న్యూఇయర్ డే. సెప్టెంబరు 20న వారు ఈ పండగ చేసుకుంటారు.

❑ **హిజ్రి :** ఇస్లామిక్ లూనార్ కేలండర్ ప్రకారం జరుపుకునే కొత్త సంవత్సరం పేరు హిజ్రి. గత ఏడాది ముస్లిమ్‌లు సెప్టెంబరు 22వ తేదీన ఈ పండగ జరుపుకున్నారు.

నేను - సుడిగుండం (నవల) 2

పి. చంద్రశేఖర్ ఆజాద్
సెల్: 92465 73575



"మా చెల్లెలు నిద్ర చేయటానికి మా ఊరు వస్తుంది. మేం మాట్లాడు కుంటాం" అన్నారు.

"మనింటికి వెళ్దాం బుల్లమ్మాయ్" అనీ నరసయ్య మావయ్య అన్నాడు.

"ఇప్పటికి అన్నయ్యలు వచ్చారు. అందుకు ఏదయినా కారణం కావచ్చు. వాళ్లని కాదనటం ఎందుకు? అయినా సంప్రదాయం ప్రకారం అన్నల ఇంట్లో నిద్ర చేయాలి. వెళ్లి వస్తాను" అని నరసయ్య మావయ్యను ఒప్పించింది.

అక్కడ ఏం జరిగిందో తెలియదు. అమ్మ వారింటికి వెళ్లటం అదే చివరిసారి అయింది. ఆ తర్వాత అమ్మను ఎన్నోసార్లు ఏం జరిగిందని అడిగినా "ఏదో అయిందిలే. ఇప్పుడు అవన్నీ అనవసరం" అనేది.

అప్పుడు నరసయ్య మావయ్య వచ్చాడు.

"ఆ రోజు చెప్పాను - మీకు నేనున్నానని. నాకు పిల్లలు లేరు. నాకు కొడుకయినా అల్లుడయినా వీడే. మనింటికి వెళ్లిపోదాం" అన్నాడు.

అమ్మ ఒప్పుకోలేదు. "నువ్వు మీ అన్నయ్యల గురించి భయపడుతున్నావా?" అన్నాడు.

"నేను ఎందుకు భయపడాలి. వాళ్లు ఇంతకు మించి నాకు చేయగలిగిన అపకారం ఏముంటుంది. కూలో నాలో చేసి నా కొడుకుని పెంచుకుంటాను. ఇప్పటికే మీ బావ కోసం చాలా ఖర్చు చేసావు"

"అలా మాట్లాడితేనే బాధగా వుంటుంది. ఆయన్ని కాపాడుకోలేకపోయాం. నా అల్లుడు కూలి పనులు చేయకూడదు. బాగా చదువుకోవాలి. పదిమందికి ఉపయోగపడాలి. నా కళ్లతో అది చూసుకోవాలి" అన్నాడు.

అమ్మ ఈ విషయం నాకు చెప్పినప్పుడు లేత వయసులో రకరకాల భావాలు కలిగాయి. మావయ్య నాకు నాయకుడిలా కనిపించాడు. గురువులా దర్శనం యిచ్చాడు. అమ్మ మొత్తానికి ఒప్పుకుంది.

అలా నరసయ్య మావయ్య ఇంటికి మారాం.

"ఇదెంత కాలం నడుస్తుందో చూస్తాం. మమ్మల్ని అల్లరి చేయటానికి తప్ప ఇంకెవరికి భర్తలూ చావటం లేదా? ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు. ఎవరి బతుకులు వారు బతకాలి. వాడికి తనే మంచివాడ్ని అనిపించుకోవాలని తాపత్రయం" అనారంట మావయ్యలు.

ఇది తెలిసినప్పుడు అమ్మ ఏడ్చింది. లోకంలో ఇలాంటి అన్నయ్యలు కూడా వుంటారా అని!

- - - -

ఓ రోజు మావయ్య అమ్మని అడిగాడు.

"నీకు మళ్లీ పెళ్లి చేయాలని వుంది. ఇప్పటికిప్పుడు నిన్ను చేసుకోమనటం లేదు. ఓ ఆలోచన కోసం చెబుతున్నాను"

"ఇందులో ఆలోచించుకోవటానికి ఏమీ లేదనయ్యా" అంది అమ్మ. "నీ వయసెంతమ్మా! బతికినంత కాలం ఒంటరిగా ఎలా వుంటావు?" "నాకో అబ్బాయి వున్నాడు"

"నేను కాదనటం లేదు. ఆడవారికయినా, మగవారికయినా ఓ తోడు కావాలి. వాటికి దూరం అయినవారు ఏదొక రోజు బాధ పడతారు"

"తోడంటే భర్తేనా అన్నయ్యా?" అంది అమ్మ..

"మనకి అనేకమంది తోడుగా వుండవచ్చు. ఆ బంధం వేరు. భార్యా భర్తల బంధం వేరు బుల్లమ్మాయ్"

అమ్మ మాట్లాడలేదు.

"నువ్వు అల్లుడి గురించి ఆలోచించొద్దు. నీ పెళ్లికి వాడు అడ్డుకాకూడదు. మా దగ్గర వుంటాడు. నువ్వు కొత్త జీవితం మొదలు పెట్టాలి"

"అసలు నాకు పెళ్లే చేయకపోతే ఒక్కదాన్నే వుండేదాన్ని కదా" మామయ్య మాట్లాడలేకపోయాడు.

"భర్తను పోగొట్టుకున్న నన్ను పెళ్లి చేసుకోవటానికి ఎవరయినా ముందుకు రావచ్చు. అలాంటివారు నా కొడుకుని దూరంగా వుంచాలి అంటే నేను భరించలేను. అయినా లోకం గురించి నాకు బాగా తెలియకపోయినా ఇలాంటి 'పెళ్లిళ్లు చేసుకునేవారికి తోడు' కంటే చాకిరి చేయటానికి పని మనుషులు కావాలి. అదేదో నేనే చేసుకుని నా కొడుకుని పెద్దవాడిగా చేయటంలో తృప్తి వుంటుంది"

"మనం తర్వాత మాట్లాడుకుందాం బుల్లమ్మాయ్. ఇప్పుడు ఏం చెప్పినా నీకు అర్థం కాదు"

"అదేం లేదు అన్నయ్యా. ఇంతకు ముందు తోడబుట్టినవారు ఇద్దరు కలిసి బతకాలంటే ప్రేమ కావాలి. నమ్మకం కావాలి అన్నారు. అంతకు ముందు మీ బావగారు నాకు తెలియదు. అయినా పెళ్లి చేసుకున్నాక ఆయనకు మించి నాకెవరూ లేరనుకున్నా. ఇప్పుడు ఆ ప్రేమ నా కొడుకు మీద వుంది. వాడికి మించినదేదీ నాకు వద్దు. నేను నా కొడుకు కోసం బతుకుతాను. అసలు పెళ్లే చేసుకోని ఆడపిల్లలున్నారు. ఈ విషయం గురించి మనం ఇంకెప్పుడూ మాట్లాడుకోవద్దు" అంది.

మావయ్య చిన్నగా తలూపాడు.

ఆ తర్వాత 'పెళ్లి' గురించిన సంభాషణ వారి మధ్య జరగలేదు.

- - - -

మేం మావయ్యగారి ఊరు మారాం. అయితే వారితో పాటు కలిసి ఒకే ఇంట్లో వుండటానికి అమ్మ ఒప్పుకోలేదు. చిన్న ఇల్లు చూసి పెట్టాడు మావయ్య. ఏదొక పని చేస్తుండేది. ఇంట్లోకి కావల్సిన బియ్యం, ఉప్పులూ, పప్పులూ తనే పంపించేవాడు. అమ్మ వద్దని మొదట్లో నిరాకరించింది.

"పెళ్లి విషయంలో నీ మాట నేను కాదనలేదు. విడిగా వుంటాను అన్నావు. సరే అన్నాను. ఇంతకు మించి నీ మాట నేను వినను. మేనల్లుడ్ని నా ఇంట్లో కొడుకుగా పెంచుకోవాలనుకున్నాను. కొడుకు మీద తల్లికే అధికారం. కొన్ని విషయాల్లో నన్ను కాదనకు" అన్నాడు. .

పేరుకి విడిగా వుంటున్నాం తప్ప నేను మావయ్య దగ్గరే ఎక్కువసేపు వుండేవాడిని.

నాతో అక్షరాలు దిద్దించింది మావయ్య. నన్ను ఎత్తుకుని గోరు ముద్దలు తినిపించింది అత్తయ్యా, మావయ్య.

మావయ్యతో పాటు నేను చేల దగ్గరకు వెళ్లాను. చెట్ల మీదకి ఎలా ఎక్కాలో, ఈత ఎలా కొట్టాలో తాను నేర్పించాడు. నాకు పశువుల మీద ప్రేమను పెంచాడు. వానాకాలం - చలికాలం - ఎండాకాలంలో చిన్నపాటి జ్వరాల నుండి అన్ని అనుభూతులూ పొందాను మావయ్య దగ్గర,

మావయ్య మంచి భక్తుడు. ఆ ఊర్లో పండగలప్పుడు - ఉత్సవాలప్పుడు చురుగ్గా పని చేసేవాడు. నన్ను ఆటలు ఆడించేవాడు. అన్ని కులాల వారి దగ్గరకు తీసుకు వెళ్లేవాడు. ఒక్కొక్కరిది ఒక్కో జీవన విధానం. ఒకే భాష అయినా మాట తీరులో ఎంతో వైవిధ్యం వుండేది.

ఆయనకు తెలిసిన విషయాలను నాకు చెప్పేవాడు.

మావయ్యది గొప్ప ఆర్థిక స్థితి కాదు. మూడెకరాల భూమి వుండేది. అయినా ఎలాంటి కూలి పనులయినా స్వయంగా చేసుకునేవాడు. స్థూలంగా చెప్పాలంటే మనుషులకు స్వార్థం అసలు వుండకూడదని మావయ్య అనరు. ఎంత తక్కువ స్థాయిలో వుంటే అంత మంచిది అని ఆయన అభిప్రాయం.

మావయ్యనీ మీంచిన రోల్ మోడల్ అప్పట్లో నాకు ఇంకెవరూ లేరు.

"మనం మావయ్యకి రుణపడిపోతున్నాం నాన్నా. నువ్వు ఎప్పుడు పెద్దవాడి వవుతావో, మావయ్య రుణం ఏం చేసి తీర్చుకుంటావో నాకు తెలియదు" అని అమ్మ అంటుండేది.

అమ్మను బుల్లమ్మాయ్ అని పిలుచుకున్నా అసలు పేరు 'తులసి' అప్పుడు నాకు ఆరు సంవత్సరాలు దాటాయి. నేను బడి నుండి ఇంటికి వస్తున్నాను. రచ్చబండ దగ్గర వున్న ఇద్దరు పెద్దమనుషులు నన్ను పిలిచారు.

"అబ్బాయి నీ మంచి రోజులన్నీ అయిపోతున్నాయి రా" అన్నారు. అప్పుడు నా ముఖం చూసి పక్కనాయన నవ్వాడు.

"ఏం జరిగిందండి" అన్నాను. "మెల్లగా తెలుస్తుందిలే... వెళ్లు" అన్నారు.

నేను సరాసరి మావయ్య దగ్గరకు వెళ్లి ఆయన్ని చూడాలనుకున్నాను. నా మనసులో ఎప్పుడూ చావు గురించిన ఆలోచనలే. నాన్నలాగే అమ్మకో, మావయ్యకో ఏదొక జబ్బు చేసి వాళ్లు చనిపోతారేమో అనిపించేది.

బడి నుండి ఇంటికి వెళ్తే అలాంటి దృశ్యం చూడాల్సి వస్తుందేమో అని భయం. అప్పుడు నాకు తెలియకుండా దుఃఖం వచ్చేది. అలాంటి సమయాల్లో ఒంటరిగా కూర్చుని నాలో నేను ఏడ్చేవాడ్ని.

అమ్మా, మావయ్యలు లేని ప్రపంచాన్ని వూహించటానికి నాకు భయం కలిగేది. నేను ఎలా బతకాలి వాళ్లు లేకుండా అని తల్లడిల్లి పోయేవాడిని.

అప్పుడే ఓ నిర్ణయం తీసుకున్నాను. అలాంటిది జరిగితే నేను కూడా చచ్చిపోవాలి అనుకున్నాను. అలా అనుకున్నాక ఇంకా భయం కలిగింది. చావటం ఎలా? బావిలో దూకా, చెరువులోనా? ఇంకెలా? అవన్నీ తర్వాత - నేనయితే ఈ ప్రపంచంలో వుండకూడదు.

అప్పటికే పట్టుక ఎంత కష్టమో కొంతవరకు తెలుసు. ప్రాణాలు తీసుకోవటం అంతకు మించిన కష్టం అని అర్థమైంది.

నేను అప్పుడప్పుడు నాదయిన దుఃఖ ప్రపంచంలో వుండటాన్ని చూసినవారు మావయ్యకి చెప్పారు.

ఆ రోజు నన్ను చేను దగ్గరికి తీసుకెళ్లాడు. "మీ నాన్న గుర్తిస్తున్నాడా?" మావయ్య ఎందుకలా అడిగాడో నాకు తెలియదు.

"మీ నాన్నను నువ్వు చూసినా నీకు గుర్తుండదు. నీ తోటి పిల్లలందరూ వారీ నాన్నలతో మాట్లాడుతుంటే నీకు నాన్న లేని లోటు తెలుస్తుంది. ఏడుపు వస్తుంది. మనుషులందరూ ఎల్లకాలం వుండరు. నీకు వరసకి నేను మావయ్యని గాని నీ తండ్రిలాంటి వాడిని" అన్నాడు.

అప్పుడు నా శరీరంలో ఓ గగుర్పాటు. ఒక్కసారిగా నాలో నుండి వేడి సెగలు వచ్చినట్లు ఇంకా గుర్తు.

"అందరు మనుషులు ఏడవలేరు. అది చిన్న విషయం కాదు. నేను బతికున్నంత వరకూ నువ్వు ఏడవకూడదని నేను అనుకుంటాను. మీ నాన్నని నీకు తెచ్చివ్వలేను. ఆయన నీకు ఇవ్వగలిగిన ప్రేమనీ, రక్షణని, నమ్మకాన్ని నేను ఇవ్వగలను" అన్నాడు.

కొన్ని మాటలు అవి మంచివయినా, చెడ్డవయినా మన మీద తీవ్రంగా ప్రభావం చూపిస్తాయి అని అప్పటి నుండి తెలుస్తోంది.

"మీ అమ్మది ఇంకా దుఃఖం. నీకోసమే తను బతుకుతోంది. అంతకుమించి ఏ సుఖమూ లేదు. ఇది నువ్వు గుర్తుంచుకోవాలి అని కూడా అన్నాడు.

అప్పుడనుకున్నాను. ఇంకెప్పుడూ లోకానికి తెలిసేలా ఏడవకూడదని.

"మనుషులు ఎంత సున్నితంగా వుండాలో, కొన్ని విషయాల్లో అంత కఠినంగా వుండాలి. అసలు మనం పుట్టింది ఏదో రకంగా పెరిగి చనిపోవటానికి కాదు. మనం చేయాల్సింది చాలా వుంది. అది ఎలానో ముందు ముందు నీకు తెలుస్తుంది" అన్నాడు.

ఇప్పుడు మంచి రోజులు కరిగిపోవటం ఏంటో నాకు తెలియటం లేదు. అయినా మావయ్యకు ఆరోగ్యం బాగుండకపోతే వాళ్లకి నవ్వు ఎలా వస్తుంది?

నేను పరుగు తీసుకుంటూ అమ్మ దగ్గరకు వెళ్లాను.

అమ్మ ముఖంలో సంతోషం కనిపిస్తుంటే ఏం జరిగిందో తెలియక వెర్రి చూపులు చూస్తున్నాను.

"మీ మావయ్య నాన్న అవుతున్నాడు" అంది అమ్మ.

ఆ పెద్దమనుషుల మాటలకి, మావయ్య తండ్రి అవటానికి పొంతన కుదరటం లేదు.

"వదిన్ని చూస్తే నాకు బాధగా వుండేది. ప్రతి ఆడవారు తల్లి కావాలని కోరుకుంటారు. అది జరగనప్పుడు లోకంలో ఎన్నో రకాలుగా కొందరు మాటల్లో బాధ పెడతారు. అలాంటివి నేను విన్నాను. లక్ష్మి అత్తదో బాధ. నాదో బాధ. ఇప్పటికి దేవుడికి దయ కలిగింది. నీతో ఆడుకోవటానికి బాబో, పాపో వస్తున్నారు"

(ఇంకా ఉంది)

లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ రంగాల్లో జోరుగా ఉద్యోగాలు



ప్రస్తుత కాలంలో కోరుకున్న సమయానికే నిమిషాల్లోనే వినియోగదారుల ఇంటికే ఫుడ్ డెలివరీ అవుతోంది. ఆర్డర్ ఇవ్వగానే మొబైల్ ఫోన్, టీవీ, ఫ్రిజ్‌లే కాదు.. కూరగాయలు సైతం పొలం నుంచి తిన్నగా మనకు ఎలా అందుతున్నాయో తెలుసా..! ఇవన్నీ లాజిస్టిక్స్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ ద్వారానే సాధ్యమవుతోంది. ఒక వస్తువును ఉత్పత్తి చేసిన చోటు నుంచి అంతిమ వినియోగదారులకు చేరవేసేదాకా.. ప్రతి చిన్నా, పెద్ద కంపెనీలో ప్రతి అడుగులోనూ లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా ఈ-కామర్స్, రిటైల్ రంగం వేగంగా విస్తరిస్తూ.. ప్యాకింగ్ పర్సన్స్ నుంచి ప్రొక్యూర్‌మెంట్ హెడ్ వరకు.. అనేక రకాల కొలువులకు వేదికగా మారుతోంది. ఈ నేపథ్యంలో లాజిస్టిక్స్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ రంగంలో ఉద్యోగాలు, అర్హతలు, అందిపుచ్చుకునే మార్గాల గురించి తెలుసుకుందాం....

ఈ-కామర్స్, రిటైల్ రంగమే కారణమా?

లాజిస్టిక్స్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ విభాగం భారీ సంఖ్యలో ఉద్యోగాలకు మార్గం వేస్తోంది. ఇటీవల కాలంలో లాజిస్టిక్స్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఉద్యోగాలకు ఈ-కామర్స్, రిటైల్ రంగాల విస్తరణే ప్రధాన కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ కామర్స్, రిటైల్.. రంగం రోజురోజుకూ విస్తరిస్తోంది. అమెజాన్ వంటి పెద్ద పెద్ద బహుళజాతి సంస్థల నుంచి టెక్నాలజీ ఆధారిత ఫుడ్ డెలివరీ స్టార్టప్స్ వరకూ... ఐకియా వంటి భారీ కంపెనీల నుంచి స్థానిక సూపర్ మార్కెట్‌ల దాకా... ఈ కామర్స్, రిటైల్ రంగాలు దూసుకుపోతున్నాయి.

మరోవైపు వినియోగదారుల కొనుగోలు దృక్పథంలోనూ మార్పులు వస్తున్నాయి. నేటి బిజీ బిజీ జీవితంలో సమయాభావం, నేరుగా షాప్‌లకు వెళ్లే తీరిక లేని వాళ్లు.. ఆన్‌లైన్ పోర్టల్స్‌లోనే తమకు కావల్సినవన్నీ ఆర్డర్ చేస్తున్నారు. ఈ కామర్స్ కంపెనీల పుణ్యామాని అవి క్షణాల్లో నేరుగా గుమ్మం ముందుకే వస్తున్నాయి. అందుకే గత రెండేళ్లుగా ఆన్‌లైన్ కొనుగోళ్ల ధోరణి వేగంగా పెరుగుతోంది. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం-ఆయా వస్తువుల కొనుగోలు పరంగా ఈ-కామర్స్ సంస్థల వాటా దాదాపు 40 శాతం మేరకు ఉండటమే ఇందుకు నిదర్శనం. మరోవైపు ఆఫ్‌లైన్ విధానంలో రిటైల్ ఔట్‌లెట్స్ సైతం నిర్ణీత మొత్తంలో కొనుగోలు చేస్తే హోమ్ డెలివరీ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. లాజిస్టిక్స్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ ద్వారా ఈ-కామర్స్, రిటైల్ రంగ కంపెనీలు వినియోగదారులకు చేరువవుతున్నాయి.

డ్రైవర్, డెలివరీ బాయ్ నుంచి...

ఈ-కామర్స్, రిటైల్ సంస్థలు వినియోగదారులకు మరింత వేగంగా 'చేరువ' కావాలని ప్రణాళికలు రచిస్తుండటంతో లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు పుట్టుకొచ్చేందుకు వీలుకలుగుతోంది. దిగువ స్థాయిలో ప్రొడక్ట్ ప్యాకింగ్, డ్రైవర్, డెలివరీ బాయ్ మొదలు.. అత్యున్నత స్థాయిలో ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్స్, సప్లయ్ చైన్ అనలిస్ట్, ఆపరేషన్స్ మేనేజర్, అనలిస్ట్ వరకు పలు రకాల ఉద్యోగాలు లభిస్తున్నాయి. అర్హతలు, జాబ్ ప్రొఫైల్ ఆధారంగా నెలకు రూ. 8వేల నుంచి రూ.లక్ష వరకు కూడా వేతనం లభిస్తోంది.

వాస్తవానికి ఒక ఉత్పత్తిని తయారు చేయడం ఎంత ముఖ్యమో.. దాన్ని కొనుగోలు చేసిన వ్యక్తికి సరైన సమయంలో చేర్చడం అంతకంటే ప్రధానం. అప్పుడే సంస్థపై నమ్మకం, భవిష్యత్తులో సదరు వినియోగదారుడు ఏదైనా వస్తువు కొనాలంటే.. తమ సంస్థవైపే మొగ్గు చూపుతాడు. అందుకే లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ విభాగాలను ఆయా సంస్థలు అత్యంత పటిష్టంగా రూపొందిస్తున్నాయి. ఎక్కడా తేడా రాకుండా.. అనుకున్న సమయానికే ఆర్డర్ చేసిన వినియోగదారుడికి వస్తువు చేరేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నాయి. ఫలితంగా ఈ విభాగాల్లో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. పదోతరగతి, ఇంటర్మీడియెట్, సంప్రదాయ డిగ్రీ కోర్సులు, ఇంజనీ రింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు, ప్రత్యేక కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు.. ఇలా ఆయా అర్హతలకు తగినట్లు ఉద్యోగాలు సంపాదించుకునే అవకాశం లాజిస్టిక్స్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ రంగంలో ఉంది.

లాజిస్టిక్స్ :

వనరులు, వస్తువులు, సమాచారం, సేవలను... వాటి ఉత్పత్తి స్థానం నుంచి అవసరమైన వినియోగదారుడికి అందించే ప్రక్రియ నిర్వహణనే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ అంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. వస్తువులు తయారైన చోటు నుంచి అంతిమంగా కస్టమర్స్‌కు చేరవేయడమే లాజిస్టిక్స్. ఇందులో వస్తువులను నిల్వచేయడం (వేర్‌హౌసింగ్), రవాణా (ట్రాన్స్ పోర్టేషన్), అందజేయడం(డెలివరీ) వంటి ప్రక్రియలు ఎంతో కీలకమైనవి.

లాజిస్టిక్స్‌లో ఇన్‌బౌండ్ లాజిస్టిక్స్, అవుట్‌బౌండ్ లాజిస్టిక్స్ అని రెండు రకాలు. ఉదాహరణకు ఒక కారు తయారీ కంపెనీ... కొత్త కారును తయారుచేయడం కోసం ఇంజన్, టైర్లు, గేర్ సిస్టమ్, బాడీ పార్ట్స్ వంటి విడి భాగాలను ఆయా పరికరాల తయారీదారుల నుంచి కొనుగోలు చేస్తుంది. వీటిని కారు మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ ప్లాంట్‌కు రవాణా(ట్రాన్స్‌పోర్టేషన్) చేసి.. అక్కడ నిల్వ (వేర్‌హౌసింగ్) ఉంచి.. విడిభాగాలన్నింటిని అమర్చి (అసెంబ్లింగ్) కారు తయారు చేసే ప్రక్రియనే ఇన్‌బౌండ్ లాజిస్టిక్స్ అంటారు. ఇలా తయారైన కారును కంపెనీ నుంచి డిస్ట్రిబ్యూటర్‌కు తరలించడం.. అక్కడి నుంచి అమ్మకాలు జరిపే డీలర్ షాప్‌కు రవాణ చేయడం.. అక్కడి నుంచి కారు కొన్న అంతిమ వినియోగదారునికి చేరవేయడాన్ని.. అవుట్‌బౌండ్ లాజిస్టిక్స్ అని పేర్కొంటున్నారు. ఈ మొత్తం ప్రక్రియ జరగాలంటే... వివిధ స్థాయిలో ప్యాకింగ్ సిబ్బంది నుంచి డ్రైవర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, వేర్‌హౌస్ మేనేజర్, ఇన్వెంటరీ మేనేజర్ వరకూ.. సంబంధిత నైపుణ్యాలున్న మానవ వనరుల సేవలు తప్పనిసరి.

లాజిస్టిక్స్‌లో ఉద్యోగాలు

ప్యాకింగ్ పర్సన్స్ :

ఒక ప్రొడక్ట్‌ను ఒక ప్రదేశం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేసే సమయంలో ఎలాంటి డ్యామేజ్ జరగకుండా చూడాలి. దాంతోపాటు వినియోగదారులను ఆకట్టుకునేలా అందంగా, ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేయడం ప్యాకింగ్ పర్సన్స్ విధి. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి అర్హతతోనే ఈ ఉద్యోగాలు సంపాదించుకోవచ్చు. సగటు నెల వేతనం రూ.8వేలు నుంచి రూ.పది వేలుగా ఉంటోంది.

ట్రక్/ వెహికిల్ డ్రైవర్స్ :

ఆయా ప్రొడక్ట్‌లను కస్టమర్స్‌కు చేరవేసేందుకు అవసరమైన వాహనాలకు డ్రైవర్స్ అవసరం ఉంటుంది. పదో తరగతి అర్హతతోపాటు హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ చేతిలో ఉంటే చాలు.. ఈ డ్రైవర్ ఉద్యోగం ఖాయం. వీరికి కూడా సగటున రూ. పది వేల వేతనం లభిస్తోంది.

డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ :

ఒకప్పుడు డెలివరీ బాయ్స్‌గా పిలిచే సిబ్బందినే సంస్థలు ఇప్పుడు డెలివరీ ఎగ్జిక్యూటివ్స్‌గా పేర్కొంటున్నాయి. వినియోగదారుడు ఆర్డర్ ఇచ్చిన వస్తువును నిర్దిష్ట సమయంలోగా అందజేసి.. ఆ సంగతిని తక్షణమే సంస్థకు తెలియజేయడం డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ ప్రధాన బాధ్యత. ఇటీవల కాలంలో సంస్థలు వీరికి బ్లూటూత్ డివైజ్‌లను కూడా అందిస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హత ఉండి.. కాసింత సాంకేతిక పరిజ్ఞానం.. అంటే మొబైల్ ఆపరేషన్స్‌లో నైపుణ్యం ఉంటే చాలు ఈ ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. వీరికి కనీసం రూ.15వేల నుంచి రూ.20వేల వరకూ అందుతోంది.

వేర్‌హౌస్ మేనేజర్ :

ఈ-కామర్స్, రిటైల్ సంస్థలు భారీఎత్తున వేర్‌హౌస్(గోడౌన్స్)ను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అన్ని రకాల వస్తువులు ఈ వేర్‌హౌస్‌లలోనే భద్రపరుస్తున్నారు. సదరు వేర్‌హౌస్‌లో ఏ సెగ్మెంట్‌లో ఏ వస్తువులు ఎక్కడ భద్రపరచాలి? ప్రొడక్ట్‌లను బయటికి పంపే విషయంలో ముందుగా వేటిని పంపాలో ప్రణాళిక రూపొందించుకోవడం వంటి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అదే విధంగా వేర్‌హౌస్‌లో పని చేసే సిబ్బందిని పర్యవేక్షించడం కూడా వేర్‌హౌస్ మేనేజర్ల బాధ్యతే. ఈ ఉద్యోగాలను బ్యాచిలర్ డిగ్రీతో అందుకోవచ్చు. వీరు ప్రారంభంలో రూ.20 వేలకు పైగా వేతనం పొందే వీలుంది. అనుభవం, నైపుణ్యం, అంకితభావంతో మరింత ఎక్కువగానే సంపాదించే వీలుంది.

ఇన్వెంటరీ మేనేజర్/ ఎగ్జిక్యూటివ్ :

వేర్‌హౌస్‌కు వస్తున్న వస్తువులు, డెలివరీకి వెళ్తున్న వస్తువులకు సంబంధించిన వివరాలను నమోదు చేసే ఉద్యోగులే.. ఇన్వెంటరీ మేనేజర్‌లు /ఎగ్జిక్యూటివ్స్. ఏదైనా డిగ్రీ అర్హతతో ఇన్వెంటరీ మేనేజర్ కొలువు సొంతం చేసుకోవచ్చు. వీరు ప్రారంభంలో రూ.20వేల వరకూ అందుకునే వీలుంది.


లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో పైన పేర్కొన్న పలు రకాల ఉద్యోగాలతోపాటు ఆయా సంస్థలు అవసరాన్ని బట్టి లాజిస్టిక్స్ కోఆర్డినేటర్, వేర్‌హౌస్ సూపర్‌వైజర్, బుక్ కీపింగ్ అసిస్టెంట్స్, స్టోర్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి.

సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ :

ఒక ప్రొడక్ట్ తయారీకి అవసరమైన ముడిసరుకును సేకరించడం... వస్తువును తయారు చేయడం.. తయారైన ప్రొడక్ట్‌ను అంతిమ వినియోగదారుకు చేరవేయడం వరకూ.. జరిగే వివిధ ప్రక్రియల నిర్వహణే సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్. సరైన వస్తువును సరైన సమయంలో సరైన ప్రదేశంలో సరైన ధరకు వినియోగదారుడికి అందించే నిర్వహణ విభాగాన్నే సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ అంటున్నారు. సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ విభాగంలోని నిపుణులు.. సప్లయర్స్, మ్యానుఫ్యాక్చరర్స్, డిస్ట్రిబ్యూటర్స్, రిటైలర్స్, లాజిస్టిక్స్, కన్స్యూమర్స్... ఇలా విభిన్న విభాగాల మధ్య సమన్వయం సాధించే కీలకమైన విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఓ మొబైల్ ఫోన్‌ల తయారీ కంపెనీ... ఒక స్మార్ట్‌ఫోన్‌ను ఫలాన తేదీన మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు ప్రకటన ఇచ్చిందంటే... కచ్చితంగా ఆ రోజున సదరు స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో, సేల్స్ కౌంటర్‌ల వద్ద వినియోగదారుడికి అందుబాటులో ఉంచేలా తెరవెనుక అన్ని ప్రక్రియలను నిర్వహించే విభాగమే సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్. ఒకవేళ ముందే ప్రకటించినట్లు నిర్దేశిత రోజున సదరు స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్‌లోకి తేలేకపోతే ఏమవుతుంది?! ఆ ప్రొడక్ట్‌పై వినియోగదారుడికి ఆసక్తి తగ్గిపోయి.. డిమాండ్ పడిపోయి.. పెద్ద ఫెయిల్యూర్‌లా మిగిలిపోయి కంపెనీకి భారీ నష్టాలు రావచ్చు. కాబట్టి ఏ వ్యాపార సంస్థకైనా సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ అనేది వెన్నుముక వంటిదని చెప్పొచ్చు. ఎంతో కీలకమైన ఈ విభాగంలో సంబంధిత నైపుణ్యాలుంటేనే రాణించే వీలుంటుంది. అందుకే అకడమిక్‌గా ప్రత్యేకంగా ప్రొఫెషనల్ అర్హతలున్న అభ్యర్థులకు ఆయా సంస్థల్లో ప్రాధాన్యం లభిస్తోంది. విధులకు తగ్గట్టే వీరికి లభించే వేతనాలు కూడా ఆకర్షణీయమని చెప్పొచ్చు.

సప్లయ్ చైన్ డిజైన్ అండ్ ప్లానింగ్ ఆఫీసర్స్ :

సంస్థకు చెందిన ఒక వస్తువు వేర్‌హౌస్ నుంచి రిటైల్ ఔట్‌లెట్ లేదా, వినియోగదారుడికి చేరే వరకూ... పలు స్థాయిల్లో అనుసరించాల్సిన విధానాలు, ప్రణాళికలు రూపొందించడం సప్లయ్ చైన్ డిజైన్ అండ్ ప్లానింగ్ ఆఫీసర్స్ ముఖ్యమైన విధి. వీరు రూపొందించే ప్రణాళిక ఆధారంగానే ఆయా ప్రొడక్ట్‌లకు సంబంధించిన ప్యాకింగ్, డెలివరీ తదితర అంశాలు ఆధారపడి ఉంటాయి. వాస్తవానికి సప్లయ్ చైన్ విభాగంలో ఇది కీలకమైన బాధ్యత అని చెప్పొచ్చు. అందుకే ఈ ఉద్యోగాలకు సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్‌లో స్పెషలైజ్డ్ డిగ్రీ, డిప్లొమా అర్హతలున్న వారిని కంపెనీలు నియమించుకుంటున్నాయి. వేతనాలు కూడా సగటున రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అందుకునే వీలుంది.



ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్స్ :

తమ సంస్థ లక్షిత వినియోగదారులు, వారికి అవసరమైన వస్తువులను గుర్తించడం, ఆ తర్వాత అవి తమ సంస్థకు అందేలా.. ఉత్పత్తిదారులతో సంప్రదింపులు జరపడం ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్స్ ప్రధానమైన విధి. వీరికి కూడా వేతనాలు సగటున రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు లభిస్తున్నాయి.

డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ మేనేజర్స్ :

ఒక వస్తువును వినియోగదారులకు వీలైనంత త్వరగా అందించడం ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలకు అత్యంత కీలకం. కాబట్టి ఆయా ఈ కామర్స్ సంస్థలు అన్ని ప్రాంతాల్లోని డిస్ట్రిబ్యూటర్స్‌తోనూ ఒప్పందాలు చేసు కుంటున్నాయి. తమ సంస్థకు వచ్చిన ఆర్డర్/ ప్రొడక్ట్ వివరాలను సంబంధిత డిస్ట్రిబ్యూటర్‌కు తెలియజేయడం, ఆ తర్వాత ఆ ప్రొడక్ట్‌ను సమీపంలోని తమ వేర్‌హౌస్‌కు రప్పించేలా చేస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ మేనేజర్స్‌ను నియమిస్తున్నాయి. వీరు చేయాల్సిందల్లా పర్యవేక్షణ. నిరంతరం డిస్ట్రిబ్యూటర్స్‌తో సంప్రదింపులు సాగించడం. వీరికి కూడా నైపుణ్యాలను అనుసరించి వేతనాలు రూ.30 వేల నుంచి 40వేల వరకూ అందే వీలుంది.

విశాలాంధ్ర ప్రజ్ఞ

సప్లయ్ చైన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్స్ :

అప్పటికే సప్లయ్ చైన్ డిజైన్ ఆఫీసర్స్ రూపొందించిన ప్రణాళికను ఆధారంగా ఎలాంటి ప్రొడక్ట్ తయారీ, సరఫరా పరంగా ఎలాంటి సమస్య తలెత్తకుండా అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ సాగించాల్సిన ఉద్యోగం ఇది. వీరికి ప్రారంభంలో రూ.20 వేలకు పైగానే అందుతోంది. ఇవే కాకుండా.. ఈ విభాగంలో ఇన్వెంటరీ మేనేజర్స్, పర్చేజింగ్ ఎగ్జిక్యూటివ్స్ వంటి పలు ఉద్యోగాలు అందుబాటులో ఉంటున్నాయి.

అకడమిక్‌గా అడుగులు ఇలా..:

ప్రస్తుతం లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ విభాగాల్లోని ఉద్యోగాలు, అందుకు సంబంధించిన క్షేత్ర స్థాయి నైపుణ్యాలు అందించేందుకు పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పలు ఇన్‌స్టిట్యూట్‌లు సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగాలకు సంబంధించి స్పెషలైజ్డ్ కోర్సులను అందిస్తున్నాయి.

కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు వివరాలు :

ఐఐఎం-కోల్‌కతా

కోర్సు : అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్ ఇన్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్

యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ స్టడీస్

కోర్సు : ఎంబీఏ (లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్)

ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ

కోర్సు - బీబీఏ (లాజిస్టిక్స్, రిటైలింగ్ అండ్ ఈ-కామర్స్)

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్

కోర్సు : పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్, డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ మేనేజ్‌మెంట్

కోర్సు : పీజీ డిప్లొమా ఇన్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ అండ్ లాజిస్టిక్స్

నర్సీమొంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్

కోర్సు : పీజీ డిప్లొమా ఇన్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్

మణిపాల్ యూనివర్సిటీ

కోర్సు : పీజీ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్, ఎంకాం (లాజిస్టిక్స్ స్పెషలైజేషన్)

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్

కోర్సు : డిప్లొమా, పీజీ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్

వీటితోపాటు పలు ప్రముఖ బి-స్కూల్స్, యూనివర్సిటీలు లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌తో డిప్లొమా, పీజీ డిప్లొమా, పీజీ కోర్సులను అందిస్తున్నాయి. అదే విధంగా ఐఐఎంలు పీజీ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌లో ఆపరేషన్స్ స్పెషలైజేషన్‌లో లాజిస్టిక్స్‌ను ఒక కోర్సుగా బోధిస్తున్నాయి.

లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ కెరీర్ ముఖ్యాంశాలు..

- పలు స్టాఫింగ్ సంస్థల అంచనా ప్రకారం రానున్న నాలుగేళ్లలో లాజిస్టిక్స్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌లో విభాగాల వారీగా లభించనున్న కొత్త ఉద్యోగాల వివరాలు.
- 2022 నాటికి ప్యాకింగ్ సిబ్బంది నుంచి ప్రొక్యూర్‌మెంట్ అనలిస్ట్‌ల వరకు దాదాపు మూడు మిలియన్ల ఉద్యోగాలు.
- ట్రాన్స్‌పోర్టేషన్ విభాగంలో దాదాపు ఎనిమిది లక్షల ఉద్యోగాలు.
- వేర్‌హౌసింగ్‌లో 1.2 లక్షల కొలువులు
- ప్యాకేజింగ్‌లో 40 వేల ఉద్యోగాలు
- కొరియర్ సర్వీస్‌లో 60 వేల జాబ్స్
- సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్‌లో తొంభై వేల ఉద్యోగాలు
- ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్న ఈ-కామర్స్, రిటైల్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, ఆటోమోటివ్ సెక్టార్స్.

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
269.44 ▲	80.10 ▲	10 ▲	30,080	1100 ▲	41,300	
36,076.72	10,859.90	30,010	ప్రొద్దుటూరు 30,190	39,300	ప్రొద్దుటూరు 40,084	69.94
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టైటన్	922.70	3.95
సన్‌ఫార్మా	425.20	3.42
ఐఓసీ	138.20	3.21
జీ-ఎంటర్‌టైన్	478.70	2.16
ఎస్-బ్యాంక్	183.30	1.88

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
కోల్ ఇండియా	242.30	-3.16
భారతీ ఇన్‌ఫ్రాటెల్	263.00	-1.42
బీపీసీఎల్	361.90	-0.74
బజాజ్ ఆటో	2,759.95	-0.71
టీసీఎస్	1,920.00	-0.68

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	70.35	69.94
యూరో	80.14	80.21
పౌండ్	88.91	88.81
ఆస్ట్రేలియా డాలర్	49.51	49.40
సింగపూర్ డాలర్	51.24	51.21

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,190	32,288
చెన్నై	30,190	32,288
బెంగళూరు	29,600	31,657
ముంబై	30,660	32,791
విజయవాడ	30,010	32,650
విశాఖపట్నం	30,080	31,580
ప్రొద్దుటూరు	30,190	40,084
ముడి చమురు		52.16

ఈ-కామర్స్ జోరుకు బ్రేక్

- వ్యాపార నిబంధనలు కఠినతరం
- ఎక్స్‌క్లూజివ్ డీల్స్‌పై నిషేధం
- ఫిబ్రవరి 1 నుంచి కొత్త విధానం అమల్లోకి
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ సంస్థల వ్యాపార నిబంధనలను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థల దూకుడుకు కళ్లెం వేసేలా కొత్త ఈ-కామర్స్ పాలసీలో పలు నిర్ణయాలను తీసుకున్నది. ఈ-కామర్స్ కంపె నీలపై సంప్రదాయ వ్యాపారుల ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థపై దృష్టి పెట్టిన మోడీ సర్కారు.. ఒక విధంగా కొరడానే ఝుళిపించింది మరి. ముఖ్యంగా విదేశీ పెట్టుబడులున్న ఈ-కామర్స్ సంస్థల జోరుకు బ్రేక్ వేసింది. దేశీయ వ్యాపారుల ప్రయోజనాలను కాపాడేలా నియమ, నిబంధనలను సవరించింది. తమకు వాటాలున్న సంస్థల ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అమ్ముకోరాదని, అలాగే ఆయా వస్తువుల కోసం ప్రత్యేక అమ్మకాల ఒప్పందాలను కుదుర్చుకోరాదని ఈ-కామర్స్ మార్కెటీర్లకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ బుధవారం స్పష్టం చేసింది. ఈ తరహా ఎక్స్‌క్లూజివ్ డీల్స్‌తో మార్కెట్‌లో ఆయా వస్తువుల ధరలు ప్రభావితం అవుతున్నాయన్నది. ఈ- కామర్స్ సంస్థ లేదా దాని గ్రూప్ సంస్థల ద్వారా వాటాలను కలిగి ఉన్న ఏ వ్యాపార సంస్థయినా.. తమ ఉత్పత్తుల అమ్మకాల కోసం సదరు ఈ-కామర్స్ సంస్థను వేదిక చేసుకోరాదు. తద్వారా ఆన్‌లైన్ విక్రయాలకు దిగకూడదు అని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఏ వ్యాపారైనాసరే ఒకే ఆన్‌లైన్ సంస్థ వేదికగా 25 శాతానికిపైగా తమ ఉత్పత్తులను అమ్మడానికి వీల్లేదని కూడా తేల్చిచెప్పింది.

పారదర్శకతకు ప్రాధాన్యం

ఆన్‌లైన్ రిటైల్ సంస్థల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)పై విధానాన్ని సవరించిన కేంద్రం.. కొనుగో లుదారులకు క్యాష్ బ్యాక్ ఆఫర్ల విషయంలో పారదర్శకంగా, ఎటువంటి పక్షపాతానికి తావు లేకుండా వ్యవహరించాలని ఈ-కామర్స్ మార్కెటీర్లకు సూచించింది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏటా సెప్టెంబర్ 30లోగా నిర్దేశిత మార్గదర్శకాలను పాటించా మని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు ఓ చట్టబద్ధ గణాంక నిపుణుడిచే రూపొందించిన నివేది కను, ధ్రువపత్రాన్ని దాఖలు చేయాలని కూడా తెలిపిం ది. ఈ మార్పులన్నీ కూడా వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి అమ ల్లోకి వస్తాయని ఈ సందర్భంగా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. సవరించిన పాలసీ ప్రకారం ఈ-కామర్స్ కార్యకలాపాల్లో 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఉన్నది.

సంప్రదాయ మార్కెట్‌కు దన్ను

వినియోగదారులకు భారీ డిస్కౌంట్లను ఎరవేస్తూ మార్కెట్‌లో నెలకొన్న ఆరోగ్యకరమైన పోటీని ఆన్‌లైన్ సంస్థలు పాడుచేస్తున్నాయని సంప్రదాయ మార్కెటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక దినాల్లో ఈ-కామర్స్ సంస్థలు తమ వ్యాపారాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయని వారు అంటున్నారు. ఈ క్రమంలో తాజా పాలసీ సంప్రదాయ మార్కెటీర్లకు దన్నుగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షణం తీరికలేని ఈ యాం త్రిక జీవనంలో ప్రత్యేకంగా షాపింగ్ కోసం సమయాన్ని కేటాయించలేని వారెందరో. అలాంటి వారంతా కూడా ఆన్‌లైన్ మార్కెట్ పైనే ఆధారపడుతుండగా, మొబైల్ ఇంట ర్నెట్, డిజిటల్ బ్యాంకింగ్ కూడా ఈ-కామర్స్ మార్కె ట్ జోరును పెంచుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ క్రమం లో వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తాజా నిర్ణయాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ప్రభుత్వ నిర్ణయం భేష్: సీఏఐటీ

నూతన ఈ-కామర్స్ పాలసీని అఖిల భారత ట్రేడర్ల సమాఖ్య (సీఏఐటీ) స్వాగతించింది. చాలాకాలం పోరాటం తర్వాత సాధించిన గొప్ప విజయంగా అభివర్ణిం చింది. ప్రభుత్వ నిర్ణయాలు తూచా తప్పకుండా అమలైతే మంచిదేనన్న సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్.. దీనివల్ల ధరల నిర్ణయంపై గుత్తాధిపత్యం పోగలదన్నారు.

ఆన్‌లైన్ మార్కెటీర్లలో మిశ్రమ స్పందన

ప్రభుత్వ నిర్ణయాలపై ఆన్‌లైన్ మార్కెటీర్లలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నది. ఈ-కామర్స్ సంస్థలు నిజాయితీతో, స్వేచ్ఛగా సేవలను అందిస్తున్నా యని, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ ఎంఈ)కు లాభం చేకూర్చుతున్నాయని స్నాప్‌డీల్ సీఈవో కునాల్ భల్ ట్వీట్టర్‌లో స్పందించారు. కొత్త పాలసీని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే అమె జాన్ ఇండియా ప్రతినిధి మాత్రం ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష చేసిన తర్వాతే స్పందిస్తామన్నారు. ఈ రకమైన విధానం దేశంలో పెట్టుబడులను దెబ్బతీస్తుందని మరో ఈ-కామర్స్ సంస్థ సీనియర్ ఉద్యోగి ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంటర్నెట్ హవా..!

- 2018లో భారత్ మరో రికార్డు
- దేశంలో 50 కోట్ల మార్కును దాటిన యూజర్లు

న్యూఢిల్లీ: భారత్‌లో ఇంటర్నెట్ వినియోగం రోజురోజుకీ పెరుగుతోంది. 2018లో భారత్‌లో ఇంటర్నెట్ కనెక్షన్లు 65 శాతం పెరిగాయని ట్రాయ్ గణాంకాల ద్వారా వెల్లడైంది. అంతేకాదు ఇంటర్నెట్ వినియోగిస్తున్న వారి సంఖ్య 50 కోట్ల మార్కును దాటింది. జియో రాకతో డేటా వినియోగం విషయంలో ఇతర టెలికాం సంస్థలు దిగివచ్చిన సంగతి తెలిసిందే. సెప్టెంబరు 2018 చివరి నాటికి భారత్‌లో నారో బ్యాండ్, బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 56 కోట్లకు చేరాయని ట్రాయ్ పేర్కొంది. ఇందులో 54 కోట్ల మంది మొబైల్ ద్వారానే ఇంటర్నెట్ వినియోగిస్తున్నారు. మిగిలిన వాళ్లు బ్రాడ్ బ్యాండ్ వాడుతున్నారు. మొత్తం 56 కోట్ల కనెక్షన్లలో 36 కోట్ల మంది పట్టణ ప్రాంతాల్లో ఉండగా, 19.4 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల వారని ట్రాయ్ వెల్లడించింది. ఆగస్టు 31, 2018 నాటికి 445.18 మిలియన్ల మంది మొబైల్ ఫోన్లు, డాంగిల్స్ ద్వారా అంతర్జాల సేవలు పొందుతున్నారు. మొత్తం ఐదు టెలికాం సంస్థలు ప్రధాన వాటాదారులుగా ఉన్నాయి. అత్యధికంగా జియో ఇన్ఫోకామ్(252.25 మిలియన్లు) ఉండగా, ఆ తర్వాత భారతీ ఎయిర్‌టెల్(99.29 మిలియన్లు), వొడాఫోన్ (51.82 మిలియన్లు), ఐడియా సెల్యులార్(47.90 మిలియన్లు), బీఎస్ఎన్ఎల్(20.12 మిలియన్లు) ఉన్నాయి. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారుల్లో అత్యధికంగా కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్రల్లో 20 కోట్ల మంది ఉన్నారు.

టాప్ 10లో 'హీరో'

న్యూఢిల్లీ: దేశీయ ద్విచక్రవాహన రంగంలో హీరో మోటోకార్ప్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. నవంబరు నెలలో జరిగిన అమ్మకాల్లో హీరో సంస్థకు చెందిన నాలుగు బైక్‌లు టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. హీరోతో పాటు హెూండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్ఐ), బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ కంపెనీలు కూడా అమ్మకాల్లో వృద్ధిని కనబరిచాయి. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటో మొబైల్ మ్యానుఫాక్చర్స్(ఎస్ఐఏఎం) గణాంకాల ప్రకారం హీరో మోటోకార్ప్‌కు చెందిన స్ప్లెండర్ అత్యధికంగా అమ్ముడు పోయింది. అయితే, గతేడాది నవంబరు నెల(2,25,737) అమ్మకాలతో పోలిస్తే కాస్త తగ్గి 2,25,536 వాహనాలు విక్రయమయ్యాయి. ఆ తర్వాత 2,18,212 యూనిట్లతో హెూండా యాక్టివా రెండో స్థానంలో నిలిచింది. గతేడాది ఇదే సమయంలో 2,26,046 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం. 1,68,839 యూనిట్లతో హీరోకు చెందిన హెచ్ఎఫ్ డీలక్స్ మూడో స్థానంలో నిలిచింది. నాలుగో స్థానంలో టీవీఎస్ మోటార్స్‌కు చెందిన ఎక్స్ఎల్ సూపర్ మోపెడ్ ఉంది. 2017లో 69,888 యూనిట్లు అమ్ముడుపోయిన ఎక్స్ఎల్ ఈసారి వృద్ధిని నమోదు చేసి ఏకంగా 74,590 వాహనాలను విక్రయించింది. హీరోమోటోకార్ప్‌కు చెందిన ప్యాషన్ బైక్ 74,396 యూనిట్లతో ఐదో స్థానంలో నిలవగా, ఆ తర్వాత హెూండా సీబీ షైన్(70,803) బజాజ్ పల్సర్(69,579) టీవీఎస్ జుపిటర్(69,391), హీరో గ్లామర్(63,416), బజాజ్ ప్లాటినా (62,555)లు టాప్-10లో ఉన్నాయి.

ఏడాది ముగింపులో
ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు

ముంబై: తీవ్ర ఊగిసలాట మధ్య ఏడాది చివరి రోజును దేశీయ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగించాయి. ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో ఈ ఉదయం స్టాక్ మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. మార్కెట్ ఆరంభంలో సెన్సెక్స్ 200 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది. నిఫ్టీ కూడా 10,900 పాయింట్ల స్థాయిని దాటి కొనసాగింది. అయితే సూచీల జోరు ఎంతోసేపు నిలువలేదు. కీలక రంగాల షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా సూచీల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. నిఫ్టీ 10,900 మార్క్‌ను కోల్పోయింది. అలా ట్రేడింగ్‌లో చాలా సేపు ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. సోమవారం నాటి సెషన్‌లో సెన్సెక్స్ అత్యల్పంగా 8.39 పాయింట్లు నష్టపోయి 0.02శాతంతో 36,068.33 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 1.60 పాయింట్ల లాభంతో 0.01శాతంతో 10,862 వద్ద ముగిసింది. బిఎస్ఇ మిడ్‌కాప్,స్మాల్‌కాప్ సూచీలు 0.51శాతం, 0.69శాతం నమోదుచేసాయి. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో మెటల్ అత్యధికంగా 1.43శాతం లాభాన్ని నమోదుచేయగా, బేసిక్ మెటీరియల్స్, కన్సూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్ రంగాలు లాభాల్లో నమోదయ్యాయి. మరోవైపు టెలికాం, ఎనర్జీ, ఎఫ్ఎంసిజి,రియాల్టీ అత్యధికంగా నష్టపోయాయి. టాటాస్టీల్, టైటాన్, సన్‌ఫార్మా, వేదాంత, ఇండియన్ ఆయిల్, టాటామోటార్స్, యస్‌బ్యాంకు టాప్ గెయినర్స్ కాగా కీలకసూచీలైన భారతిఎయిర్‌టెల్, యాక్సిస్‌బ్యాంకు, బిపిసిఎల్,టిసిఎస్,బజాజ్ ఆటో, హీరో మోటాకార్ప్ మేజర్ లూజర్స్‌గా ఉన్నారు. హాంగ్ కాంగ్, ఆస్ట్రేలియాలో ఈక్విటీలు లాభపడ్డాయి. చైనా అమెరికాల మధ్య సానుకూల సంకేతాలు వెలువడడంతో యుఎస్‌స్టాక్స్ ఫ్యూచర్స్ లాభాల్లో నమోదైనట్లు సమాచారం. డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు కోలుకుని 69.80గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో టైటాన్, సన్‌ఫార్మా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడగా.. భారతీ ఇన్‌ఫ్రాటెల్, భారత్ పెట్రోలియం, టీసీఎస్, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి.

ఎన్నికలు.. చమురు ధరలు.. వాణిజ్యయుద్ధం

కొత్త సంవత్సరంలో స్టాక్‌మార్కెట్ల చూపు వీటిపైనే



ఢిల్లీ: కొత్త సంవత్సరంలో దేశీయ మార్కెట్లకు ఊగిసలాట తప్పేలా లేదు. ఓ వైపు సార్వత్రిక ఎన్నికలు మరోవైపు చమురు ధరలు.. దీనికి తోడు అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధ భయాలు.. ఇలా వచ్చే ఏడాది జాతీయ, అంతర్జాతీయ అంశాలు మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. 2019 తొలి అర్ధభాగంలో బడ్జెట్, లోక్‌సభ ఎన్నికలపై మదుపర్లు దృష్టిపెట్టనున్నారు. '2019 ఆరంభంలో మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశాలున్నాయి. ఆ తర్వాత ఎన్నికల ఫలితాలను బట్టి మార్కెట్ల కొనసాగింపు ఉంటుంది' అని ఎస్సెల్ మ్యూచువల్ ఫండ్ సీఈవో విరాల్ బేరవాలా అభిప్రాయం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితులు కూడా మార్కెట్లను ప్రభావితం చేయనున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు. అయితే పెట్టుబడులు పెరగడం, పరిస్థితులు అనుకూలిస్తే 2019 డిసెంబరు నాటికి నిఫ్టీ 11,500 పాయింట్ల స్థాయిని చేరుకోవచ్చని వినోద్ అన్నారు. మరోవైపు అంతర్జాతీయ చమురు ధరలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపిస్తాయని ఎపిక్ రీసెర్చ్ సీఈవో ముస్తఫా నదీమ్ అభిప్రాయపడ్డారు. రూపాయి విలువ, చమురు ధరలు ఇటీవల మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయని ముస్తఫా అన్నారు. అయితే ప్రస్తుతం చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, రూపాయి కూడా కోలుకుంటుండంతో 2019లో మార్కెట్లు మెరుగయ్యే అవకాశాలున్నట్లు చెప్పారు. మొత్తం మీద 2018 మాదిరిగానే 2019 ముగిసేనాటికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సెన్సెక్స్ 5శాతం వరకు పెరిగే అవకాశమున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

బెంచ్ మార్క్ దాటిన హుందాయ్ ఐ20



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశంలో పాసింజర్ కార్ల ఉత్పత్తిలో రెండవ స్థానాన్ని ఆక్రమించిన హుందాయ్ మోటార్ ఇండియా తాజాగా తన సూపర్ పెర్ఫార్మింగ్ బ్రాండ్‌గా ఐ20 నిలిచిందని సంస్థ నేషనల్ సేల్స్ వైస్ ప్రెసిడెంట్ వికాస్ జైన్ తెలిపారు. ఇది విడుదలైన పదేళ్లలో 1.3 మిలియన్ల బెంచ్ మార్కును దాటేసిందన్నారు. ఐ20 మోడల్ విక్రయాల్లో మరో మైలురాయిని అధిగమించామని, ప్రపంచ వ్యాప్తంగా 1.3 మిలియన్ల విక్రయాలు సాగాయన్నారు. ఇది సంస్థకు స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు.

ఎయిర్‌టెల్‌చే వింక్ మ్యూజిక్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వినోద ప్రపంచంలో, తన వినియోగదారులను అద్భుతమైన సంగీతాన్నీ అందించడానికి ఎయిర్ టెల్ వింక్ మ్యూజిక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కేవలం ఒక్క బటన్ టచ్‌తో 100 మిలియన్ వినియోగదారులకు వారి సంగీతం ప్రయాణంలో 'మీ ఇయర్ ఇన్ మ్యూజిక్ 2018' ద్వారా కొత్త అనుభూతిని కలిగిస్తుందని భారతీ ఎయిర్‌టెల్ సిఇఒ కంటెంట్ అండ్ అప్లికేషన్స్ ఛైర్మన్ సమీర్ బత్రా తెలిపారు. 2018లో సంవత్సరంలో అత్యధికంగా విన్న పాటలు, సంగీతాన్ని వింటూ గడిపిన సమయాన్ని వింక్ మ్యూజిక్ ద్వారా గుర్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డిసెంబరు 2018లో గూగుల్ సెర్చ్‌లో 'ది ఇయర్ యొక్క అత్యంత వినోదాత్మక అనువర్తనం'గా వింక్ నిలిచిందన్నారు. ప్రతిరోజూ ఒక బిలియన్ డేటా పాయింట్లను వినియోగదారులు సేకరిస్తున్నామని, డేటా సైన్స్, స్మార్ట్ విశ్లేషణల కలయిక ద్వారా వినియోగదారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఎయిరిండియాకు ప్రపంచశ్రేణి నిపుణులు

ఢిల్లీ: భారత విమానయాన సంస్థ ఎయిరిండియాని పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎయిరిండియాలో ఉన్నతస్థాయి ఉద్యోగుల్లో ప్రపంచశ్రేణి నిపుణులను నియమించుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి సురేశ్‌ప్రభు పేర్కొన్నారు. రూ.55 వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిన ఎయిరిండియాను పునరుద్ధరించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది మే నెలలో ఎయిరిండియా వాటాలను అమ్మాలని ప్రయత్నించినప్పటికీ అది కుదరలేదు. దీంతో ప్రభుత్వం ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించిందని మంత్రి వివరించారు. ఎయిరిండియాని బలో పేతం చేసేందుకు ప్రపంచ స్థాయి నిపుణులను నియమించు కోవాలనే ఆలోచనలున్నాయని ఆయన అన్నారు. మంత్రి మాట్లాడుతూ.. 'ఎయిరిండియాలోని కీలక పదవుల్లో ప్రపంచశ్రేణి నిపుణులని నియమించు కోవాలని ఆదేశించాను.. ఈ విషయంపై ప్రభుత్వం ఇప్పటికే సానుకూలంగా స్పందించింది' అని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక కమిటీని నియమించాలని భావిస్తోందని ఆ శాఖ అధికారి ఒకరు స్పష్టం చేశారు. మొత్తం తొమ్మిది మంది సభ్యులు గల ఎయిరిండియా బోర్డులో విమానయాన శాఖకు చెందిన ఇద్దరు అధికారులు కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రదీప్ సింగ్ ఖరోల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తుండగా ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఐటీసీ ఛైర్మన్ వైసీ దేవే శ్వర్, ఆదిత్యా బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా ఇద్దరూ స్వతంత్ర డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. రవిందర్ కుమార్ త్యాగి, సయ్యద్ జఫర్ ఇస్లాం, దగ్గుబాటి పురంధరేశ్వరి ఇతర స్వతంత్రం డైరెక్టర్లుగా.. ఎయిరిండియా డైరెక్టర్ (ఫైనాన్స్) వినోద్ హెజ్మది, కేంద్ర విమానయాన శాఖ అదనపు కార్యదర్శి గర్జికౌల్, జాయింట్ కార్యదర్శి సత్యేంద్ర కుమార్ మిశ్రా ఇతర బోర్డు మెంబర్లుగా ఉన్నారు. రూ.55వేల కోట్ల అప్పులే ఎయిరిం డియాకు ప్రధాన సమస్య అని.. ఈ విషయంపై ఇప్పటికే ఆర్థిక శాఖతో సంప్రదింపులు జరుపుతున్నామని సురేశ్‌ప్రభు వివరించారు. ప్రత్యేక నిధి కింద రూ.29 వేల కోట్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎయి రిండియా సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిం చినట్లు విమాన యాన శాఖ ఈనెల 27న లోక్‌సభలో వెల్లడించింది. అప్రధాన అప్పులు, ఆస్తుల బదిలీ, బలమైన కార్యాచరణ, పాలనా సంస్కరణలు, పటిష్ట వాణిజ్య చర్యలు తదితర అంశాలతోపాటు ఉన్నతస్థాయి నిపుణుల నియామకాలు, ఉత్తమ వ్యాపార ప్రక్రియ ఈ ప్రణాళికలో పొందుపర్చిన విషయాలుగా తెలుస్తోంది.

పీఎన్‌బీ కుంభకోణం
రూ.41,167 కోట్లు


న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆరంభంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో వెలుగుచూసిన కుంభకోణం యావత్ బ్యాంకింగ్ రంగంలోనే సంచలనం సృష్టించింది. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన బంధువు మెహుల్ ఛోక్సీ తదితరులు కలిసి పీఎన్‌బీకి రూ.13వేల కోట్ల మేర కుచ్చుటోపి పెట్టారు. ఇదొక్కటే కాదు.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో జరిగిన మోసాల విలువ ఎంతంటే... అక్షరాలా రూ. 41,167.7కోట్లు. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తాజా గణాంకాలు వెల్లడించాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ వ్యవస్థలో మోసాలు 72శాతం పెరిగాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ. 23,933కోట్ల మేర బ్యాంకులు మోసపోగా.. గత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ. 41,167.7 కోట్లకు పెరిగింది. పీఎన్‌బీ కుంభకోణం వల్లే మోసాల విలువ అమాంతం పెరిగిందని ఆర్‌బీఐ గణాంకాలు పేర్కొన్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో మొత్తం నమోదైన మోసాల్లో 80శాతం రూ.50కోట్లు ..అంతకంటే పైబడినవే. ఇక 93శాతం కేసుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులే మోసపోయినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

రైల్వే స్టేషన్లపై సంక్రాంతి ఎఫెక్ట్
ప్లాట్ ఫామ్ టికెట్ రూ.20

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సంక్రాంతి పండుగ సీజన్ కావడంతో రైల్వే అధికారులు రైళ్ల సంఖ్యతో పాటు రేట్లను కూడా పెంచడానికి సిద్ధమయ్యారు. హైదరాబాద్‌లోని ప్రధాన స్టేషన్లనుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు పలు అదనపు సర్వీసులను దక్షిణ మధ్య రైల్వే నడపనుంది. అదనపు రైళ్లలో టికెట్ ధర కూడా కొంత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లలో ప్లాట్ ఫామ్ టికెట్ ధరను కూడా పెంచబోతున్నారు. జనవరి 9 నుండి 17 వరకు సంక్రాంతి సీజన్‌లో ప్లాట్ ఫామ్ టికెట్‌కు రూ.20 వసూలు చేస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఉమాశంకర్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఫ్లాట్ ఫాం టికెట్ ధర రూ.10 ఉంది. స్టేషన్లలో రద్దీని కంట్రోల్ చేయాలన్న ఉద్దేశంతోనే ప్లాట్ ఫాం టికెట్ ధరను పెంచాలని నిర్ణయించామని వివరించారు. కాచీగూడలో మాత్రం ఎటువంటి చార్జీలను పెంచటం లేదని తెలిపారు.

హైదరాబాద్ నుంచి 5 జిల్లాలకు డైరెక్ట్ ట్రైన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నిరీక్షణకు తెర పడనుంది. 70 ఏళ్ల రైలు ప్రయాణం కల సాకారం కానుంది. హైదరాబాద్ నుంచి 5 జిల్లాలకు డైరెక్ట్ ట్రైన్ రానుంది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న హైదరాబాద్-కరీంనగర్ రైల్వే లైన్ ప్రాజెక్ట్ త్వరలో అందుబాటులోకి రానుంది. ప్రాజెక్ట్ పనులను రైల్వే అధికారులు మరింత ముమ్మరం చేశారు. 2019లో అందుబాటులోకి తీసుకురావాలని పట్టుదలగా ఉన్నారు. ఈ ట్రాక్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని 5 జిల్లాలకు హైదరాబాద్‌తో కనెక్టివిటీ ఏర్పడనుంది. మేడ్చల్, సిద్ధిపేట, మెదక్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండనుంది. హైదరాబాద్‌కు రావాలంటే బస్సులో మాత్రమే రావాల్సిన పరిస్థితి. త్వరలోనే రైలు సౌకర్యం కూడా అందుబాటులోకి రానుంది. 2016 అగస్టులో ప్రధాని మోదీ ఈ ప్రాజెక్ట్‌కి శంకుస్థాపన చేశారు. 5 జిల్లాలకు చెందిన 50లక్షల మంది ఈ రైలుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 2019 మార్చి నాటికి తొలి దశ పనులు పూర్తి చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. మిగతా మూడు దశల పనులను కూడా 2019లోనూ పూర్తి చేస్తామన్నారు. 2018-19 రైల్వే బడ్జెట్‌లో ఈ ప్రాజెక్ట్ కోసం రూ.125కోట్లు కేటాయించారు. వేములవాల, సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌ను టచ్ చేస్తూ ఈ రైలు రాకపోకలు సాగనున్నాయి.




మహా మంచుబిలం

విశ్వం అనేక వింతలకు నిలయం. ఆ వింతలను ఎన్నో ప్రయోగాల ద్వారా అంతరిక్ష శాస్త్రవేత్తలు వెలుగులోకి తెస్తారు. అలా వారు చేసిన ప్రయోగాలలో కనుగొన్న ఫలితమే అంగారక మంచుబిలం. అంగారకుడిపై వెలుగు చూసిన మహామంచు బిలమిది. ఐరోపా అంతరిక్ష సంస్థకు చెందిన మార్స్ ఎక్స్‌ప్రెస్ ప్రోబ్ వ్యోమనౌక దీన్ని వెలుగులోకి తెచ్చింది. అరుణ గ్రహ ఉత్తర ధ్రువంలో కనిపిస్తున్న ఈ బిలం వ్యాసం 82కిలోమీటర్లు, లోతు 2కిలోమీటర్లు ఉంటుందని కనుగొన్నారు. సోవియట్ అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన పితామహుడు సెర్గీకరోలోవ్ పేరిట దీనికి సెర్గీ అని పేరుపెట్టారు. అంగారకుని మంచుబిలం పేరు సెర్గీ. ఈ బిలం అంతా మంచుగడ్డలతో నిండి ఉంటుంది. ఇలా మంచుగడ్డలతో నిండి ఉన్న ఈ బిలంను గమనిస్తే, అంగారకుడిపై ద్రవరూపంలో నీరుండొచ్చనే వాదనకు మరింత బలం చేకూరుస్తోంది.

భూతాపం... జలగండం





గ్లోబల్ వార్మింగ్‌ని భూతాపం అనికూడా అంటారు. భూతాపం వలన అనేక నష్టాలు సంభవిస్తాయి. భూతాపం వలన పశ్చిమతీరానికి జలగండం పొంచి ఉందని చెబుతున్నారు. దీనివలన సముద్రమట్టం దాదాపు 30అడుగుల వరకు పెరగనున్నది అంటున్నారు. దీని ఫలితంగా కృష్ణా, గోదావరి మైదానాలు ఉప్పునీటి మయమైపోతాయి. ఏటికేడు పెరుగుతున్న భూతాపం భవిష్యత్‌లో భారత్‌కు తీరని ఆవేదన మిగల్చనుందని భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం జరిపిన పరిశోధనల ద్వారా తెలిసింది. భారతీయ తీరప్రాంతాల్లో ప్రాంతాన్ని బట్టి సగటున 3.5అంగుళాలు మొదలుకొని 34.6 అంగుళాల నీటిమట్టం పెరుగుతుంది. ముఖ్యంగా గుజరాత్‌లోని ఖంభత్, కచ్‌తోపాటు ముంబయి, కొంకణ్ తీరప్రాంతం, దక్షిణ కేరళకు ముప్పు ఎక్కువగా పొంచి ఉంది. గంగా, కృష్ణా, గోదావరి, కావేరి, మహానది పరివాహక మైదాన ప్రాంతాల్లోని భూగర్భ జలాలు ఉప్పునీటిమయం కానున్నాయి. ఫలితంగా కోట్లాదిమంది భారతీయులు తాగునీరు దొరకక, పంటలు పండక ఆహారానికి కటకటలాడాల్సిన పరిస్థితి కలుగుతుందని హెచ్చరిస్తున్నారు. కేంద్ర పర్యావరణశాఖ అధ్యయనం ప్రకారం సముద్ర నీటిమట్టం పెరిగిపోవడంతోపాటు తీవ్రమైన వాతావరణ మార్పుల కారణంగా జనావాసాలు జలమయం అవుతాయి. గంగా మైదానం, దక్కన్, దక్షిణ భారతదేశంలో పెద్ద జలవనరులు సముద్రం నీటితో నిండిపోతాయి. ఈ ప్రాంతాల్లో ఖాళీప్రదేశాలన్నీ జలమయమవుతాయి. 2050 నాటికి మధ్య-దక్షిణ భారతదేశాల్లోని తాగునీటికి తీవ్రకొరత ఏర్పడుతుందని ఐక్యరాజ్యసమితికి చెందిన 'యునెస్కో' ఇచ్చిన నివేదిక స్పష్టం చేస్తుంది.

ఈ గండం నుంచి బయటపడాలంటే ప్రభుత్వం తీసుకునే చర్యలు...తీరప్రాంత పరిరక్షణకు కేంద్రం తన వంతు కృషి చేస్తోంది. తీరప్రాంత నియంత్రణ ప్రాంతం, ద్వీప పరిరక్షణ ప్రాంతం పేరిట చట్టాలు చేసింది. వీటి అమలు బాధ్యతను తీరప్రాంతాలు ఉన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అప్పగించింది. ఫలితంగా మడ అడవులు ఎక్కువగా విస్తరించాయి. ఇంకా వీటిని అభివృద్ధి చేయటానికి ఆధునిక ప్రయత్నాలు చేపడుతున్నారు.



మార్మోట్...!

హిమాలయన్ మార్మోట్‌లు హిమాలయాల్లో జీవించే మార్మోట్‌లు అనే పెద్ద ఉడుతలు. వాటి మనుగడ పరిశీలించిన శాస్త్రవేత్తలు వాటి పూర్తి జన్యుపటాన్ని ఆవిష్కరించారు. ఇవి సముద్ర మట్టానికి 5వేల మీటర్లకు పైగా ఎత్తులో ఇవి ఎలా మనుగడ సాగిస్తున్నాయన్నది గుర్తించేందుకు తాజా పరిశోధనలు తెలియజేస్తాయి. భారత్, పాకిస్థాన్, చైనా, నేపాల్‌లోని హిమాలయ ప్రాంతాల్లో ఈ మార్మోట్‌లు కనిపిస్తుంటాయి. ఆక్సిజన్ కొరతను, విపరీతమైన చలిని వనరుల లేమిని తట్టుకుని జీవిస్తాయి. శీతాకాలంలో ఆరునెలలకు పైగా సుప్తావస్థలో ఉంటాయి. సుప్తావస్థ స్థితి, ఎత్తయిన ప్రాంతాల్లో మనుగడకు అనుగుణంగా జన్యుపరంగా వీటిలో వచ్చిన మార్పుల గురించి జన్యుపటం ద్వారా వివరాలు తెలుస్తున్నాయని చైనాలోని షియాన్ జియావో టాంగ్ వర్సిటీ పరిశోధకులు తెలియజేశారు. ఆయా ప్రక్రియల్లో ఎస్ఎల్‌సీ25ఏ14, ఏఏఎమ్‌పీ అనే జన్యువులు ముఖ్య పాత్ర పోషిస్తాయి అని తెలిపారు. మార్మోట్‌ల జీవన విధానం అంతా ఈ జన్యువులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. మార్మోట్‌ల మధ్య జన్యు వ్యక్తీకరణల్లోని భేదాలను గుర్తించేందుకు వాటి ఆర్ఎన్ఏ పటాలను కూడా పరిశోధకులు ఆవిష్కరించారు. మంగోలియన్ మార్మోట్‌ల జాతి నుంచి 20లక్షల సంవత్సరాల క్రితం హిమాలయన్ మార్మోట్‌లు వేరుపడ్డట్టు తమ అధ్యయనంలో వెల్లడయ్యిందని వారు తెలిపారు.

లావు... రాజకీయ సమస్యా!



అమెరికాలోని ఇల్లినాయిస్ యూనివర్సిటీలో ఒక వింత పరిశోధన జరిగింది. వారు మధ్యతరగతి దేహభాగాలపై పరి శోధన చేసి 180 కోట్ల కిలోల అదనపు కొవ్వుభారం అక్కడ పేరుకుపోయిందని తేల్చారు. ఆ కొవ్వునంతా నూనెగా మారిస్తే అది 10 లక్షల కార్లకు రెండు నెలల ఇంధనంగా పనికి వస్తుందని తేల్చారు. ఆ తరువాత వాళ్ళు బరువు తగ్గటానికి చేసే ప్రయత్నాలవల్ల నెలకు 16 లక్షల కార్లకు సరిపోయే బ్యాటరీలను తయారు చేయవచ్చు. కాబట్టి ముందు ముందు లావెక్కడం కూడా రాజకీయ, ఆర్థిక విషయంగా చర్చనీయాంశం కావచ్చు.

అల్లు అర్జున్ కొత్త ప్రాజెక్టు ఖరారు









అల్లు అర్జున్ అభిమానులకు శుభవార్త. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' తర్వాత ఆయన కొత్త ప్రాజెక్టు ఖరారైంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ పతాకాలపై ఎస్. రాధాకృష్ణ, అల్లు అరవింద్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించనున్నారు. 2019 జనవరిలో ఈ సినిమా షూటింగ్ ఆరంభం కాబోతోంది. ఈ మేరకు చిత్ర బృందం తాజాగా ప్రకటన విడుదల చేసింది. బన్నీ 19వ సినిమాగా ఇది రూపుదిద్దుకోబోతోంది. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' వంటి హిట్‌ల తర్వాత బన్నీ, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తోన్న మూడో చిత్రమిది. దీంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయని నిర్మాతలు తెలిపారు. చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. అందరికీ చిత్ర బృందం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'AA19' అనే హ్యాష్‌ట్యాగ్ ప్రస్తుతం ట్విటర్ ఇండియా ట్రెండింగ్‌లో మూడో స్థానంలో ఉంది. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాను రూ.65 కోట్లతో నిర్మించగా.. బాక్సాఫీసు వద్ద రూ.140 కోట్లు రాబట్టినట్లు విశ్లేషకులు అంచనా వేశారు.



'బిగ్‌బాస్' సీజన్ 12 విజేత దీపికా



బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'బిగ్‌బాస్' సీజన్ 12 విజేతగా హిందీ బుల్లితెర నటి దీపికా కక్కర్ నిలిచారు. ఆదివారం రాత్రి బిగ్‌బాస్ హౌజ్‌లో గ్రాండ్ ఫినాలే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సల్లూభాయ్ విజేతను ప్రకటించారు. ఇందులో టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ కూడా పాల్గొన్నారు. శ్రీశాంత్, దీపిక మధ్య జరిగిన సంఘటనలే వారిని టాప్ ఫైనలిస్ట్‌లుగా నిలబెట్టాయి. కానీ విజయం మాత్రం దీపికనే వరించింది.

'నాన్నకు తెలిస్తే చంపేస్తారు' : జాన్వి కపూర్



బాలీవుడ్ నటి జాన్వి కపూర్ ఓ అంతర్జాతీయ మ్యాగజైన్‌కు ఫొటోషూట్ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు జాన్వి ఇచ్చిన ఫొటోషూట్‌లతో పోలిస్తే ఇది కాస్త విభిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఈ ఫొటోషూట్ కోసం జాన్వి.. తన జుట్టును పొట్టిగా కత్తిరించేసుకున్నారు. అయితే తాను ఇలా జుట్టు కత్తిరించుకున్న విషయం తన తండ్రి బోనీ కపూర్‌కు తెలీదని అంటున్నారు జాన్వి. 'ఫొటోషూట్ కోసమే నా జుట్టును ఇలా కత్తిరించేసుకున్నాను. నాన్నకు ఈ విషయం తెలీదు. నన్ను ఇలా చూస్తే చంపేస్తారు.' అని వెల్లడించారు జాన్వి. గతంలో జాన్వి 'బ్రైడ్స్ టుడే', 'వోగ్ ఇండియా', 'గ్రేజియా' వంటి మ్యాగజైన్లకు ఫొటోషూట్స్ ఇచ్చారు. ఈ ఏడాది 'ధడక్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు జాన్వి. తొలి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం తొలి ఐఏఎఫ్ మహిళా పైలట్ గుంజన్ సక్సేనా బయోపిక్‌లో నటిస్తున్నట్లు తెలుస్తోంది. పైలట్ దుస్తుల్లో జాన్వి ఫొటోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో పాటు ఆమె 'తఖ్త్' అనే చారిత్రక చిత్రంలోనూ కీలక పాత్రలో నటించనున్నారు. ఈ చిత్రాన్ని బాలీవుడ్ దర్శక-నిర్మాత కరణ్ జోహార్ తెరకెక్కించనున్నారు.

సన్నీకి ఆయనతో కలిసి నటించాలనుందట!



బాలీవుడ్ నటి సన్నీ లియోని మాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నారని ఇప్పటికే చాలా సార్లు వార్తలు వచ్చాయి. అయితే ఒక్కసారి కూడా తన మలయాళం ప్రాజెక్టు గురించి సన్నీ స్పందించలేదు. కాగా తాజాగా ఓ మాలీవుడ్ దర్శకుడు తన సినిమాలోని ముఖ్యమైన పాత్ర కోసం సన్నీని కలిశారట. ఆమెకు కథ నరేట్ చేశారట. ఈ సమయంలో ఆమె మోహన్‌లాల్‌తో కలిసి పనిచేసే అవకాశం ఏదైనా ఉందా? అని అడిగినట్లు తెలిసింది. దీంతో సన్నీ మలయాళం స్టార్‌తో కలిసి పనిచేయాలి అనుకుంటున్నారంటూ ఆన్‌లైన్‌లో తెగ ప్రచారం జరుగుతోంది. అయితే నిజంగానే సన్నీ అలా అన్నారా? అనే విషయంలో అధికారికంగా స్పష్టత లేదు. మమ్ముట్టి కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'మధుర రాజా'. ఇందులోని ప్రత్యేక గీతంలో సన్నీ నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2010 బ్లాక్‌బస్టర్ 'పోకిరి రాజా'కు సీక్వెల్ ఇది. సన్నీ ప్రస్తుతం 'వీరమహాదేవి' సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమాలో ఆమె సమరయోధురాలి పాత్రలో కనిపించనున్నారు. వీసీ వడివుడయాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌పై వివాదం మొదలైంది. శృంగార తారగా గుర్తింపు పొందిన సన్నీ ఇలాంటి పాత్రలో నటించడాన్ని కర్ణాటక రక్షణ వేదిక కార్యకర్తలు వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేశారు.

త్వరలో విశాల్ నిశ్చితార్థం



సినీ నటుడు, నడిగర్ సంఘం అధ్యక్షుడు విశాల్ త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారట. ఈ విషయాన్ని ఆయన తండ్రి, ప్రముఖ నిర్మాత జీకే రెడ్డి కోలీవుడ్ మీడియా వర్గాలతో చెప్పినట్లు తెలుస్తోంది. అనీశా అనే యువతితో విశాల్ వివాహం జరగబోతున్నట్లు పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో నిశ్చితార్థ వేడుకను నిర్వహించనున్నారట. పెళ్లికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. అయితే నడిగర్ సంఘం కోసం కొత్త భవనాన్ని నిర్మించిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని గతంలో విశాల్ శపథం చేశారట. కాబట్టి ప్రస్తుతానికి నిశ్చితార్థ పనులు మొదలుపెట్టే పనిలో ఆయన కుటుంబీకులు ఉన్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. సినీ నటి వరలక్ష్మి శరత్‌కుమార్‌ను విశాల్ పెళ్లిచేసుకోబోతున్నట్లు గతంలో వార్తలు వెలువడ్డాయి. ఇప్పటికీ వీరి గురించి వదంతులు వస్తూనే ఉన్నాయి. దీనిపై ఇటీవల వరలక్ష్మి ట్విటర్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. విశాల్ తనకు కేవలం మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేశారు. తాను పెళ్లిచేసుకోవడంలేదని, ఇలాంటి వార్తలు ఎవరు సృష్టిస్తున్నారో తనకు తెలుసని హెచ్చరించారు.


ఎన్టీఆర్ బయోపిక్‌లో

'నర్సీపట్నం' లక్ష్మిశ్రీ



విశాలాంధ్ర-నర్సీపట్నం : తెలుగు చలన చిత్ర పరిశ్రమలో విశాఖ జిల్లా నర్సీపట్నం మండలానికి చెందిన లక్ష్మిశ్రీ తనదైన శైలిలో సత్తా చాటుతున్నారు. ఈమె సినీ పరిశ్రమలో అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. తాజాగా బాలకృష్ణ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఎన్టీఆర్ బయోపిక్‌లో కూడా ఈమెకు అవకాశం లభించింది. లక్ష్మిశ్రీ 60కు పైగా సీరియల్స్, 15 వరకు సినిమాల్లో నటించారు. ఈటీవీ కామెడిలో గ్యాంగ్, ఈటీవీలో ఆడదే ఆధారం, అంత:పురం, అభిషేకం, తూర్పువెళ్లు రైలు, జీతెలుగులో ఆరుగురు అత్తలు, షిర్డిసాయి కథలు, కలవారి కోడలు, మాటీవీలో మిస్టర్ మల్లన్న, శివరంజని, జెమినీలో పెళ్లి పుస్తకం, తలంబ్రాలు, గేమ్ షోలో స్టార్‌మహిళ, గోల్డ్‌ర్యాష్, రాజురాణి, కబడ్డి, ఛలో ఛాలెంజ్‌లే, మహిళలు మహరాణులు, సినిమాలు తేజ డైరెక్షన్‌లో వెయ్యి అబద్దాలు, గౌరవం, రామోజీరావు నిర్మాతగా దాగుడుమూతలు, రామ్‌గోపాల్‌వర్మ డైరక్షన్‌లో అనుక్షణం, ఝుమ్మందినాదం, దోని, జైతెలంగాణాలో నటించగా, తాజాగా ఎన్టీఆర్ బయోపిక్‌లో విశాఖ ఎమ్మెల్యే గండి మాధవి పాత్రలో ఈమె ప్రస్తుతం నటిస్తున్నారు. ప్రైవేటు అల్బమ్స్ నల్లపోచమ్మ, యరుకుల నాంచారి, గండి మైసమ్మ, మల్లన్న, ఇంకా పేర్లు పెట్టనివి మరిన్ని ఈమె ఖాతాలో ఉన్నాయి. 100 పైగా స్టేట్ ప్రోగ్రామ్ చేసిన ఘనత లక్ష్మిశ్రీకి ఉంది. సంక్రాంతి సందర్భంగా మకరజ్యోతి మహోత్సవాలకు గత 8 సంవత్సరాల నుండి నర్సీపట్నంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి అయ్యన్నపాత్రుడు సంక్రాంతి మహోత్సవ కార్యక్రమంలో లక్ష్మిశ్రీ వల్లే మరికొంతమంది ఆర్టిస్టులు నర్సీపట్నం నుండి చిత్ర పరిశ్రమకు వస్తున్నారని అనేకమార్లు లక్ష్మిశ్రీని కొనియాడారు. ఇలా తెలుగు పరిశ్రమలో ఎన్నో ఒడిదుడుకుల మధ్య తన ప్రతిభను చాటుతూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. సినీరంగంలో మెరవాలనే ఆశతో చేసిన ప్రయత్నానికి ప్రతిఫలం లభిస్తుందని లక్ష్మిశ్రీ చెప్పారు. తనకంటూ పరిశ్రమలో స్థానం సాధించాలనే తపనతో అవకాశాలను అందిపుచ్చుకొని టాలీవుడ్‌లో మెరుస్తున్నారు.

ప్రముఖ కన్నడ నటుడు లోక్‌నాథ్ కన్నుమూత



సీనియర్ కన్నడ నటుడు లోక్‌నాథ్(91) కన్నుమూశారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని రవీంద్ర కళాక్షేత్ర ప్రాంగణంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. సాయంత్రం 4 గంటలకు బాణశంకరి ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. దాదాపు 650 చిత్రాలు, వెయ్యి నాటకాల్లో లోక్‌నాథ్ నటించారు. 1970లో 'సంస్కార' అనే చిత్రంతో ఆయన కన్నడ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఈ సినిమా ఆయనకు జాతీయ అవార్డు తెచ్చిపెట్టింది. అభిమానులు ఆయన్ను 'అంకుల్' అని సంబోధిస్తుంటారు. ఆయన చివరగా నటించిన చిత్రం 'భీమతీరదల్లి'.

ఉల్లి ధర విని ఆగిన రైతు గుండె

మాందసౌర్‌లో విషాద ఘటన

మాందసౌర్ : ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించలేదని తెలిసి ఓ రైతు గుండె ఆగిపోయింది. ఉల్లి రైతుల కష్టాల గురించి ఇటీవల మహారాష్ట్రకు చెందిన ఒక రైతు ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించలేదు. మధ్యప్రదేశ్‌లోని మాందసౌర్‌కు చెందిన భీరులాల్ మాల్వీయ 27 క్వింటాళ్ల ఉల్లిని పండించాడు. ఉల్లిని మార్కెట్‌లో విక్రయించేందుకు వచ్చారు. క్వింటాల్ రూ.372 చొప్పున 27 క్వింటాళు అమ్మగా కేవలం రూ.10,440 మాత్రమే వచ్చాయి. అంత తక్కువ ధర వచ్చిందని తెలిసి మాల్వీయ గుండె నొప్పితో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తుండగా ప్రాణాలు విడిచాడు. మార్కెట్లో ఉల్లి ధర అంతకంతకూ పడిపోతోందని, సరైన ధర రాకపోవడంతో గుండెపోటు వచ్చి తన తండ్రి ప్రాణాలు విడిచాడని మాల్వీయ కుమారుడు రవి ఆవేదన వ్యక్తం చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం తమ కుటుంబానికి సహాయం చేయాల్సిందిగా ఆయన కోరాడు. మధ్యప్రదేశ్‌లోని కొన్ని మార్కెట్లలో క్వింటాల్ ఉల్లి ధర రూ.50 నుంచి రూ.800 మేర పలుకుతోంది.

'నా ఆస్తి రాయించుకున్నారు'

ఎస్పీ, మాజీ ఎంపీపై రియల్టర్ ఫిర్యాదు

లక్నో : తనను బెదిరించి ఓ మాజీ ఎంపీ తన ఆస్తి మొత్తం రాయించుకున్నాడని ఉత్తరప్రదేశ్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి మోహిత్ జైస్వాల్ ఆరోపించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా పోలీసుల ఎదుటే ఈ తతంగమంతా జరిగిందని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డిసెంబరు 26న కొంతమంది వ్యక్తులు తన ఇంటికి వచ్చి.. వ్యాపారం గురించి మాట్లాడాలని చెప్పి.. ఆ తర్వాత తన కారులోనే కిడ్నాప్ చేశారని మోహిత్ జైస్వాల్ పేర్కొన్నాడు. లక్నో నుంచి దాదాపు 316 కిలోమీటర్ల దూరంలో ఉన్న డియోరియా జైలుకు తీసుకుని వెళ్లారని తెలిపాడు. ఆ తర్వాత జైలు కాంప్లెక్స్‌లో... సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మాజీ ఎంపీ అతీఖ్ అహ్మద్‌తో మాట్లాడాల్సిందిగా తనకు సూచించారన్నాడు. అయితే ఆ సమయంలో జైలు సిబ్బంది మొత్తం అక్కడే ఉన్నారని... అయినప్పటికీ అతీఖ్ అహ్మద్, ఆయన కొడుకులు దాడి చేసి బలవంతంగా తన ఆస్తి రావడం వాస్తవమేనని జైలు సిబ్బంది తెలిపారు. అతడు కిడ్నాప్ అయినట్టుగానీ, వారి మధ్య జరిగిన ఘర్షణ గురించి గానీ తమకు తెలియదని పేర్కొన్నారు. ఈ క్రమంలో మోహిత్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు మీడియాతో తన బాధను వెళ్లబోసుకున్నాడు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి నివేదికను 24 గంటల్లోగా సమర్పించాల్సిందిగా యోగి ప్రభుత్వం డియోరియా జైలు ప్రధాన అధికారిని ఆదేశించింది. ఓ కేసులో అరెస్టైన మాజీ ఎంపీ అతీఖ్ అహ్మద్ ప్రస్తుతం డియోరియా జైలులో ఉన్నారు.

మోడీ రైతు వ్యతిరేకి..

కుమారస్వామి, సిద్ధరామయ్య విమర్శ



బెంగళూరు : ప్రధానమంత్రి నరేంద్రమోడీ రైతు వ్యతిరేకి అంటూ కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. తమ ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రుణమాఫీ పథకాన్ని విమర్శిస్తూ, కర్ణాటక ప్రభుత్వం రైతులతో ఆడుకుంటోందన్న మోడీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం మోడీ దేశప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కుమారస్వామి తెలిపారు. ఇప్పటికే చెల్లింపు ప్రక్రియ మొదలైనట్టు వెల్లడించారు. గౌరవమైన పదవిలో ఉన్న వ్యక్తి ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమన్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం ముందుకు రావడం లేదని, ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం తమ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేస్తున్నారని, వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రకటనలు చేయకూడదని ఆయన మోడీకి హితవు పలికారు. ఇప్పటివరకు 60వేల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.350 కోట్లు జమ చేసినట్టు కుమారస్వామి వివరించారు. వారం వారం చొప్పున చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. 2019 జనవరి చివరి నాటికి అర్హులైన రైతులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. మైసూరులో విలేకరులతో మాట్లాడిన సిద్ధరామయ్య మోడీని రైతు వ్యతిరేకిగా అభివర్ణించారు. 'ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మా ప్రతినిధి బృందంతో కలిసి ఆయన (మోడీని)ను రెండు సార్లు కలిశాను. ఒక్క రూపాయి కూడా మాఫీ చేసేందుకు ఆయన ఒప్పుకోలేదు. ప్రధానిగా కొనసాగే నైతిక హక్కు ఆయనకు ఉందా?' అంటూ సిద్ధరామయ్య ప్రశ్నించారు. మోడీ, ఆయన ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైత్యాంగానికి వ్యతిరేకమన్నారు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో నిన్న మొన్నటి వరకు అధికారంలో ఉన్న ఆయన పార్టీ రైతులకు ఏం చేసిందో చెప్పాలంటూ మోడీని నిలదీశారు. గతవారంలో ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో జరిగిన ఓ ర్యాలీలో మోడీ మాట్లాడుతూ లక్షలాది మంది రైతులకు రుణమాఫీ చేస్తామన్న కర్ణాటకలోని జేడీ(ఎస్)- కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం కేవలం 800 రైతులకే రుణమాఫీ చేసిందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

సోహ్రాబుద్దీన్ కేసు దర్యాప్తును

నీరుగార్చిందెవరు..?

రాహుల్ అడగాల్సిన ప్రశ్న ఇదే : అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ : సోహ్రాబుద్దీన్ కేసులో దర్యాప్తును నీరుగార్చింది ఎవరనేది కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అడగవల్సిన ప్రశ్న అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ముంబై ప్రత్యేక సీబీఐ కోర్టు సొహ్రాబుద్దీన్ కేసులో నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో న్యాయమూర్తి తీర్పుకంటే నిందితుల వ్యాఖ్యలే ప్రాధాన్యాంశమని జైట్లీ పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థ ఈ కేసులో నిజాలను రాబట్టడం కోసం ప్రారంభం నుంచి వృత్తిపరమైన నైపుణ్యంతో దర్యాప్తు జరపలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ కేసును కొందరు రాజకీయ నేతలవైపు మళ్లించడంపైనే దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ స్పందిస్తూ 'సొహ్రాబుద్దీన్‌ను ఎవరూ చంపలేదు' అని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై అరుణ్ జైట్లీ ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందించారు. దీనికి బదులుగా సొహ్రాబుద్దీన్ కేసు దర్యాప్తును ఎవరు ధ్వంసం చేశారు అని అడిగి ఉండవలసిందన్నారు. ఇది సరైన ప్రశ్న అయి ఉండేదన్నారు. దీనికి సరైన సమాధానం వచ్చి ఉండేదన్నారు. సంస్థాగత స్వాతంత్ర్యం కావాలని ఆలస్యంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నవారు తాము అధికారంలో ఉన్నపుడు సీబీఐకి ఏం చేసినదీ తీవ్రంగా ఆత్మావలోకనం చేసుకోవాలని సలహా ఇచ్చారు.

రాజ్యసభలో ప్రతిపక్ష నేత హోదాలో తాను 2013 సెప్టెంబరు 27న అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు లేఖ రాశానని జైట్లీ పేర్కొన్నారు. సోహ్రాబుద్దీన్, తులసీ ప్రజాపతి, ఇష్రత్ జహాన్, రాజిందర్ రాథోర్, హరేన్ పాండ్యా కేసుల్లో దర్యాప్తు ఏ విధంగా రాజకీయమయమవుతున్నదీ వివరించినట్లు తెలిపారు.



'తలాక్'పై ప్రతిష్టంభన

- జరగని చర్చ : రాజ్యసభ వాయిదా
- సెలక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్షాల డిమాండు

న్యూఢిల్లీ : వివాదాస్పద ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ జరగకుండానే రాజ్యసభ బుధవారానికి వాయిదా పడింది. తాజా బిల్లును స్క్రూటినీ కోసం సెలక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండు నడుమ పెద్దల సభ రసాభాస అయింది. ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) బిల్లు, 2018ను న్యాయమంత్రి రవిశంకర్ ప్రసాద్ సభ ముందుంచారు. వెంటనే ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండు చేశాయి. ఈ నేపథ్యంలో సభలో ప్రతిష్టంభన నెలకొంది. ఎలాంటి చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది. ఉదయం సమావేశం ప్రారంభమైనప్పుడు కావేరి అంశంపై ఏఐఏడీఎంకే సభ్యులు ఆందోళన చేయడంతో సభ రెండుసార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత కూడా 15 నిమిషాల పాటు సభ వాయిదా పడింది. రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ ఈ బిల్లు చాలా ప్రాముఖ్యమైనది. దీనిని నిశితంగా పరిశీలించాలి. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలి. వివిధ పార్టీల సభ్యులు కూడా ఇదే డిమాండు చేస్తున్నారు' అని అన్నారు. చట్టం చేసే ముందు సంబంధిత బిల్లును సెలక్ట్ కమిటీకి పంపే ఆచారాన్ని బీజేపీ ప్రభుత్వం మార్చివేసిందని విమర్శించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి విజయ్ గోయల్ మాట్లాడుతూ, ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది కానీ కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టిస్తోంది.

ఈ బిల్లుకు లోక్‌సభలో కాంగ్రెస్ మద్దతు తెలిపింది. ముస్లిం మహిళల వివాహ హక్కులకు సంబంధించిన ఈ అంశాన్ని కాంగ్రెస్‌తో పాటు మరికొన్ని పార్టీలు రాజకీయం చేస్తున్నాయి' అని విమర్శించారు. గోయల్ వ్యాఖ్యలపై రాజ్యసభలో కాంగ్రెస్ డిప్యూటీ నేత ఆనంద్ శర్మ స్పందించారు. 'రాజకీయం చేస్తున్నది ప్రభుత్వమే.. ఈ బిల్లును ఎవ్వరూ అడ్డుకోవడం లేదు.. సెలక్ట్ కమిటీకి పంపాలనే సూచిస్తున్నాం. చట్టబద్ధంగా పరిశీలించకుండా లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన రాజ్యసభలోనూ అదే జరగాలని లేదు. దీనిని తప్పనిసరిగా సెలక్ట్ కమిటీ స్క్రూటినీకి పంపాలి. రాజ్యసభ రబ్బర్ స్టాంపు కాదు' అని ఆనంద్ శర్మ అన్నారు. ప్రసాద్ స్పందిస్తూ 'ఈ బిల్లు చాలా ముఖ్యమైనది. దీనిపై చర్చను కోరుకుంటున్నాం. సలహాలు, సూచనలను స్వాగతిస్తాం. ఆర్డినెన్స్ తీసుకొచ్చినా ట్రిపుల్ తలాక్ సంఘటనలు జరుగుతున్నాయి. ఇది లింగ సమానత్వానికి సంబంధించిన అంశం. చర్చించి ఈ బిల్లును ఆమోదించాలి' అని అన్నారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ 'సభ సజావుగా సాగాలని ఆశిస్తున్నా. రేపు సెలవు కాబట్టి సభ కార్యాకలాపాలకు సభికులు సహకరించాలి' అని అన్నారు. అయితే సభ్యులు తమ ఆందోళనలు కొనసాగించడంతో ఆయన సభను బుధవారానికి వాయిదా వేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించిన విషయం తెలిసిందే.

విదేశాలకు తీసుకెళితే అమ్మ బతికేదే...

జయ మృతిపై మంత్రి సంచలన వ్యాఖ్యలు..

చెన్నై : తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతిపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి సీవీ షణ్ముగం సంచలన వ్యాఖ్యలు చేశారు. 'అమ్మ' మృతి వెనుక కుట్ర జరిగిందనీ... సరైన వైద్యం అందించి ఉంటే ఆమె బ్రతికేవారని ఆయన అన్నారు. చికిత్స కోసం జయలలితను విదేశాలకు తరలించాలన్న ప్రయత్నాలను చెడగొట్టారని ఆరోపించారు. 'జయలలితకు యాంజియోగ్రామ్ చేయకుండా అడ్డుకున్నది ఎవరు? దీనిపై కుట్రకేసు నమోదు చేయాలి. ఆమె మృతిపై నెలకొన్న మిస్టరీ వీడాలంటే కేసు పెట్టి, సంబంధిత వ్యక్తులపై విచారణ జరిపించాలి' అని మంత్రి షణ్ముగం డిమాండు చేశారు. తీవ్ర అస్వస్థత కారణంగా చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో 72 రోజుల పాటు చికిత్స తీసుకున్న జయలలిత 2016 డిసెంబరు 5న మృతి చెందారు. అయితే ఆమె మృతిపై అనుమానాలు, ఆరోపణలు వెల్లువెత్తడంతో... అన్నాడీఎంకే ప్రభుత్వం జస్టిస్ అరుముగస్వామి నేతృత్వంలో విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. జయలలితకు చికిత్స అందించే విషయంలో అపోలో ఆస్పత్రి, వీకే శశికళ కుమ్మక్కయ్యారనేందుకు తగిన ఆధారాలు ఉన్నాయని అరుముగస్వామి కమిషన్ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలోనే న్యాయమంత్రి తాజా ఆరోపణలు చేయడం గమనార్హం. సకాలంలో ఆమెకు యాంజియోగ్రామ్ నిర్వహించి చికిత్స చేసి ఉంటే ఆమె ఆరోగ్యం క్షీణించేదికాదని కమిషన్ పేర్కొంది. విచారణ కమిషన్ ఆరోపణలను అపోలో ఆస్పత్రి ఖండించింది. గతేడాది సెప్టెంబరులో ఏర్పాటైన ఆరుముగస్వామి కమిషన్.. ఇప్పటి వరకు 100 మందికి పైగా విచారించింది. వచ్చేనెల 7, 8 తేదీల్లో ఆరోగ్యమంత్రి సి.విజయభాస్కర్, డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం తమ ముందు విచారణకు హాజరు కావాలంటూ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది.

1984 సిక్కుల ఊచకోత కేసు

కోర్టులో లొంగిపోయిన సజ్జన్‌కుమార్

మాండోలి జైలుకు తరలింపు



న్యూఢిల్లీ : 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషి కాంగ్రెస్ మాజీ నాయకుడు సజ్జన్ కుమార్ సోమవారం ఇక్కడి ఒక కోర్టు ముందు లొంగిపోయారు. మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన ఈ అల్లర్ల కేసులో కుమార్‌కు ఈనెల 17న ఢిల్లీ హైకోర్టు జీవిత ఖైదు, రూ.5 లక్షల జరిమానా విధించింది. మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఆదితిగార్గ్ ఎదుట సజ్జన్‌కుమార్ లొంగిపోగా, ఉత్తర ఢిల్లీలోని మాండోలి జైలులో ఉంచాలని న్యాయమూర్తి ఆదేశించారు. కుమార్‌తోపాటు మహీందర్ యాదవ్, కిషన్ ఖోఖర్ కూడా దోషులుగా కోర్టు నిర్ధారించింది. వీరిద్దరికీ పదేళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. వీరు కూడా సోమవారం లొంగిపోయారు. కాగా అత్యంత భద్రత కలిగిన తీహార్ జైలులో ఉంచాలంటూ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ భద్రతకు సంబంధించి ఆయన అభ్యర్థనను అనుమతిస్తూ, ప్రత్యేక వాహనంలో ఆయనను జైలుకు తీసుకువెళ్లాలని పోలీసులను ఆదేశించింది. అయితే మరో సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో ప్రాసిక్యూషన్ ఎదుర్కొంటున్న కుమార్‌కు ముప్పు ఉన్నందున భద్రత కల్పించాలన్న అభ్యర్థనను కోర్టు పరిగణనలోకి తీసుకున్నట్లు కోర్టుకు హాజరైన న్యాయవాది ఒకరు తెలిపారు. తీహార్ జైలుకు పంపించాలన్న అభ్యర్థనను మాత్రం తోసిపుచ్చుతూ నిబంధనల ప్రకారం మాండోలి జైలుకు తరలించాల్సిందిగా కోర్టు పేర్కొన్నట్లు ఆయన వివరించారు. ఇదిలాఉండగా లొంగిపోవడానికి సజ్జన్‌కుమార్‌కు హైకోర్టు డిసెంబరు 31 తుది గడువు విధించింది. నెల రోజుల సమయం ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను డిసెంబరు 21న న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టు తనకు జీవిత ఖైదు విధిస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే డిసెంబరు 17న ఈ కేసులో సజ్జన్ కుమార్‌ను దోషిగా హైకోర్టు నిర్ధారించింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి కుమార్ రాజీనామా చేశారు. 1984, నవంబరు 1-2 తేదీల్లో ఢిల్లీలోని పాలం కాలనీలోని రాజ్ నగర్ పార్ట్-1 ప్రాంతంలో ఐదుగురు సిక్కుల హత్య, రాజ్‌నగర్ పార్ట్-2లో ఒక గురుద్వారాను తగలబెట్టిన కేసుల్లో కుమార్ దోషిగా నిర్ధారించబడ్డాడు. తన ఇద్దరు సిక్కు అంగరక్షకుల చేతిలో 1984, అక్టోబరు 31న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు గురైన తర్వాత సిక్కు వ్యతిరేక అల్లర్లు చోటుచేసుకున్నాయి. కుమార్‌తోపాటు కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ బల్వాన్ ఖోఖర్, నావికాదళ విశ్రాంత అధికారి కెప్టెన్ బాగ్మల్, గిరిధర్ లాల్‌లు ఈ కేసులో ఇతర దోషులుగా ఉన్నారు. దేశ రాజధానిలో అప్పట్లో సంభవించిన అల్లర్లలో 2,700 మందికిపైగా సిక్కులు మరణించారని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. 'రాజకీయ ప్రాపకం' కోసం పాకులాడేవారు 'మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం' అని తెలిపింది. 1993లో ముంబైలో, 2002లో గుజరాత్, 2013లో ఉత్తరప్రదేశ్, ముజఫర్‌నగర్‌ల్లో జరిగిన సామూహిక హత్యల తరహాదేనని హైకోర్టు అభిప్రాయపడింది. మైనార్టీలు లక్ష్యంగా జరిగిన దాడులుగా పేర్కొంది. ఈ కేసులో కుమార్‌ను నిర్దోషిగా పేర్కొంటూ 2010లో క్రింది కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు పక్కనబెట్టింది.

రక్షణ ఒప్పందాల్లో

సోనియా, రాహుల్ జోక్యం లేదు

రక్షణ శాఖ మాజీ మంత్రి ఆంటోనీ



న్యూఢిల్లీ : యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీలు రక్షణ ఒప్పందాల్లో ఎన్నడూ జోక్యం చేసుకోలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, రక్షణ శాఖ మాజీ మంత్రి ఎ.కె.ఆంటోనీ సోమవారం తెలిపారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల ఒప్పందంతో సహా రక్షణ సేకరణ లేదా ఏదైనా ఒప్పందాల్లో వారు జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. మునుపటి యూపీఏ ప్రభుత్వం జరిగిన ఒప్పందాన్ని సమర్థించుకుంటూ, అగస్టా వెస్ట్‌ల్యాండ్ ఒప్పందంలో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) విచారణకు మాత్రమే యూపీఏ ప్రభుత్వం ఆదేశించడం జరిగిందని ఆంటోనీ పేర్కొన్నారు. బీజేపీ అసత్యాలను ప్రచారం చేస్తోందని ఆరోపించారు. రక్షణ ఒప్పందాల్లో కుంభకోణాలపై బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న క్రమంలో ఆంటోనీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మాజీ రక్షణ మంత్రిగా నా హయాంలోనే ఆగస్టా వెస్ట్‌ల్యాండ్ సేకరణ జరిగింది. సోనియా, రాహుల్‌లు ఎప్పుడూ ఒప్పందం, సేకరణకు సంబంధించి జోక్యం చేసుకోలేదు' అని ఆయన చెప్పారు. 'అధికారుల బృందం అంచనా వేసిన తర్వాత అగస్టా వెస్ట్‌ల్యాండ్ ఎంపిక జరిగింది' అని అన్నారు. 'ఈ కేసులో అవినీతి గురించి ఇటలీ నుంచి నివేదిక వచ్చింది. నేను కేవలం సీబీఐ విచారణకు మాత్రమే ఆదేశించాను. ఈ ప్రభుత్వం కాదు. అగస్టా వెస్ట్‌ల్యాండ్‌కు వ్యతిరేకంగా ఇటలీలో కేసులో పోరాడాలని అప్పటి మా ప్రభుత్వం అసాధారణ నిర్ణయం తీసుకుంది. చివరకు మేము కేసు గెలిచాం' అని మాజీ రక్షణ మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు, అవినీతి ఆరోపణల గురించి కూడా ఆంటోనీ ప్రశ్నించారు. 'ఒక ఒప్పందంలో అవినీతిపై మీడియాలో ఎప్పుడు వచ్చిందో, అమెరికా, రష్యా, సింగపూర్‌తో సహా ఐదు నుంచి ఆరు శక్తివంతమైన కంపెనీలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని నిర్ణయం తీసుకున్నాం. అది మా ట్రాక్ రికార్డు. ప్రస్తుత ప్రభుత్వ ట్రాక్ రికార్డు ఏమిటి' అని ఆయన ప్రశ్నించారు. అగస్టా కేసులో మధ్యవర్తి క్రిస్టియన్ మిచెల్ ఈడీ విచారణలో పరోక్షంగా సోనియా గాంధీ పేరును ప్రస్తావించారని వార్తలు రావడంతో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధానికి తెరలేచిన సంగతి తెలిసిందే. కాగా అగస్టా వెస్ట్‌ల్యాండ్ ప్రమోటర్లను కాపాడేందుకు ప్రధాని మోడీ, ఆయన ప్రభుత్వం పని చేస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించగా, అగస్టా ఒప్పందంలో దళారీ క్రిస్టియన్ మిచెల్‌ను కాంగ్రెస్ పార్టీ వెనుకేసుకొస్తోందని బీజేపీ మండిపడింది. అగస్టా కేసుపై విచారణ అంటే కాంగ్రెస్ ఎందుకు భయపడుతోందని బీజేపీ ప్రశ్నించింది.

గుజరాత్, ఛత్తీసగఢ్‌లలో రోడ్డు ప్రమాదాలు

12 మంది దుర్మరణం

కచ్/కవార్థ : గుజరాత్ ఛత్తీస్‌గఢ్‌లలో రోడ్లు రక్తసిక్తమయ్యాయి. ఈ రెండు వేర్వేరు ప్రమాదాల్లో 12 మంది మృతిచెందారు. గుజరాత్‌లోని కచ్ జిల్లా భచావూ సమీపంలో జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 10 మంది మృత్యువాత పడ్డారు. వారు ప్రయాణిస్తున్న ఎస్‌యూవీ వాహనం రెండు ట్రక్కుల మధ్య చిక్కుకుపోవడంతో ఈ దారుణం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదం భచావూ రహదారిపై జరిగింది. ఉప్పు లోడుతో వెళుతున్న ట్రాలర్ అదుపుతప్పి డివైడర్ మీదకు ఎక్కింది. రోడ్డుకు మరోవైపునకు దూసుకెళ్లింది. ఎస్‌యూవీని బలంగా ఢీకొంది. ఇదే సమయంలో మరో ట్రక్కు కూడా ఎస్‌యూవీని ఢీకొంది. ఈ ఘటన జరిగిన సమయంలో ఎస్‌యూవీలో 11 మంది ప్రయాణిస్తున్నారు. ఎస్‌యూవీ ప్రయాణిస్తున్న 10 మంది అక్కడికక్కడే మృతిచెందారు. వీరంతా భుజ్ ప్రాంతానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న గుజరాత్ సీఎం విజయ్ రూపాణీ సంతాపం వ్యక్తం చేయడంతో పాటు మృతుల కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

తల్లీకుమార్తె మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని లోహరా ప్రాంతంలో బైక్‌ను ట్రక్కు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న తల్లీకుమార్తెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనను చూసిన స్థానికులు ఆగ్రహంతో ఆ ట్రక్కుకు నిప్పంటించారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తరలించారు. ఒక ట్రక్కు లోడ్‌తో రాయపూర్ వెళుతోంది. తాల్పూర్ గ్రామం సమీపంలోకి రాగానే అది ఒక బైక్‌ను ఢీకొంది. దీంతో ఆ బైక్‌పైనున్న తల్లీ కుమార్తెలు మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ రాఫెల్ దుమారం

- వెనక్కుతగ్గని కాంగ్రెస్ సభ్యులు
- కావేరి, ఏపీకి హోదాపై ఏఐడీఎంకే, టీడీపీ ఆందోళన
- విపక్షాల నిరసనల నడుమ సాగిన కార్యకలాపాలు

న్యూఢిల్లీ : రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై లోక్‌సభ సోమవారం కూడా దద్దరిల్లింది. రాఫెల్ అంశంపై కాంగ్రెస్ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించడంతో దిగవసభలో గందరగోళం నెలకొంది. డిసెంబరు 11న పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి రాఫెల్ అంశంపై కాంగ్రెస్ సభ్యులు తమ ఆందోళనను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కోసం డిమాండు చేస్తున్నారు. జీరో అవర్‌లో పార్టీ సభ్యులు వెల్‌లోకి ప్రవేశించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. ఈ ఒప్పందం పెద్ద కుంభకోణమని విమర్శించారు. జెట్ విమానాల ధరలను ప్రభుత్వం ఎందుకని వెల్లడించడం లేదని ప్రశ్నించారు. ఆయన జేపీసీ విచారణను డిమాండు చేయగా బీజేపీ సభ్యులు వ్యతిరేకించారు. రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ ' అబద్ధాన్ని మళ్లీ మళ్లీ చెబితే అది నిజమైపోదు' అని అన్నారు. ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కాంగ్రెస్ ఎందుకని పారిపోతోందని ఎద్దేవా చేశారు. సభకు యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ కూడా హాజరయ్యారు. పార్లమెంటు బయట కూడా ప్రతిపక్షాలు తమ డిమాండును కొనసాగించాయి.

ఏఐఏడీఎంకే సభ్యులు, టీడీపీ సభ్యులు వెల్‌లోకి ప్రవేశించి కావేరి అంశం, ఏపీకి ప్రత్యేక హోదా కోసం డిమాండు చేశారు. కాంగ్రెస్‌కు చెందిన 20 మందికిపైగా సభ్యులు, ఏఐఏడీఎంకే, టీడీపీ సభ్యులు జీరో అవర్‌లో వెల్‌లోకి ప్రవేశించి వివిధ అంశాలపై తమ ఆందోళనను కొనసాగించారు. ప్రతిపక్షాల నిరసన మధ్య సభ కార్యకలాపాలను స్పీకర్ కొనసాగించారు. వివిధ అంశాలపై అనేక ప్రశ్నలను సభ్యులు లేవనెత్తారు.



భద్రతా బలగాలు కఠిన వాతావరణ పరిస్థితుల్లో పనిచేస్తున్నా జమ్మూకాశ్మీర్‌లో పౌరుల హత్యలు పెరిగిపోతున్నాయని ముజఫర్ హెచ్ బేగ్ (పీడీపీ) ఆందోళన వ్యక్తం చేశారు. పంజాబ్‌లో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ప్రేమ్ సింగ్ (ఎస్ఏడీ) తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ఓటర్లను భయపెట్టేందుకు పోలీసులను వినియోగించిన తీరును ఆయన ప్రస్తావించారు. దీనిని కాంగ్రెస్ సభ్యులు వ్యతిరేకించారు. హిమాచల్ ప్రదేశ్‌లో కోతుల బెడద, రోడ్డుపై వదిలివేసిన ఆవుల బెడద ఎక్కువగా ఉందని, అవి పంటలను నాశనం చేస్తున్నాయని అనురాగ్ థాకూర్ (బీజేపీ) తెలిపారు. 60ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరికి పింఛన్ ఇవ్వాలని కౌషలేంద్ర కుమార్ (జేడీ-యూ) డిమాండు చేశారు. తమ నియోజకవర్గమైన షియోహార్‌లో చక్కెర రైతులకు పెండింగ్‌లో ఉన్న రుణబకాయిలను వెంటనే చెల్లించాలని రమాదేవి (బీజేపీ) కోరారు. అస్సాంలో వలే జార్ఖండ్‌లోనూ ఎన్ఆర్‌సీని చేపట్టాలని నిషికాంత్ దూబే (బీజేపీ) డిమాండు చేశారు. రాష్ట్రంలో బంగ్లాదేశీ చొరబాటుదారుల వల్ల జనసంబంధిత సమతుల్యత దెబ్బతింటోందని ఆయనన్నారు. కేన్సర్ కేసులు పెరిగిపోతున్నందున శంత్ కబీర్ నగర్‌లో కేన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని శరద్ త్రిపాఠి (బీజేపీ) డిమాండు చేశారు.

కరుణానిధి స్థానానికి 28న ఉపఎన్నిక

బెంగళూరు : మాజీ సీఎం కరుణానిధి మరణంతో ఖాళీ అయిన తిరువరూర్ స్థానానికి జనవరి 28న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2018 ఆగస్టులో కరుణానిధి మరణించారు. దీంతో నాలుగు నెలలుగా ఈ స్థానం ఖాళీగా ఉంది. జనవరి 10న నుంచి నామినేషన్లు దాఖలు చేయాలని ఎన్నికల సంఘం తెలిపింది. జనవరి 31న ఉప ఎన్నిక ఫలితం వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే 18మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు దినకరన్‌కు మద్దతు తెలపడంతో ఖాళీ అయిన స్థానాలకు సంబంధించి ఎన్నికల సంఘం ఎలాంటి ప్రకటన చేయలేదు.

అహ్మద్‌నగర్ మేయర్ ఎన్నికలో

బీజేపీ-ఎన్‌సీపీది అక్రమ బంధం : శివసేన

ముంబై : అహ్మద్‌నగర్ స్థానిక సంస్థ మేయర్ ఎన్నికలో బీజేపీకి ఎన్‌సీపీ మద్దతు ఇవ్వడం వల్ల తమకు ఎటువంటి నష్టమూ లేదని శివసేన సోమవారం తెలిపింది. ఆ రెండు పార్టీల మధ్య 'పాత అక్రమ రాజకీయ సంబంధాలు' మాత్రమే కొత్త నమూనాలో కనిపిస్తున్నాయని పేర్కొంది. 68 మంది సభ్యులున్న పౌర సంస్థలో కేవలం 14 సీట్లను మాత్రమే పార్టీ కలిగి ఉన్నప్పటికీ 37 ఓట్లు పోలయిన తర్వాత అహ్మద్‌నగర్ మేయర్‌గా గతవారం బీజేపీకి చెందిన బాబాసాహెబ్ వక్కాలే ఎన్నికయ్యారు. ఎన్‌సీపీ 18 మంది కార్పొరేటర్లు, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన నలుగురు, ఒక స్వతంత్ర అభ్యర్థి ఆయనకు ఓటు వేశారు. అయితే 24 స్థానాలతో అతిపెద్ద పార్టీగా శివసేన ఉంది. ఇదిలాఉండగా కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు కార్పొరేటర్లు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. 'బీజేపీ, ఎన్‌సీపీ రాజకీయ క్రీడ కారణంగా మాకు ఎటువంటి నష్టం లేదు. వారివి పాత రాజకీయ అక్రమ సంబంధాలు. ప్రస్తుత మహారాష్ట్ర ప్రభుత్వం ఆ సంబంధం ఆధారంగా ఏర్పడింది' అని శివసేన పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయం పేర్కొంది.



2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

రాజ్యసభలో తలాఖ్-తలాఖ్ బిల్లు వ్యతిరేకిస్తాం

బీజేపీ హటావో - దేశ్ భచావో నినాదంతో సాగుతాం..

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

విశాలాంధ్ర - కర్నూలు అర్బన్ : వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీదే విజయం అని పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కాగానే ఏపీకి ప్రత్యేక హోదాపై మొదటి సంతకం పెడతారన్నారు. బీవీఎస్ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కర్నూలు అసెంబ్లీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా ఆయన హాజరై పాత్రికేయులతో మాట్లాడుతూ కర్నూలు కాంగ్రెస్‌పార్టీకి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వేసిన పునాది బలంగా ఉందన్నారు. తలాఖ్- తలాఖ్ బిల్లు విషయంలో బీజేపీ ఆటలు సాగవని రాజ్య సభలో బిల్లును వ్యతిరేకిస్తామన్నారు. నాలుగున్నరేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్‌పార్టీ చత్తీస్‌ఘడ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీ అమలు చేశామన్నారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్‌పార్టీ రాహుల్‌గాంధీని చైర్మెన్‌గా నియమించిందని, ఆకమిటీలో కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డికి స్థానం దక్కిందన్నారు. కర్నూలు వేదికగా రాయలసీమ సమస్యలపై త్వరలో రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని రఘువీరా వివరించారు. ఎన్నికల్లో విజయం కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. శ్రీశైలం నియోజకవర్గం నుంచి త్వరలో బస్సుయాత్రను ప్రారంభిస్తామని, ఏపీలో పొత్తులపై నిర్ణయం తీసుకోవడానికి రాహుల్‌గాంధీ అదేశాల మేరకు జనవరి 3న ఢిల్లీకి వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షులు బి. లక్ష్మీరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీఖాన్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు సర్దార్ బుచ్చిబాబు ఉన్నారు.

25 జీవాలు మృతి.. రూ.2లక్షల మేర నష్టం

ఆందోళనలో కాపరి కుటుంబం

విశాలాంధ్ర - రొంపిచర్ల : పగలంతా మేత కోసం పొలం గట్టులపై, కొండ గుట్టలపై తిరిగి సాయంత్రానికి ఇంటికి చేరుకొని యజమాని పెట్టిన దాణా తిని నిద్రకు ఉప క్రమించిన జీవా లు ఏమైందో ఏమో తెలియదు తెల్లవారేసరికి మృత్యువాత కు గురయ్యాయి. మరికొన్ని జీవాల పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమ వారం ఉదయం గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలంలోని వడ్లమూడి వారిపాలెం గ్రామంలో వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన ఆరేటి సుబ్బయ్య జీవాలు కొనుగోలు చేసి మేపుకుంటూ మళ్లీ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించు కునేవాడు. ఇదే క్రమంలో మూడు నెలల క్రితం 50 జీవాలను కొనుగోలు చేసి మేపుకుంటూ ఉన్న తరుణంలో ఇటీవల వచ్చిన బేరం కాదని సంక్రాంతికి మంచి గిరాకీ వస్తోందని అప్పులు తీర్చు కోవచ్చున్న ఆశతో ఉన్నవారి ఆశలు ఆవిరయ్యాయి. ఎప్పటి లాగా పొలం వెళ్లి ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించిన జీవాలు అకస్మాత్తుగా 25 మృతి చెందడం ఆ నిరుపేద కుటుంబం జీర్ణించు కోలేక పోతోంది. సమాచారం అందుకు న్న వైద్య బృందం గ్రామానికి చేరుకొని మృతి చెంది న జీవాలను పరిశీలించి పంచనామా నిర్వహించింది. సేకరించిన భాగాలను టెస్ట్ నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. మిగిలిన జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు. మరికొన్నిటి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, గుంటూరు డివిజన్ రైల్వే బోర్డు సభ్యులు వడ్లమూడి శివరా మయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిరుపేద అయిన సుబ్బయ్య కుటుం బాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. మిగిలిన జీవాలకు అత్యవసర వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. జీవాల మృతిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వైద్యులు సుజాత, రమేష్ బాబు, పశు వ్యాధి నిర్ధారణ అధికారి కళావతి మృతి చెందిన జీవాలను పరిశీలించారు.



బీజేపీ, టీడీపీలను తరిమికొడదాం

- అన్నిరంగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- నాలుగేళ్లుగా ప్రజలను వంచించాయి
- నిర్వాసితుల త్యాగఫలమే పోలవరం
- రాజధానిలో 33 వేల ఎకరాలను లాక్కున్నారు
- దోపిడీ ఆగాలంటే నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం

విశాలాంధ్ర - బుట్టాయగూడెం: రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయం కోసం సీపీఐ, సీపీఎంలు జనసేనతో కలిసి చేసే ప్రయత్నానికి, పోరాటాలకు ప్రజాస్వామికవాదులు, ప్రజలు మద్దతివ్వాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీని తిరిగి అధికారంలోకి రాకుండా, రాష్ట్రంలో తెలుగుదేశం, వైసీపీలను తరిమికొట్టాలన్నారు. వామపక్ష ప్రజాతంత్ర కూటమిని గద్దె నెక్కించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమగోదావరిజిల్లా బుట్టాయగూడెంలో సోమ వారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో రాజకీయ ప్రత్యామ్నాయం అంశంపై నిర్వహించిన బహిరంగసభలో వారు ప్రసంగించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ మునీర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ రవి అధ్యక్షత వహించిన సభలో కె రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వాలు నాలుగు న్నరేళ్ళుగా ప్రజల్ని వంచించాయన్నారు. నిర్వాసితుల త్యాగాల ఫలితంగానే పోలవరం ప్రాజెక్టు రూపుదిద్దుకుం టుందని, అయితే నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. రాజధాని అమరావతిలో 33 వేల ఎకరాల భూములను రైతులనుంచి లాక్కొని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వాధినేతలు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చేవరకూ వామపక్షాల పోరాటం ఆగదన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరికి దొరికింది వారు దోచుకుంటున్నారని, ఈ దోపిడీ ఆగాలంటే నూతన ప్రత్యామ్నాయం అవసరమన్నారు. జనసేనతో కలిసి సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ పార్టీ ఇతర వామపక్ష పార్టీల ఐక్య పోరాటాలకు అండగా నిలవడం ద్వారా అవినీతి,మతోన్మాద పార్టీలకు బుద్ధి చెప్పాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. పి మధు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత సమస్యలు చట్టుముట్టా యన్నారు. విద్య, వైద్య రంగాలకు సంబంధించి కీలక సంస్థ లు నేటికీ హైదరాబాద్‌లోనే ఉన్నాయన్నారు. ఆయా రంగాలను ఇక్కడ అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉంద న్నారు. ఇలా అనేక విషయాలను విస్మరిస్తున్న తెలుగు దేశం ప్రభుత్వం రాజధాని, పోలవరం చుట్టూ ప్రదక్షిణలు చేస్తోం దన్నారు. కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో చంద్రబా బును గద్దెదించటంతో పాటు ఏనాడూ అసెంబ్లీకిరాని వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను రాజకీయాల నుంచి తరిమి కొట్టాలని మధు పిలుపునిచ్చారు. చంద్రబాబుది బుక్కా పకీరు పాలన అన్నారు. సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, జనసేన నియోజకవర్గ నాయకులు కరాటం సాయిచంద్ర మోహన్, సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, అప్‌లాండ్ జిల్లా కార్యదర్శి చింతకాయుల బాబూరావు, ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెన్మత్స అప్పలరాజు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ మునీర్ పాల్గొన్నారు.

బాబుది దొంగల ముఠా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ



విశాలాంధ్ర - ఒంగోలు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుది దొంగల ముఠా అని, ఇప్పటి వరకు రాష్ట్రాన్ని దోచుకున్నవారు ఇప్పుడు దేశాన్ని దోచుకునేందుకు సన్నద్ధమయ్యారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీని దింపేందుందుకు అవినీతి పరులతో కలిసి కూటమిని ఏర్పాటు చేశారన్నారు. దేశ ప్రజలు నేటికీ నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. నరేంద్ర మోడీ మరో సారి దేశ ప్రధాని అవ్వటం ప్రస్తుత పరిస్థితులలో ఎంతో అవసరమన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో మూడు రాష్ట్రాలలో బీజేపీ ఓటమి పాలైతే పాకిస్తాన్‌లోని టెర్రరిస్టుల యూనియన్లు, వైనాలోనూ సంబరాలు జరుపుకున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎవరి కోసం పని చేస్తున్నారో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చున్నారు. అగస్టా కుంభ కోణంలో సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్ గాంధీ ఉన్నారని ఒకవైపు దేశం కోడై కూస్తున్నదన్నారు. దేశంలో అవినీతిరహిత పాలన మోడీ తోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారెడ్డి, మహిళా మోర్చానాయకులు తోట విజయలక్ష్మీ, ఖలీఫాతుల్లా బాషా, బొద్దులూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

పుష్పప్రదర్శన కనువిందు



విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : విశాఖ ఉత్సవాల్లో భాగంగా వుడా సెంట్రల్ పార్క్‌లో పుష్ప ప్రదర్శన ప్రజలను కనువిందు చేస్తోంది. ఆఖరి రోజు సోమ వారం లక్షలాదిమంది పుష్పప్రదర్శనను సందర్శించడంతో కోలాహలం నెలకొంది. వివిధ రకాల ఆకృతులతో కూడిన పుష్పాలు మంత్ర ముగ్ధులను చేశాయి. విదేశీ పూలతో పాటు బెంగుళూర్, ముంబాయి నుంచి తెచ్చిన ప్రత్యేక పూలు ఎంతగానో అలరించాయి.

పీఏబీఆర్ కుడి కాలువకు 3 టీఎంసీల నీరివ్వాలని

రైతుల బైఠాయింపు

- బలవంత తరలింపుకు పోలీసులు యత్నం, ఉద్రిక్తత
- సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్ సహా ఆరుగురు అరెస్టు



పోలీసు జీపును అడ్డుకున్న రైతులను లాగేస్తున్న పోలీసులు



హంద్రీనీవా కార్యాలయం వద్ద బైఠాయించిన రైతులు, మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్

విశాలాంధ్ర-అనంతపురం : పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా 49 చెరువులు నింపడానికి 3 టీఎంసీల నీరు విడుదల చేయాలని సీపీఐ, రైతు సంఘాల ఆధ్వర్యంలో హంద్రీనీవా ఎస్‌ఈ కార్యాలయం వద్ద సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆందోళన కొనసాగింది. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయం గేటు మూసివేసి రైతులు బైఠాయించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ సీఈ, హెచ్‌ఎల్సీ ఇన్‌చార్జ్ ఎస్‌ఈలు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నందున సాయంత్రం 4 గంటల వరకు వారు వచ్చే పరిస్థితి లేదని అధికారులు సమాచారం అందించారు. సీఈ, ఎస్‌ఈ వచ్చిన తరువాత సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లాలని పోలీసులు తెలిపారు. అయితే రైతులు అందుకు అంగీకరించలేదు. అధికారులు వచ్చే వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని భీష్మించారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి రైతులను పంపించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా రైతులు, పోలీసుల మధ్య వాగ్వావాదం, తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్‌ను బలవంతంగా అక్కడి నుంచి ఎత్తుకెళ్లి జీపులో పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. రైతులు జీపు ముందు బైఠాయించి అడ్డుకున్నారు. రైతులను పక్కకు లాగేసి జగదీష్‌తో పాటు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.కాటమయ్య, సీపీఐ శింగనమల నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి సహా అరుగురిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముకుందాపురం గ్రామానికి చెందిన యువ రైతు ప్రతాప్ గాయపడ్డారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఆ రైతు పక్కనే ఉన్న హెచ్‌ఎల్సీ కాలువలోకి దూకేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు, రైతులు అడ్డుకున్నారు. సాయంత్రం 4 గంటలకు సీఈ, ఎస్‌ఈ వచ్చే వరకు రైతులు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయం ఆవరణంలోనే వేచి ఉన్నారు. ఎస్‌ఈ, సీఈ సాయంత్రం 4 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్, మాజీ మంత్రి శైలజనాథ్, వైసీపీ నేత అలూరి సాంబశివారెడ్డి, టీడీపీ నేత ముంటిమడగు కేశవరెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.జాఫర్, రైతు సంఘం నాయకులు మల్లికార్జున, కాటమయ్య తదితరులు సీఈ, ఎస్‌ఈతో మాట్లాడుతూ పీఏబీఆర్ కుడి కాలువకు వీలైనంత ఎక్కువ నీరు విడుదల చేసే అవకాశాలపై చర్చించారు. తుంగభద్ర ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్ వాటా 2 టీఎంసీలల్లో ఒక టీఎంసీ నీటిని తాగునీటి అవసరాల కోసం తెచ్చుకునే అవకాశాలపై, పీఏబీఆర్ నుంచి కుడి కాలువకు కేటాయించిన 0.8 టీఎంసీలు కాకుండా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి వంద క్యూసెక్కుల నీటిని పీఏబీఆర్‌కు మళ్లించి అక్కడి కుడి కాలువకు 90 రోజుల పాటు విడుదల చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. దీనిపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కలెక్టర్‌తో చర్చించాలని నేతలకు సీఈ జలంధర్ తెలియజేశారు. అంతకు ముందు ధర్నాను ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్ మాట్లాడుతూ పండ్ల తోటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌ఎల్సీ ద్వారా అనంతపురం జిల్లాకు అదనంగా 5 టీఎంసీలు కేటాయించాలని డిమాండు చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ రైతులు లక్షల రూపాయిలు వ్యయం చేసి ఏళ్ల తరబడి పెంచుకున్న పండ్ల తోటలు ఎండిపోయే దశకు చేరుకోవడంతో కడుపు మండి ఆందోళన చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. రైతుల దుస్థితిని అర్థం చేసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని నీటిపారుదల శాఖ, పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, రాప్తాడు మండల కార్యదర్శి ఎస్. నాగరాజు, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి ఎం.రమేష్, రైతు సంఘం నాయకులు రాము, పండ్ల తోటల సంఘం నాయకులు అనంత రాముడుతో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



వినియోగదారుల రక్షణ చట్టం నుంచి

వైద్యానికి మినహాయింపు

ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు డా॥పొట్లూరి

విశాలాంధ్ర - గుడివాడ : వినియోగదారుల రక్షణ చట్టం నుండి వైద్యరంగాన్ని మినహాయించాలని, పేదలకు వైద్యం అందించకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను పునఃసమీ క్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ ఉపాధ్యక్షులు డా॥ పొట్లూరి గంగాధరరావు కోరారు. కృష్ణాజిల్లా గుడివాడలోని ఐఎంఏ హాల్‌లో సోమ వారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఐఎంఏ వైద్యులు ఎంతో నిబద్ధతతో పేదలకు వైద్య సేవలనందిస్తున్నారన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం వైద్య విధానంలో ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసి అటు డాక్టర్లు, ఇటు ప్రజలను ఆయోమయానికి గురి చేయాలని చూస్తోందన్నారు. 1994లో వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి వైద్య రంగాన్ని తీసుకువచ్చారన్నారు. ఇప్పటికే పలుమార్లు బిల్లు ఆమోదం పొందకుండా ఉండేలా ఐఎంఏ అవిరళ కృషి చేసిందన్నారు. మెడికల్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందారని, రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమానికి వైద్యులు సహకరిస్తున్నారని, చెల్లించే క్లయిమ్ మొత్తాన్ని పెంచాలని డిమాండు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి ఆ మొత్తాన్ని పెంచుతామని హామీ యివ్వడం అభినందనీయ మన్నారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లక్ష క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చెల్లించాల్సిన రూ.800 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండు చేశారు. జనవరి 4వ తేదీన దేశవ్యాప్తంగా ఆసు పత్రుల బంద్, నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఐఎంఏ నాయకులు డీఆర్‌కే ప్రసాద్, సోమూరి వెంకట్రావు మాట్లాడుతూ జాతీయ కార్యవర్గంలో గుడివాడ నుండి డా॥పొట్లూరికి జాతీయ ఉపాధ్యక్షులుగా, వెనువెంటనే పొలిటికల్ లైజనింగ్ కమిటీ, స్టాండింగ్ కమిటీల్లో డా.పొట్లూరికి స్థానం దక్కడం అభినందనీయమన్నారు. సమావేశంలో డా॥జయప్రకాష్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో

ట్రయల్‌రన్ విజయవంతం

8న జాతికి అంకితం చేయనున్న సీఎం



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రంలో మరొక విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ట్రయల్ రన్ విజయవంతమైందని, ఈ నెల 8న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా దీనిని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని ఇంధన, పెట్టుబడి మౌలిక సదుపాయాల ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ వెల్లడించారు. సోమవారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలో సీఎం ప్రారంభించే ఎయిర్‌పోర్టు పనులను జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, జిల్లా ఎస్పీ డాక్టర్ కె.ఫక్కీరలతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. జైన్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో 2017 జూన్‌లో ముఖ్య మంత్రి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారని, దీనిని ఈ నెల 8న ప్రారంభించనున్నారన్నారు. రెండు నెలల వ్యవధిలో విమాన సర్వీస్‌లో సంబంధించిన అన్ని అనుమతులు పొంది రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. వెయ్యి ఎకరాల్లో రూ.వంద కోట్ల పెట్టుబడితో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు జేఆర్సీ సంస్థ వేగవంతంగా పూర్తి చేసిందన్నారు. జిల్లా ప్రజలకు ఎయిర్‌పోర్టు కల నేడు సాకారం కానుందని, ఈ ప్రాంతం నుంచి అరగంట వ్యవధిలో విజయవాడకు వెళ్లొచ్చున్నారు. తొలుత విజయ వాడ, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. 18 నెలల కాలంలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులు వేగవంతమయ్యేలా సహకరించిన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. ఏప్రిల్, మే నుంచి విమాన సర్వీసుల్లో ప్రయాణించవచ్చున్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ ఓర్వకల్లు ప్రాంతం పరిశ్రమల హబ్‌గా ఏర్పడుతున్న తరుణంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు పూర్తి కావడం శుభపరిణామమన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అను కూలమైన భూములున్నాయని, ఎయిర్‌పోర్టు పూర్తి కావడం వల్ల పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలు స్థాపించేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. జిల్లాలో సుప్రసిద్ధమైన ఆధ్యాత్మిక క్షేత్రాలున్నాయని, పర్యాటలకు సైతం అనుకూ లంగా ఉంటుందన్నారు. గని, శకునాల ప్రాంతాల్లోని కర్నూలు అల్ట్రామెగా సోలార్ పార్కులో ముఖ్యమంత్రి ఏర్పాటుకు సంబంధించి హెలిప్యాడ్ సందర్శన ప్రాంతాలను కలెక్టర్, ఎస్పీలు సందర్శించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మల్లెల రాజశేఖర్, ఇందనశాఖ ఎనర్జీ కన్సర్‌జేషన్ మిషన్ సీఈవో ఎ.చంద్రశేఖర్ రెడ్డి, ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సీఈవో వీరేంద్ర సింగ్, జేఆర్సీ కాంట్రాక్టర్ జనార్ధన్ రెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే జనార్ధన్ రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ట్రైనీ ఎస్పీ నాయుడు తదితరులున్నారు.

మహిళా నక్సలైట్ లొంగుబాటు



విశాలాంధ్ర - పోలవరం : పశ్చిమ గోదావరి జిల్లా పోలవరంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రకాశ్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్న ధర్మన్న దళానికి చెందిన మహిళా నక్సలైట్ సీతారత్నం అలియాస్ సీతాలు లొంగిపోయారు. పోలవరం డీఎస్పీ ఏటీవీ రవికుమార్ ఈమె వివరాలను మీడియాకు తెలిపారు. ఇదే జిల్లా బుట్టాయిగూడెం మండలం రెడ్డికోపల్లె గ్రామానికి చెందిన వేట్ల సీతారత్నం కేఆర్‌పురం ఐటీడీఏలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం కొయ్యలగూడెంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ మధ్యలో నిలిపివేశారు. బాల్యం నుంచి విప్లవభావాలు కలిగిన సీతారత్నం పరిసరాల్లో అరుణోదయ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలకు, పార్టీ సమావేశాలకు వెళ్తుండేవారు. ఈ సందర్భంలో ధర్మన్న దళం సభ్యులతో పరిచయం కావడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా 2015 సంవత్సరంలో ధర్మన్నదళంలో చేరింది. పశ్చిమగోదావరి జిల్లా అడవుల్లో, తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం అటవీప్రాంతాల్లో దళ సభ్యురాలిగా పనిచేశారు. దళ సభ్యులతో అభిప్రాయ భేదాలు రావడంతో ధర్మన్నదళం నుంచి 2018 అక్టోబర్ నెలలో బయటకు వచ్చారు. బుట్టాయిగూడెం మండలం రెడ్డికోపల్లి గ్రామంలో తల్లిదండ్రుల వద్దకు చేరినట్టు సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ ఎస్ రవి ప్రకాష్ ఆదేశాలతో పోలవరం డీఎస్పీ రవికుమార్, బుట్టాయిగూడెం ఎస్ఐ ఆనందరెడ్డితోపాటు పోలీసులు ఆమెపై నిఘా ఉంచారు. రాకపోకలను గమనిస్తున్నారు. ఆమెను కలిసిన పోలీసులకు దళ సభ్యులతో అభిప్రాయబేధాల కారణంగా లొంగిపోతున్నట్లు చెప్పారని డీఎస్పీ తెలిపారు. మరికొంతమంది సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అజ్ఞాతదళ సభ్యులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవడానికి సిద్ధంగా ఉన్నట్లు డీఎస్పీ రవికుమార్ వివరించారు.

వేడెక్కిన ఆళ్ళగడ్డ రాజకీయాలు

- త్వరలో వైసీపీలోకి ఇరిగెల సోదరులు
- బరిలో నిలిచేదెవరు ?

విశాలాంధ్ర బ్యూరో కర్నూలు : ఆళ్ళగడ్డ అంటే గతంలో బాంబుల గడ్డగా పేరు ఉండేది. కానీ నేడు అక్కడ ప్రశాంతంగా ప్రజలు జీవనం సాగిస్తున్నారు. అక్కడ రాజకీయాల్లో భూమా నాగిరెడ్డి - గంగుల కుటుంబాలదే హవా. 40 ఏళ్ల నుంచి రెండు కుటుంబాలు నియోజకవర్గంలో రాజకీయాలను శాసిస్తున్నాయి. ఈ రెండు కుటుంబాలు వేర్వేరు పార్టీల్లో ఉంటుంటారు. 2009 ఎన్నికల ముందు భూమా నాగిరెడ్డి, ఆయన సతీమణి భూమా శోభానాగిరెడ్డిలు టీడీపీ వీడి ప్రజారాజ్యం పార్టీలో చేరగా, గంగుల కుటుంబం కాంగ్రెస్‌లో ఉంది. టీడీపీకి జెండా కట్టెవారు లేని సమయంలో ఇరిగెల రాంపుల్లారెడ్డి సోదరులు టీడీపీలో చేరి కార్యకర్తలకు అండగా నిలిచారు. అనంతరం వైఎస్‌ఆర్ మృతి తరువాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైసీపీ పార్టీ స్థాపించడంతో భూమా కుటుంబానికి ఆ కుంటుంబంతో ఉన్న బంధుత్వం కారణంగా వైసీపీలో చేరిపోయారు. 2014ఎన్నికల సమయంలో రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా దెబ్బతినడంతో గంగుల కుటుంబం టీడీపీలో చేరిపోయింది. 2014 ఎన్నికలలో గంగుల ప్రభాకర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగగా ఇరిగెల సోదరులు గంగుల విజయానికి కృషిచేశారు. భూమా శోభానాగిరెడ్డి వైసీపీ అభ్యర్థిగా రంగంలోకి రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో, ఉప ఎన్నికలలో భూమా అఖిలప్రియ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం టీడీపీ అధికారంలోకి రాగా, అనంతరం రాష్ట్రంలో జరిగిన రాజకీయాల మార్పులలో భాగంగా భూమానాగిరెడ్డి, ఆయన కుమార్తె భూమా అఖిలప్రియలు టీడీపీలో చేరిపోయారు. గంగుల, భూమా కుటుంబాలతోపాటు ఇరిగెల రాంపుల్లారెడ్డి కుటుంబం టీడీపీలో కొంత కాలం కొనాసాగాయి. భూమా అఖిలప్రియ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత గంగుల ప్రభాకర్‌రెడ్డి వైసీపీలో చేరిపోయారు. జగన్‌మోహన్‌రెడ్డి గంగుల ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్సీ సీటు కేటాయించడంతో ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికైనారు. భూమా నాగిరెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడంతో నంద్యాల ఉప ఎన్నికలోల భూమా బ్రహ్మానందరెడ్డిని విజయం సాధించారు. ఇప్పటి వరకు రాజకీయాల్లో తన వర్గంను కాపాడుకుంటూ వస్తున్న ఇరిగెల కుటుంబం ఎన్నికలు సమీపిస్తుండటంతో తమ భవిష్యత్ ఏమిటని ఆలోచనలో పడ్డారు. శనివారం ఆళ్ళగడ్డలో కార్యకర్తల సమావేశం నిర్వహించిన ఇరిగెల సోదరులు చంద్రబాబుపై విమర్శలు చేశారు. పార్టీకి జెండా కట్టెవాళ్ళు లేని సమయంలో టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటే పార్టీ తగిన న్యాయం చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ, వైసీపీలో చేరుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఇప్పటికే జగన్‌మోహన్‌రెడ్డితో చర్చలు నిర్వహించినట్లు తెలుస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇరిగెల సోదరులను పార్టీలో చేరుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఇరిగెల సోదరులు త్వరలో వైసీపీ కండువ కప్పుకొనున్నట్లు వార్తలు వస్తున్నాయి. 2014 ఎన్నికల తరువాత ఆళ్ళగడ్డలో రాజకీయంగా ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఎన్నికలలో గంగుల, ఇరిగెల కుటుంబాలు టీడీపీలో ఉండగా, భూమా కుటుంబం మాత్రం వైసీపీలో ఉంది. ఎన్నికల తరువాత భూమా కుటుంబం టీడీపీలో చేరగా ఆళ్ళగడ్డలో వైసీపీ జెండా కట్టెవాళ్ళు కూడా లేకుండా పోయారు. భూమా, ఇరిగెల, గంగుల కుటుంబాలు మూడు టీడీపీలోనే ఉన్నాయి.అయితే భూమా కుటుంబం టీడీపీలో చేరడం జీర్ణించుకోలేని గుంగుల కుటుంబం టీడీపీ వీడి వైసీపీలో చేరిపోయింది. గంగుల కుటుంబం వైసీపీలో చేరడంతో వైసీపీలో కొత్తఉత్సాహం వచ్చింది. ఇది ఇలా ఉంటే ఇరిగెల కుటుంబం కూడా వైసీపీలో చేరనుండటంతో టీడీపీ పెద్దనష్టమే జరుగుతుందని రాజకీయ నేతలు అంటున్నారు. అయితే ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో భూమా, గంగుల కుటుంబాలదే హవా ఉంటుందంటున్నారు. రాబోవు ఎన్నికలలో టీడీపీ నుంచి ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో మంత్రి అఖిలప్రియ రంగంలో దిగే అవకాశాలు ఎక్కువగా ఉండగా, అదిష్టానం ఏవైనా మార్పులు చేస్తే భూమా కుటుంబం నుండే మరోకరు రంగంలో దిగే అవకాశాలు ఉన్నాయి. వైసీపీ నుంచి గంగుల నాని రంగంలో ఉంటారని ఇప్పటి వరకు ప్రచారం ఉంది. ఇరిగెల కుటుంబం పార్టీలో చేరితే వైసీపీ అభ్యర్థి ఎవరు అనేది ప్రశ్నార్థకరంగా మారింది. గంగులప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉండగా అదే కుటుంబానికి చెందిన మరొకరికి ఆళ్ళగడ్డ నియోజకవర్గం నుంచి దించుతారా అనేది ప్రశ్నగా మారగా, నంద్యాల ఎంపీగా గతంలో రెండుసార్లు విజయం సాధించిన గంగుల సొదరుడు గంగులప్రతాపరెడ్డి రాబోయో ఎన్నికలలో నంద్యాల ఎంపీగా టీడీపీ నుంచి రంగంలో దిగేందుకు ప్రయత్నం చేస్తున్నారు. గంగుల ప్రతాపరెడ్డి నంద్యాల నుంచి ఎంపీగా పోటీ చేస్తే ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో గంగుల వర్గీయులు ఎటువైపు నిలుస్తారు అనేది అయోమయంలో పడవేస్తుందనడంలో సందేహం లేదు. దీంతో ఆళ్ళగడ్డ రాజకీయాలు గరంగరంగా మారాయి. 2019 ఎన్నికలలో ఆళ్ళగడ్డలో భూమా కుటుంబాన్ని ఎదుర్కొనేందుకు గుంగుల, ఇరిగెల కుటుంబాలలో ఎవరు రంగంలోకి దిగుతారనేది చర్చనీయాంశంగా మారింది.

మోడీ.. 100 రోజులు.. 20 రాష్ట్రాలు

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రచారాన్ని ముమ్మరం చేసిన బీజేపీ



న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో పరాభవాన్ని చవిచూసిన భారతీయ జనతా పార్టీ సార్వత్రిక ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటి నుంచే వ్యూహారచన చేస్తోంది. తక్కువ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెడుతోంది. స్థానిక పార్టీలతో కూటములకు సిద్ధమవుతోంది. ప్రచారాల్లోనూ వేగం పెంచుతోంది. ముఖ్యంగా వచ్చే 100 రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ 20 రాష్ట్రాల్లో పర్యటించి బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.ఇప్పటికే ప్రధాని మోడీ సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఒడిశా, అసోంలలో పర్యటించి బహిరంగ సభల్లో ప్రసంగించారు. జనవరి 4న మోడీ మరోసారి అసోంలో పర్యటించనున్నారు. ఐదో తేదిన ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో బహిరంగ సభలో పాల్గొననున్నారు. అలా మార్చి వరకు 20 రాష్ట్రాల్లో మోడీ ప్రచారం చేపట్టనున్నారు.

మరోవైపు 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసి ఓటమిపాలైన 123 నియోజకవర్గాలపై పార్టీ ఈసారి ప్రత్యేక దృష్టిపెట్టింది. 'మిషన్ 123' పేరుతో ఈ 123 నియోజకవర్గాలను 25 క్లస్టర్లుగా విభజించి.. ఒక్కో క్లస్టర్ బాధ్యతలను ఒక్కో నాయకుడికి అప్పజెప్పింది. ఇక తొలిసారి ఓటర్లను ఆకర్షించేందుకు 'నేషన్ విత్ నమో' నెట్‌వర్క్‌ను జనవరి 12న ప్రారంభించనుంది. ఆయా ప్రాంతాల్లో అత్యంత ప్రభావవంతమైన యువకులను గుర్తించి వారి ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేయనుంది.దీంతో పాటు ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా బూత్ స్థాయిలో కార్యకర్తలను బలోపేతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇక జనవరి 11, 12 తేదీల్లో ఢిల్లీ వేదికగా పార్టీ నేషనల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేశారు. దాదాపు 15000 మంది భాజపా నేతలు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. జిల్లా స్థాయి కార్యకర్తలను కూడా ఈ సమావేశానికి ఆహ్వానిస్తోంది.



నూతన సంవత్సర సందర్భంగా విజయవాడ విశాలాంధ్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ప్రొగ్రెసివ్ ఫోరం జాతీయ నాయకులు బుడ్డిగ జమిందార్

తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబు

గులాబీ నేతల మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై గులాబీనేతలు మండిపడ్డారు. చంద్రబాబులా పూటకో మాట మాట్లాడే అలవాటు కేసీఆర్‌కు లేదన్నారు. ఆంధ్రా ప్రజలే బాబుకు బుద్ధి చెబుతారన్నారు. అడ్డదారుల్లో పోవడం చంద్రబాబుకు అలవాటన్నారు.

శుక్రవారం తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి, బాల్క సుమన్, నోముల నర్సింహయ్య, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు విభజన తప్పదని తెలిసినా చంద్రబాబు ఎన్నో కుట్రలు చేశారని మండిపడ్డారు. తెలంగాణకు పచ్చి వ్యతిరేకి చంద్రబాబు అని అన్నారు.

కేసీఆర్ భాషను చంద్రబాబు ఎందుకు తప్పుపడుతున్నారో అర్థం కావడం లేదని, ఆయనలాంటి అవినీతిపరుడు దేశంలో ఎవ్వరూ లేరని విమర్శించారు. హైటెక్ సిటీ అభివృద్ధి వెనుక చంద్రబాబు కుట్ర కోణాన్ని హార్వర్డ్ యూనివర్సిటీ విద్యార్థిని తన పరిశోధనా పత్రంలో నిరూపించారని వారు గుర్తుచేశారు. అభివృద్ధి పేరుతో శిలాఫలకాలు వేయడంలో చంద్రబాబును మించిన వారు లేరన్నారు. ఊసరవెల్లిలా రంగులు మార్చే బాబును చూసి ఏపీ ప్రజలు సైతం సిగ్గుపడుతున్నారని వ్యాఖ్యానించారు.

మృణాల్‌సేన్ మృతికి సీపీఐ సంతాపం

న్యూఢిల్లీ : ప్రముఖ బెంగాలీ దర్శకుడు మృణాల్‌సేన్ మృతికి సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం తీవ్రం సంతాపం ప్రకటిం చింది. భారతదేశ వామపక్ష ఉద్యమాలకు ఆయన చాలా దగ్గరగా ఉన్నారని గుర్తు చేసింది. భారతీయ సినిమాలో ఆయనకంటూ ఓ గుర్తింపు ఉందని తెలిపింది.

సామ్యవాద సైద్ధాంతిక నేపథ్యంలో మానవత్వం నిండిన కథాంశాలతో ఆయన అనేక చిత్రాలను తెరకెక్కించారని సీపీఐ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. చిత్రనిర్మాణంలో కొత్త పోకడలను పరిచయం చేశారని, తనదైన శైలితో భారతీయ సినిమాకే గుర్తింపు తెచ్చారని వ్యాఖ్యానించింది. మృణాల్‌సేన్‌కు సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది.

నుమాయిష్ షురూ..



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అఖిల భారత పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన (నుమాయిష్) నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జనవరి 1 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరగనుంది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాల ఉత్పత్తులు లభిస్తాయి. 2500 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. వ్యాపార దృక్పథంతో కాకుండా మంచి ఆశయం కోసం దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఆదాయంతో 18 విద్యా సంస్థలను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందుతునట్లు తెలిపారు. సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని, స్క్రీపింగ్ మిషన్లను విరివిగా ఏర్పాటు చేశామని అన్నారు. నుమాయిష్ సందర్భంగా పోలీసులు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. మొదటిసారిగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నుమాయిష్‌ని అప్పటి నిజాం స్టేట్ ప్రధానమంత్రి సర్ అక్బర్ హైదరీ ప్రారంభించారు. దాన్ని విజయవంతం చేసేందుకు ఆనాటి నగర మున్సిపల్ కమిషనర్ నవాబ్ మెహిది నవాజ్ జంగ్ బహదూర్ కృషి చేశారు. నుమాయిష్ నిర్వహణ కోసం అప్పట్లో సమీకరించిన నిధి రెండున్నర వేలు మాత్రమే. అంత తక్కువ బడ్జెట్‌తో ప్రారంభమైన ఎగ్జిబిషన్‌కు నిజాం ప్రభుత్వం పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించింది. ఆ ప్రోత్సాహంతో అసోసి యేషన్‌కు కొన్ని ఆర్థిక కష్టాలు తప్పాయి. తొలి ప్రదర్శనలో 100 స్టాళ్లు ఏర్పాటు చేశారు. 15 రోజులపాటు సాగిన ఆ ఎగ్జిబిషన్‌ని 50 వేల మంది సందర్శించారు. తొలి నుమా యిష్‌లో లక్ష రూపాయల విక్రయాలు జరిగాయి. తర్వాత స్థలం సరిపోకపోవడంతో 1942లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలించారు. 50 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ 1946లో అప్పటి నిజాం ప్రధానమంత్రి మిర్జా ఇస్మాయిల్ ఫర్మాన్ జారీ చేశాడు. 1956లో ఎగ్జిబిషన్ సొసైటీని కంపెనీ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ గ్రాడ్యుయేట్స్ ఆలోచనల్లోంచి పురుడు పోసుకున్న నుమాయిష్ ఇంతింతై వటుడింతై అన్నట్లు సాగింది. 100 స్టాళ్ల నుంచి నేడు 2500 స్టాళ్లతో ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వస్తు ప్రదర్శనశాలగా ఎదిగింది. 2015లో నుమాయిష్ ప్లాటినం జూబ్లీ వేడుకలు మరుపురానిది. ప్రచార సాధనాలు, హంగూ ఆర్భాటాలు లేని ఆ కాలంలోనే కొత్త ఉత్పత్తులను ఆన్వేషించే వేదికగా నిలిచింది. 46 రోజుల్లో వంద కోట్లకు పైగా క్రయ విక్రయాలు సాగించడమంటే మాటలు కాదు. కొత్త ఉత్ప త్తులను అంతర్జాతీయ స్థాయిలో వినియోగదారులకు పరి చయం చేసేందుకు ఎంతోమంది పారిశ్రామిక వేత్తలు నుమాయిష్‌ను వేదికగా చేసుకుంటారు. రోజుకు కొన్ని లక్షల మంది ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు వస్తారు కాబట్టి నిర్వాహకుల కోరిక మేరకు మెట్రో రైలు సేవలనూ పొడిగించారు. సందర్శకుల కోసం రాత్రి 11.30 వరకు సర్వీసులు నడపాలని మెట్రో అధికారులు నిర్ణయించారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఓపెన్ ఎయిర్ థియేటర్; సందర్శకులు విశ్రాంతి తీసుకునేందుకు విశాలమైన పచ్చిక బయళ్లను ఏర్పాటు చేశారు.

ప్రజలకు చేరువవుదాం..

కమ్యూనిస్టులకు ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరుక్రైం: ఆధునికకాలంలో పెట్టుబడిదారీ పార్టీలు నీతిరహితంగా డబ్బుతో రాజకీయాలు చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు నీతి, సైద్ధాంతిక అవగాహన, అంకితభావం, ఓర్పు, ప్రజలతో మమేకం కావడం ద్వారా



ప్రతి కమ్యూనిస్టు ప్రజలకు చేరువకావాలని, 2019 సంవత్సరం కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలకు చేరువ చేయడానికి, పట్టుదలతో పనిచేయాలని, కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరకూ ఆయన విజ్ఞప్తిచేశారు. సోమవారం ఇక్కడి మల్లయ్య లింగం భవన్‌లో 2018సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2019 సంవత్సరానికి స్వాగతం పలికే ఆత్మీయ కలయిక సభలో ముప్పాళ్ల, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సభకు నగర పార్టీ కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ ప్రపంచీకరణ అనంతరం మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతాయని, కారల్ మార్క్స్ గతకాలంలో చెప్పిన సూక్తి నేడు మన దేశంలో నిజమైందని మానవ సంబంధాలు, సమాజవిలువలు, అనుబంధం, ఆత్మీయత అన్నీ చెదిరిపోయి ధనమే పరమావధిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక విలువలతో కూడిన సరికొత్త సమాజం కోసం దేశభక్తులు, లౌకికవాదులు కృషిచేయడం ద్వారా ధనస్వామ్య శక్తులు, మతోన్మాద శక్తులకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. 2019 సంవత్సరం మెరుగైన సమాజ నిర్మాణానికి, బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి పట్టుదలతో పనిచేద్దామని ముప్పాళ్ల అన్నారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ 2018లో రెండు బలమైన ఉద్యమాలకు సీపీఐ నాయకత్వం వహించినదని, మొదటిది ప్రత్యేక హోదా విభజన హామీల సాధనాంశాన్ని ప్రజల సమస్యలుగా నిలబెట్టడం, రెండవది 20లక్షల మంది అగ్రిగోల్డు బాధితులకు డబ్బు పంపిణీ గ్యారంటీ చేయించడం అన్నారు. అగ్రిగోల్డు బాధితుల ఉద్యమానికి గతనాలుగు సంవత్సరాలుగా నాయకత్వం వహించి, చివరకు నిరవధిక దీక్షకు పూనుకొని, ప్రభుత్వం మెడలు వంచి జనవరి నాల్గవ వారంలో డిపాజిట్లు చెల్లించేటట్లు ప్రభుత్వంచేత అంగీకరింపచేయడం చరిత్రాత్మక విజయమని, ముప్పాళ్లతో పాటు తిరుపతిరావు, విశ్వనాథరెడ్డిలు నిరవధిక దీక్షకు కూర్చుని విజయం సాధించడం అసాధారణమైనటు వంటి విషయమని పేర్కొన్నారు. అరసం జాతీయ కార్యదర్శి పి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో సీపీఐ మరన్నీ విజయవంతమైన పోరాటాలు నిర్వహిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర నాయకులు పీవీ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రజల ఆశలకు, ఆలోచనలకు పార్టీని చేరువ చేయడంలో 2019 సీపీఐకి మంచి సంవత్సరంగా నిలుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కోట మాల్యాద్రి మాట్లాడుతూ, అసంఘటితరంగ ప్రజలను, ప్రజలలో సగభాగం ఉన్న మహిళలకు, గ్రామీణ రైతు, రైతు కూలీలకు సీపీఐ ఆత్మబంధువుగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలబడుతుందని పేర్కొన్నారు. హనుమంతరెడ్డి, పులి సాంబశివరావు, డిహెచ్‌పిఎస్ ప్రసాదు, ఏఐటీయూసీ నాయకులు జి సురేష్, బత్తుల శివాజి, నూతలపాటి వెంకటేశ్వర్లు, అమీర్‌వలి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి సుబ్బారావు, అగ్రిగోల్డు కస్టమర్స్ అండ్ ఏజెంట్సు అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బివి చంద్రశేఖర్, జిల్లా నాయకులు అగస్టీన్, కరిముల్లా, జి తాండవకృష్ణ, బి పూర్ణ తదితరులు ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సత్కరించిన సీపీఐ గుంటూరు నగర సమితి

లక్షలాది అగ్రిగోల్డు బాధితుల ఆశాజ్యోతిగా పటిష్ట మైన ఉద్యమంతో అసాధారణ విజయసాధనకు మార్గదర్శిగా నిలిచిన ముప్పాళ్లకు సీపీఐ నగర జిల్లా సమితి, ప్రజా సంఘాల నాయకులు ఆత్మీయ సత్కారం చేశారు. బీవీ చంద్రశేఖర్, అగస్టీన్, కరిముల్లాల అంకిత భావానికి, చేసిన కృషికి అభినం దనలు తెలుపుతూ దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముప్పాళ్ల, జంగాల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

దేశంలోనే పటిష్టంగా ఏపీ పోలీసు

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశంలోనే ఏపీ పోలీసు వ్యవస్థ పటిష్టమైనదని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం జరిగిన ఆత్మీయ సభలో సీఎం చంద్రబాబును పోలీసులు సన్మానించారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ పటిష్టంగా లేకుంటే సమాజానికి రక్షణ లేదన్నారు. ఏపీలో పోలీసు వ్యవస్థ పనితీరు బాగుందని ప్రశంసించారు. పదోన్నతుల ద్వారా పోలీసుల ఆత్మగౌరవం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో 2019 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతులు ఇచ్చామన్నారు. ఏఆర్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులకు కూడా త్వరలో పదోన్నతులు ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రహోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ కొత్తగా వచ్చిన పోలీసులలో అత్యధికులు ఉన్నత విద్యా వంతులే ఉన్నారు. పోలీసుల పనితీరు మెరుగ్గా ఉండటం వలన నేరాల శాతం తగ్గిందన్నారు. హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతులు కల్పించినందుకు సీఎం చంద్రబాబును పోలీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా, జడ్పీ చైరపర్సన్ గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ కార్యాలయంలో వంద అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ

సోమవారం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వంద అడుగుల జాతీయ జెండాను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం పోలీసు పెట్రోలింగ్, ఇతర అవసరాల నిమిత్తం 1580 వాహనాలను డీజీపీ ఆర్‌పీ ఠాకూర్‌కు సీఎం అందజేశారు.


తగ్గిన గ్యాస్ ధర



న్యూఢిల్లీ : వంట గ్యాస్ ధరను సిలిండర్‌కు రూ.5.91 మేరకు తగ్గిస్తున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. నెలరోజుల వ్యవధిలో వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గడం ఇది రెండోసారి కావడం గమనార్హం. తగ్గించిన వంట గ్యాస్ ధరలు సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయి. డిసెంబరు 1న సబ్సిడీతో కూడిన వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.6.52 మేర తగ్గించారు. జూన్ నుంచి ఆరు సార్లు వరుసగా సిలిండర్ ధర పెంపు తర్వాత తొలిసారిగా డిసెంబరు 1న ధరలు దిగివచ్చాయి. కాగా సబ్సిడీయేతర సిలిండర్ ధరను రూ.120.50 తగ్గించినట్లు ఐఓసీ తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు తగ్గడం, డాలర్‌తో రూపాయి విలువ బలపడటంతో వంట గ్యాస్ ధరలు దిగివచ్చాయని ఐఓసీ వెల్లడించింది.


ఈ ఫ్యామిలీ బామ్ ఏమిటి?

అగస్టా కేసుపై అమిత్‌షా వ్యంగ్యాస్త్రాలు



న్యూఢిల్లీ : అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణం కేసులో మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్ వెల్లడిస్తున్న వివరాలపై బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఘాటుగానే స్పందించారు. మధ్యవర్తులందరూ 'ఫ్యామిలీ బామ్' కావాలంటున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన ఇచ్చిన నాలుగు ట్వీట్లలో మిషెల్ తరపు న్యాయవాదికి ఓ విజ్ఞప్తి చేశారు. మిషెల్, భారతదేశం లోని ఓ కుటుంబం మధ్య ఉన్న స్నేహం ఏమిటో వివ రించాలని కోరారు. 'అగస్టా వెస్ట్‌లాండ్ కేసు జాడలు... క్రిస్టియన్ మిషెల్ రక్షణ కోసం కేకలు...గాంధీపై ప్రశ్నిస్తున్న వివరాలను క్రిస్టియన్ మిషెల్ తన న్యాయవాదికి ఎందుకు ఇచ్చారో ఎవరికైనా తెలుసా? ఆ వివరాలు నేరుగా సోనియాకి అందాలని ఆయన కోరుకున్నారా? ఎందుకు?' అని ఓ ట్వీట్‌లో అమిత్ షా ప్రశ్నించారు. రెండో ట్వీట్‌లో 'ఆ కాగితం తనకు అందిందని మిషెల్ న్యాయవాది అంగీకరించారు. అది మందుల జాబితా అని ఆయన అనుకున్నారు. దానిని పారదర్శకంగా ఏ సందర్భంలోనైనా ఇవ్వవచ్చు. జండు బామ్, టైగర్‌బామ్ గురించి విన్నాం కానీ, ప్రతి మధ్యవర్తి కోరుకుంటున్న ఈ 'ఫ్యామిలీ బామ్' ఏమిటబ్బా?' అని పేర్కొన్నారు. మూడో ట్వీట్‌లో 'ఏమైనప్పటికీ, మళ్లీ మళ్లీ చెప్పవలసినది ఏమిటంటే, మిషెల్ తరపు న్యాయవాదికి కాంగ్రెస్ నేపథ్యం గురించి చెప్పాలి. ఆయనను (కాంగ్రెస్ నుంచి) బహిష్కరించడమనేది బూటకం. ఆయన మిషెల్‌కు, సోనియాకు వారధిగా కొనసాగుతున్నారు' అని పేర్కొన్నారు. నాలుగో ట్వీట్‌లో 'దేశ ప్రయోజనాల కోసం, 2008 నాటి డాక్యుమెంట్ల గురించి మిషెల్ తరపు న్యాయవాది మనకు చెప్పాలి. స్పష్టంగా తెలిసేదేమంటే, మిషెల్‌కు, భారతదేశంలోని ఓ కుటుంబానికి మధ్య మైత్రి కాల పరీక్షకు నిలిచినది, గాఢమైనది' అని పేర్కొన్నారు. క్రిస్టియన్ మిషెల్ తరపున వాదిస్తున్న న్యాయవాది అల్జో కే జోసెఫ్ గతంలో యువజన కాంగ్రెస్ లీగల్‌సెల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.


ఓటమిపై కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ ఇంకా తేరుకోలేనట్టు ఉంది. మహాకూటమిగా అవతరించినా ఫలితం దక్కలేదు. కాంగ్రెస్‌లోని పెద్ద తలకాయలు సైతం ఓటమి బాట పట్టారు. ఫలితాలు. ఓటమిపై పోస్టుమార్టం నిర్వహించేందుకు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కుంతియా హైదరాబాద్‌కు వచ్చారు. సోమవారం గోల్కొండ హోటల్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సలీం, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు షబ్బీర్‌అలీ, సంపత్, దామోదర్‌రెడ్డి, అద్దంకి దయాకర్ పాల్గొన్నారు. ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై ఈ సమావేశంలో ఆరా తీశారు. దానితో పాటు తక్కువ ఓట్లతో ఓడిన అభ్యర్థులతో చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంపై ఎలాంటి అనుమానాలున్నా న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధమవ్వాలని వారు నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా కుంతియా మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బులు వెదజల్లి, అధికార దుర్వినియోగంతో కేసీఆర్ గెలిచారన్నారు. ఓట్ల తొలగింపుపై ఎన్నికల తర్వాత అధికారులు క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. ధర్మపురి, కోదాడ, ఇబ్రహీంపట్నంలో ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ఎన్నికల్లో టీఆర్ఎస్ అక్రమాలపై కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. కలెక్టర్లపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ఈసీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై హైకోర్టుకు వెళ్తామన్నారు. కేసుల్లో క్లీన్‌చిట్ కోసమే మోడీకి కేసీఆర్, నవీన్ పట్నాయక్ మద్దతు పలుకుతున్నారని కుంతియా ఆరోపించారు. మరోవైపు సీఈవో రజత్ కుమార్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత దామోదర రాజనర్సింహ ఫైర్ అయ్యారు. రజత్ నిర్ణయాలపై అనుమానాలు న్యాయని, రైతుబంధు పథకం డబ్బులు నేరుగా బ్యాంకులో వేయాలని రజత్ కుమార్ ఎందుకు చెప్పాలని ఓటమి అనంతరం ఇప్పుడు ప్రశ్నించారు. పార్టీ ఓటమికి అందరం బాధ్యులేమన్నారు.

మిత్రుల నుంచి ఒత్తిడి లేదు

బీజేపీ నేత ముక్తార్ అబ్బాస్ నక్వీ




న్యూఢిల్లీ : ఎన్డీఏ నుంచి టీడీపీ, ఆర్ఎల్ఎస్పీలు వీడిన పరిస్థితిని బీజేపీ తగ్గించే చూపే ప్రయత్నం చేసింది. 2019 ఎన్నికల నేపథ్యంలో మిత్రపక్షాల నుంచి తమ పార్టీ ఎటువంటి ఒత్తిడిని ఎదుర్కోవడం లేదని బీజేపీ సీనియర్ నేత ముక్తార్ అబ్బాస్ నక్వీ పేర్కొన్నారు. 'సొంత రాజకీయ కారణాలతో' వెళ్లేవారిని ఆపివేయలేమని అన్నారు. కొన్ని నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ తన కీలక మిత్రపక్షాలు రెండింటిని కోల్పోయింది. చంద్రబాబునాయుడుకి చెందిన తెలుగుదేశం పార్టీ(టీడీపీ) మార్చి నెలలో ఎన్డీఏను వీడగా, ఉపేంద్ర, కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ(ఆర్ఎల్ఎస్పీ) డిసెంబరులో బీహార్‌లోని ప్రతిపక్ష కూటమి చెంతకు చేరింది. కాగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో సీట్ల పంపిణీపై మిత్రపక్షాల నుంచి బీజేపీ ఒత్తిడి ఎదుర్కొంటుందా అని ప్రశ్నించగా, బీజేపీ ఎప్పుడూ మిత్రులను గౌరవిస్తూ, వారి చెప్పేది వింటుందని నక్వీ పేర్కొన్నారు. 'ఆమోదయోగ్యమైన విషయాలు మేము అంగీకరించాలి. కలిసి ముందుకు సాగాలి' అని చెప్పారు. సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ), అప్నాదళ్(ఎస్) వంటి ఎన్డీపీ మిత్రపక్షాలు అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

చిన్న పరిశ్రమలకు పెద్దపీట

నాలుగున్నరేళ్లలో రూ.82వేల కోట్ల రుణాలు

పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై సీఎం శ్వేతపత్రం విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్ల కాలంలో రూ.82,097 కోట్ల రుణాలను ఎంఎస్‌ఎంఈ రంగానికి విడుదల చేశామని, చిన్న పరిశ్రమలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున చిన్న, మధ్యతరహా పరిశ్రమ పార్కులు ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అమరావతి ప్రజావేదికలో సోమవారం పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివ ృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లా డుతూ 12శాతం వృద్ధి రావాలని లక్ష్యంగా పెట్టుకుంటే 10.5శాతం వ ృద్ధి సాధించామని వెల్లడించారు. విభజన లాంటి చారిత్రక కారణాల వల్ల ఏపీలో సేవలరంగం, పారిశ్రామిక రంగాలు ఇంకా వెనుకంజలో ఉన్నాయన్నారు. కేంద్రం ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే ఈరంగాల్లో మరింత మెరుగైన అభివృద్ధి సాధించే వారమన్నారు. పెట్రో కెమికల్ కాంప్లెక్స్, స్టీల్‌ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు, ఐటీ కారిడార్ ఇలా అన్నిట్లోనూ కేంద్రం నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. అందుకే రాష్ట్రమే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ప్రజల తలసరి ఆదాయం పెంపులో కీలకమైన పరిశ్రమల రంగాన్ని వృద్ధి చేసేందుకు పది కీలకమైన పారిశ్రామిక విధానాలను తీసుకొచ్చామన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు.ఖాయిలా పడిన చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకునేందుకు రూ.100కోట్లు కేటాయించినట్లు సీఎం వివరించారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సుల కారణంగా కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. తిరుపతి మొబైల్ హబ్ గా తయారవుతోందని సీఎం తెలిపారు. విశాఖను ఐటీ కారిడార్ గా తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టం చేశారు. సంపద స ృష్టించేందుకు, తలసరి ఆదాయాన్ని పెంచేందుకు పరిశ్రమ, సేవల రంగాలే చోదకశక్తని అన్నారు. పరిశ్రమలు, సేవా రంగాల నుంచే అనేక దేశాలు అత్యధిక వృద్ధి సాధించాయన్నారు. ఆశించిన వృద్ధి సాధిస్తే రాష్ట్రం అభివృద్ధి చెంది నట్లవుతుందని, నైపుణ్యాభివృద్ధిని పెంచగలగాలని అన్నారు. వ్యవ సాయ అనుబంధ పరిశ్ర మల్లో అభివృద్ధి సాధిస్తే తప్ప అభివృద్ధి లక్ష్యానికి త్వరగా చేరుకోలేమని పేర్కొన్నారు. సర్వీస్ సెక్టార్ లో పర్యాటక రంగం



కీలకమని, హెల్త్ టూరిజం, ఎడ్యుకేషన్, టూరిజం గ్రోత్ ఇంజిన్లని విశ్లేషించారు. ఢిల్లీ-ముంబై పారిశ్రామిక కారిడార్‌లో మాత్రం పెట్టుబడి పెట్టిన కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం- చెన్నై పారిశ్రామిక కారిడార్ కోసం గ్రాంటు ఇవ్వలేదు, పెట్టుబడి పెట్టలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. గ్రీన్ ఫీల్డ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పెట్టాలన్న హామీ కార్యరూపం దాల్చలేదన్నారు. కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పాలన్న హామీనీ కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారంటీ చట్టం-2017 తెచ్చామని గుర్తు చేశారు.

ఇది పరిశ్రమలకు అవసరమైన 74 సేవలను నిర్ణీత కాల వ్యవధిలో అందజేయడానికి అవసరమైన చట్టంగా పేర్కొన్నారు. రామాయపట్నం పోర్టు పనులకు జనవరి 9వ తేదీన శ్రీకారం చుడతామని, అదేరోజు పేపరు మిల్లు ఏర్పాటుకు కూడా పునాదిరాయి పడుతుందని సీఎం చెప్పారు. కర్నూలు ఎయిర్‌పోర్టుకు విమానం ట్రయల్‌రన్ విజయవంత మైందని, దగదర్తి, కుప్పంనుంచి త్వరలో విమానరాకపోకలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈసమావేశంలో పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

ఐసీసీ టీ20 కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్



దుబాయ్: భారత మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) టీ20 కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈ ఏడాదికిగాను అత్యుత్తమ మహిళా క్రికెట్ జట్లను ఐసీసీ ఎంపిక చేయగా, అందులో టీ 20 విభాగంలో హర్మన్ ప్రీత్ కెప్టెన్‌గా నియమించబడ్డారు. ఈ మేరకు సోమవారం అత్యు త్తమ మహిళా వన్డే, టీ20 జట్లను ఐసీసీ ప్రకటిం చింది. టీ 20 ఫార్మాట్‌లో భారత్ నుంచి హర్మన్‌తో పాటు స్మ ృతీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు చోటు దక్కింది. ఇక వన్డే విభాగంలో భారత్ నుంచి స్మ ృతీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు మాత్రమే స్థానం దక్కగా, కెప్టెన్‌గా న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ నియమించబడ్డారు. 2018గాను క్రీడాకారిణుల ప్రదర్శనలో భాగంగా మీడియా-బ్రాడ్‌కాస్టర్స్ సభ్యులతో కూడిన బృందం విడివిడిగా రెండు అత్యుత్తమ జట్లను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంది. నవంబర్‌లో జరిగిన ఐసీసీ మహిళల వరల్డ్ టీ20లో భారత జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరడంలో హర్మన్ ప్రీత్ కీలక పాత్ర పోషించారు. ఆ టోర్నమెంట్‌లో కౌర్ 160.5 స్ట్రైక్‌రేట్‌తో 183 పరుగులు చేశారు. 2018లో హర్మన్ ప్రీత్ 25 టీ20 మ్యాచ్‌లుఆడి 126.1 స్ట్రైక్‌రేట్‌తో 663 పరుగులు సాధించారు. మరొకవైపు ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో కౌర్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు.

ఐసీసీ మహిళా టీ20 జట్టు:

హర్మన్ ప్రీత్ కౌర్(కెప్టెన్, భారత్), స్మృతీ మంధాన(భారత్), అలైస్సా హేలీ(ఆస్ట్రేలియా, వికెట్ కీపర్), సుజీ బేట్స్(న్యూజిలాండ్), నాటేటీ స్కీవర్(ఇంగ్లండ్), ఎలైసె పెర్రీ (ఆస్ట్రేలియా), అష్లే గార్డనర్(ఆస్ట్రేలియా), కాస్పెర్క్ (న్యూజిలాండ్), మెగాన్ స్కట్ (ఆస్ట్రేలియా), రుమానా అహ్మద్(బంగ్లాదేశ్), పూనమ్ యాదవ్(భారత్)

ఐసీసీ వన్డే జట్టు:

సుజీ బేట్స్(కెప్టెన్, న్యూజిలాండ్), స్మృతీ మంధాన, టామీ బీమౌంట్(ఇంగ్లండ్), డేన్‌వాన్ నీకెర్క్(దక్షిణాఫ్రికా), సోఫీ డివైన్(న్యూజిలాండ్), అలైస్సా హేలీ(వికెట్ కీపర్, ఆస్ట్రేలియా), మారింజన్నే కాప్(దక్షిణాఫ్రికా), డాటిన్(వెస్టిండీస్), సానా మిర్(పాకిస్తాన్), సోఫీ ఎక్లేస్టోన్(ఇంగ్లండ్), పూనమ్ యాదవ్(భారత్)

స్మృతీ మంధాన అరుదైన ఘనత



దుబాయ్: ఈ ఏడాదికిగాను భారత మహిళా జట్టు క్రికెటర్ స్మృతి మంధాన వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌తో పాటు వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది అద్భుతంగా రాణించిన మంధాన ఒక క్యాలెండర్ ఇయర్‌లో రెండు ఐసీసీ అవార్డులను దక్కించుకున్న తొలి భారత మహిళా క్రికెటర్‌గా అరుదైన రికార్డును నెలకొల్పారు. ప్రధానంగా వెస్టిండీస్‌లో మహిళా వరల్డ్ టీ20ల్లో భారత్ సెమీ ఫైనల్ చేరడంలో మంధాన కీలక పాత్ర పోషించారు. ఆ టోర్నీలో 125పైగా స్ట్రైక్‌రేట్‌తో 178 పరుగులు సాధించారు. ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మంధాన ఓవరాల్‌గా 1291 పరుగులు చేశారు. 12 వన్డేలకు గాను 669 పరుగులు సాధించిన మంధాన.. 25 టీ20ల్లో 622 పరుగులు చేశారు. ఈ ఏడాది వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఐదు హాఫ్ సెంచరీలు సాధించడం మరో విశేషం. అదే సమయంలో ఐసీసీ ప్రకటించిన అత్యుత్తమ వన్డే, టీ20 జట్లలో కూడా మంధాన చోటు దక్కించుకున్నారు. దాంతో ఏక కాలంలో రెండు ఐసీసీ అవార్డులు మంధాన సొంతమయ్యాయి. 2018 ప్రదర్శనలో భాగంగా మీడియా-బ్రాడ్‌కాస్టర్స్ సభ్యులతో కూడిన బృందం ఓటింగ్ పద్ధతిలో అత్యుత్తమ క్రీడాకారిణులను ఎన్నుకోవడంతో పాటు రెండు అత్యుత్తమ జట్లను ఎంపిక చేశారు.

నేటి నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం

జనవరి 11 వరకు నిర్వహణ



విశాలాంధ్ర-విజయవాడ: నగరంలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్(స్వరాజ్య మైదానం)లో జనవరి 1 నుంచి 11వ తేదీ వరకు 30వ విజయవాడ పుస్తక మహోత్సవం నిర్వహిం చనున్నట్లు విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య, కో-ఆర్డినేటర్ 'ఎమెస్కో' విజయ్‌కుమార్ తెలిపారు. పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది పుస్తక మహోత్సవాన్ని విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయు క్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుస్తక మహో త్సవ ప్రాంగణానికి నవభారత్ బుక్ హౌస్ వ్యవస్థాపకులు పీఎస్ ప్రకాశరావు పేరును, కార్యక్రమాలు జరిగే వేదికకు ప్రముఖ రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి పేరును పెట్టినట్లు చెప్పారు. జనవరి ఒకటో తేదీ సాయంత్రం 5.30 గంటలకు పుస్తక మహోత్సవాన్ని ప్రముఖ చరిత్రకారులు ఆచార్య రాజమోహన్‌గాంధీ, ఉషా గాంధీ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. విశిష్ట అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ ఆర్పీ సిసో డియా, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలక లూరి ఇనాక్, కృష్ణాజిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ప్రముఖ తత్వవేత్త ఆచార్య ఎ.రఘురామరాజు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొంటారని వివరించారు. అనంతరం ఏడు గంటలకు నవభారత్ బుక్ హౌస్ వ్యవస్థాపకులు పీఎస్ ప్రకాశరావు సంస్మరణ సభ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రోజూ ప్రముఖుల సంస్మరణ సభలు, సదస్సులు, విద్యార్థులకు పలు పోటీలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. నాలుగో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు పుస్తకప్రియుల పాదయాత్ర, అనంతరం సభ ఉంటాయని తెలిపారు. జనవరి 11వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు జరిగే ముగింపు సభలో ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వర రావు, విజయవాడ పోలీస్ కమిషనర్ ద్వారకా తిరుమలరావు, ప్రముఖ రచయిత పతంజలి శాస్త్రి పాల్గొంటారని, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారని చెప్పారు. ఈ పుస్తక మహోత్సవంలో ప్రత్యేకంగా ఓటు మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని తెలియజేస్తూ ఎన్నికల కమిషన్ ఒక స్టాల్‌ను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. దీనితోపాటు పలు ప్రభుత్వ ప్రచురణ సంస్థలు, ప్రముఖ ప్రైవేటు సంస్థలు తమ స్టాల్స్ ఏర్పాటు చేస్తాయని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ సీఈవో తరుణ్ కాకాని మాట్లాడుతూ పుస్తకమహోత్సవంలో ప్రత్యేకంగా యువత కోసం స్టార్టప్ కంపెనీల గురించి అవగాహన కల్పించేందుకు మూడు సదస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో బుక్‌ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షులు బి.బాబ్జి, అధ్యక్షులు ఎస్.వెంకటనారయణ, ఉపాధ్యక్షులు టి.మనోహర్‌నాయుడు, కోశాధికారి బి.రవి కుమార్, సంయుక్త కార్యదర్శి ఐఎన్‌వీ సంతోష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

లింగ సమానత్వ నినాదం.. హక్కుల పోరాటం

చారిత్రక మహిళా మానవహారం

- నేడు కేరళలో సుమారు 55 లక్షల మందితో 'ఉమెన్ వాల్'
- మైనార్టీలు, ఇతర వర్గాల నుంచి విశేష మద్దతు
- కాషాయ దళం దుష్ప్రచారానికి ధీటైన సమాధానం
- గిన్నీస్ బుక్‌లో చోటుకూ అవకాశం



న్యూఢిల్లీ: లింగ సమానత్వం, మహిళా హక్కులపై అవగాహన కల్పించేందుకు ఒక చారిత్రక కార్యక్రమానికి కేరళ వేదిక కానుంది. ప్రత్యేకించి కొత్త ఏడాది తొలి రోజు జరగనున్న ఈ వినూత్న కార్యక్రమం గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించనుంది. మహిళలు సుమారు 550 కిమీ మేర 'మహిళా గోడ' (మానవ హారం)కు అంకురార్పణ జరగనుంది. కేవలం దేశంతోనే పరిమితం కాకుండా ప్రపంచం యావత్తు తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ఈ చరిత్రాత్మక కార్యక్రమానికి తిరువనంతపురానికి దక్షిణ ప్రాంతంలోనూ, కసార్‌గడ్‌కు ఉత్తర ప్రాంతాలు వేదిక కానున్నాయి. సుమారు 55 లక్షల మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు సమాచారం. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారానికి ధీటైన సమాధానంగా ఈ 'మహిళా గోడ' కార్యక్రమం జరగనున్నది. బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమితోపాటు కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్(యూడీఎఫ్) నుండి ఈ కార్యక్రమానికి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. ఇప్పటికే కాషాయ దళం సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా 'అయ్యప్ప జ్యోతి' కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యంగా ప్రతిపక్షాలు ఈ 'మహిళా గోడ' కార్యక్రమం మత విద్వేషాలను మరింత పెంచుతుందంటూ తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేస్తున్నారు. మహిళలు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేస్తున్నదంటూ విమర్శలకు దిగుతున్నాయి. అయితే పినరయి విజయన్ ప్రభుత్వం ప్రతిపక్షాల ఆరోపణలను కొట్టిపారేసింది. మహిళల గౌరవాన్ని మరింత పెంచి లింగ సమానత్వ భావనను పెంపొందిస్తుందనేది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పినరయి ప్రభుత్వం నొక్కి వక్కాణిస్తోంది. మైనారిటీ వర్గాల మద్దతును కూడా ప్రభుత్వం కూడగట్టుకుంది. లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్‌లో చేరిన ఇండియన్ నేషనల్ లీగ్(ఐఎన్ఎల్) ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవంతమయ్యేందుకు తోడ్పాటును ప్రకటించింది. అదేవిధంగా మలాంకార చర్చి కూడా దీనికి తన సంఘీభావాన్ని ప్రకటించింది. కనీసం లక్ష మంది మహిళా మద్దతుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు హామీ ఇచ్చింది. మహిళల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం నుంచి ఒక సానుకూల చర్యగా జాకోలైట్ అభివర్ణించింది. మరో విషయమేమిటంటే, ఈ మహిళల మానవహారానికి సీపీఎం నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ సంఘీభావం ప్రకటించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.